

# నేటిధాత్రి

తెలుగు వార్త పత్రిక

22ND ANNIVERSARY

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

మంగళవారం 22-09-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 159 రూ॥ 6.00

## గాలిలో చెక్కర్లు బాలుడి కృష్ణ లీలలు? ఎపిసోడ్-1

# డిసి బాలకృష్ణే డిక్టేటర్!?




## "ఏసీబీ" రంగంలోకి దిగితే అసలు రంగు బైట పడుతుంది?





## ఆ బాలకృష్ణ 500 కోట్లు..ఈ బాలకృష్ణ 1000 కోట్లు?

## ఆ బాలకృష్ణకు ఈ బాలకృష్ణ తాత?






చీఫ్ ఎడిటర్
కట్టా రాఘువేందర్ రావ్
9063524136, 9908658888

- ఎన్ని ఫ్లోర్లు కట్టుకుంటావో కట్టుకోపో.. నీ ఇష్టం అంటాడు?
- చావు కబురు చల్లగా ఒక ఫ్లోర్ నాదని మెలిక పెడతాడు?
- సర్కిల్ లో ప్రైవేట్ సైన్యం పెట్టుకున్నాడు?
- వారానికి 20 లక్షలు తేవాలంటాడు?
- కట్టిన బిల్డింగులకు "హైడ్రా" పేరు చెబుతాడు?
- నోటీసులు ఇస్తామని బెదిరిస్తాడు?
- పెద్దల పేర్లన్ని చెబుతాడు?
- కీలక నాయకుల పేర్లు చెప్పి భయపెట్టిస్తాడు?
- వాళ్లందరికీ వాటాలు పంచాలని కట్టు కథలు చెబుతాడు?
- ఆ నాయకులకు తెలియకుండానే కథ మొత్తం నడిపిస్తున్నాడు?

**ఆ ప్రముఖులను అబాసుపాలు చేస్తున్నాడు?**

- ఓ రాజకీయ జాతీయపార్టీకి అనుబంధ సంస్థకు కూడా నోటీసిస్తా అని బెదిరిస్తున్నాడు?
- అందరికీ పంచంగా నాకేం మిగులుతుందని అంటాడు?
- ఎన్ని అంతస్తులు కట్టుకుంటావో కట్టుకో అని హుషారుగా చెబుతాడు?
- ఫ్లోర్లు పడగానే బెదిరింపులు మొదలు పెడతాడు?
- రాసిస్తావా.. కూల్చ మంటావా అని వార్నింగ్ ఇస్తాడు?
- బుల్డోజర్ పంపమంటావా అని హెచ్చరిస్తాడు?
- ఇప్పటి వరకు 1000 కోట్ల ఆస్తి కూడబెట్టాడని టాక్?

హైదరాబాద్, నేటిధాత్రి:

కష్టపడి చదివి ఉద్యోగం తెచ్చుకున్నది ప్రజలకు సేవ చేసేందుకు కాదు? ఉద్యోగం మాకు ఎవరి భిక్ష కాదు. పాలకులు ఇచ్చిందికాదు. ప్రజలు ఇచ్చిందికాదు. రాత్రి పగలుకష్టపడి ఉద్యోగం తెచ్చుకున్నది జనానికి ఫ్రీగా సర్వీస్‌చేసేందుకు కాదు? అన్నట్లే వుంది. కొంత మంది అధికారుల తీరు. వ్యవస్థలో చాలా మంది మంచి వాళ్లు వుంటారు. కాని పదికెదు మంది లంచావతారులు మూలంగా మొత్తం ఆ సమాజమే భ్రష్టు పట్టిపోతోంది. లంచాలకు అలవాటు పడి, పెన్ను

12 లో

## హైడ్రా "నైనై".. ఎపిసోడ్-2

## బాలకృష్ణ "సైసై"?






**త్వరలో మీ "నేటిధాత్రి"లో**




22ND ANNIVERSARY

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక


మంగళవారం 22-09-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 159 రూ॥ 6.00


## జూరాల ఆయకట్టుకు వెంటనే సాగునీళ్లు

# విడుదల చేయాలి

- రైతుల నిరసనలను అడ్డుకోవడం...బీఆర్ఎస్ నేతల అరెస్టులు దుర్మార్గం
- హరీశ్‌రావు తీవ్ర ఖండన.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం



హైదరాబాద్, నేటిధాత్రి:
జూరాల ఆయకట్టు రైతులకు వెంటనే సాగునీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేస్తున్న రైతులు, ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. రైతుల పక్షాన పోరాడుతున్న మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల



వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు ఇతర నాయకులను నిర్బంధించడం దుర్మార్గమని పేర్కొన్నారు.

### పాలమూరుకు నీళ్లెందుకు ఎత్తరు?

కృష్ణా జలాలను శ్రీశైలం నుంచి 738 కిలోమీటర్ల దూరంలోని పెన్నా బేసిన్‌లో ఉన్న కుప్పం వరకు తరలిస్తుంటే.. పక్కనే ఉన్న పాలమూరుకు మాత్రం ఎందుకు తరలించడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ పాలనా వైఫల్యం కాదా? పాలకుల చేతగానితనం కాదా? అని నిలదీశారు.

50 టీఎంసీల జలాశయాలున్నా.. కేసీఆర్ హయాంలో పాలమూరు ప్రాజెక్టులో భాగంగా నార్లపూర్ 8.51 టీఎంసీలు, ఏదుల 6.55 టీఎంసీలు, కరివెన 17.34 టీఎంసీలు, వట్టెం 16.74 టీఎంసీల సామర్థ్యంతో మొత్తం 50 టీఎంసీల జలాశయాలు నిర్మించినట్లు తెలిపారు. వాటిని నీటితో నింపే ఆలోచన కూడా ప్రభుత్వానికి

03 లో



## ప్రతి గ్రామపంచాయతీని

# మోడల్‌గా తీర్చిదిద్దాలి

- అక్టోబర్ 2న గ్రామసభల్లో అభివృద్ధి ప్రణాళికలకు తీర్మానాలు
- ప్రతి గ్రామంలో సగటున రూ.50 లక్షల పనులకు కార్యాచరణ
- ఉపాధి హామీ కింద రూ.6,700 కోట్ల వ్యయం
- గ్రామస్థాయిలో అధికారులు క్షేత్ర పర్యటనలు చేయాలి: మంత్రి సీతక్క

హైదరాబాద్, నేటిధాత్రి:
ప్రతి గ్రామపంచాయతీని మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ 2న గ్రామసభలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ ఏడాది చేపట్టాల్సిన పనులు, కార్యాచరణ ప్రణాళికపై

03 లో

## హెల్త్ ఇన్నోవేషన్స్‌కు తెలంగాణ

# ప్రధాన కేంద్రం

- ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, స్టార్టప్‌లతో హెల్త్‌కేర్ అనుసంధానం
- 50 మంది రోగులకు ఉచిత వైద్య ప్రొటోకాల్
- డయాబెటిస్, మెటబాలిక్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, నేటిధాత్రి:
హెల్త్ ఇన్నోవేషన్స్‌కు తెలంగాణను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం 'హోమా సీఎంఈ-2026' జాతీయ సదస్సును ప్రారంభించి 'ది న్యూ పారాడైమ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రపంచంలోనే తొలి ఉచిత మెటబాలిక్ కాలిక్యులేటర్ యాప్ 'మెట్రిక్ ఎక్స్‌ప్లోరర్'ను ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి 50 మంది రోగులకు ఉచిత ప్రొటోకాల్ అందిస్తున్నట్లు చెప్పారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, స్టార్టప్‌లను హెల్త్‌కేర్‌తో అనుసంధానం చేస్తూ హైదరాబాద్‌లో సమగ్ర ఆరోగ్య ఆవిష్కరణల వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. డయాబెటిస్, మెటబాలిక్ వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు జీవనశైలి సమాచార విశ్లేషణపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆరోగ్య రంగంలో కొత్త ఆలోచనలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వైద్య నిపుణులు, పరిశోధకులు ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని కోరారు.



## దానం నాగేందర్ అనర్హతపై

# బుధవారం విచారణ

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వెల్లడి
- హైకోర్టు తీర్పును సవాల్ చేసిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే
- ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఉందంటూ అత్యవసర విచారణకు రోహత్గి విజ్ఞప్తి
- కేవియట్ దాఖలు చేసిన ఏలేటి, పాడి కౌశిక్‌రెడ్డి

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌ను బుధవారం విచారిస్తామని సుప్రీంకోర్టు

03 లో

## పదవుల కంటే ప్రజల పక్షాన

# నిలబడటమే నాయకత్వం

- కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా హరీశ్‌రావు, కేటీఆర్ నివాళులు
- మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలిన మహనీయుడు: హరీశ్‌రావు
- ఉద్యమాలే ఊపిరిగా.. పోరాటాలే పరమావధిగా జీవించిన ధీశాలి: కేటీఆర్

హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ ఉద్యమ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్ ఘన నివాళులర్పించారు. తెలంగాణ కోసం బాపూజీ చేసిన త్యాగాలను, ప్రజా ఉద్యమాల్లో ఆయన పోషించిన కీలక పాత్రను గుర్తు చేసుకున్నారు.

**మంత్రి పదవినే వదులుకున్నారు**

కొండా లక్ష్మణ్ బాపూజీ పదవుల కంటే ప్రజల పక్షాన నిలబడటమే నాయకత్వమని తన ఆచరణతో చాటిన గొప్ప దార్శనికుడని బీఆర్ఎస్ డిప్యూటీ



ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు ఆయన జీవితం నిరంతర పోరాటంగా సాగిందన్నారు. 1969 తెలంగాణ ఉద్యమ సమయంలో మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకున్నారని గుర్తుచేశారు. బడుగు, బలహీన వర్గాలు, చేనేత కార్మికుల పట్ల ఆయన చూపిన

03 లో

## జూరాల ఆయకట్టుకు వెంటనే


# నీళ్లు విడుదల చేయాలి

- రైతులు అల్లాడుతుంటే ఎండాకాలం బూచిచూపడం సమంజసం కాదు: డీకే అరుణ
- జూరాలలో ఇప్పటికీ నీరు సమృద్ధిగా ఉంది
- పంటలను కాపాడేందుకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్

గద్వాల, నేటిధాత్రి:
జూరాల ఆయకట్టు రైతాంగానికి తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. రైతులు నీటి కోసం అల్లాడుతుంటే ఎండాకాలం పేరుతో నీటిని విడుదల చేయకుండా ఉండటం సమంజసం కాదని ఆమె అన్నారు. సోమవారం ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**జూరాలలో నీరు సమృద్ధిగా ఉంది**

జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం నీరు సమృద్ధిగా ఉందని డీకే అరుణ తెలిపారు. ఎండాకాలంలో నీటి ఇబ్బందులు ఎదురైతే ఎగువన కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని, అవసరమైన సమయంలో అక్కడి నుంచి నీటిని విడుదల చేయించుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం కృష్ణా నదికి వరదలు వచ్చే అవకాశం కూడా ఉందన్నారు.



రైతులు కూడా నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు.

**రైతుల ఆందోళనకు అండగా ఉంటాం**

జూరాల ఆయకట్టు రైతుల ఆందోళనకు అండగా నిలుస్తామని డీకే అరుణ స్పష్టం చేశారు. ఆదివారం జూరాల ప్రాజెక్టు కింద కాలువలకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జూరాల డ్యాం-గద్వాల-ఆత్మకూరు రహదారి, కర్నూలు-గద్వాల రహదారి, కలెక్టరేట్ ఎదుట రైతులు ఆందోళనలు చేపట్టారు. ఈ నిరసనలకు బీజేపీ నేతలు మద్దతు తెలిపారు.

**మంత్రి ఉత్తమ్‌కు ఫోన్**

జూరాల ఆయకట్టు రైతుల పరిస్థితిని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి డీకే అరుణ ఫోన్‌లో వివరించారు. తక్షణమే సాగునీటిని విడుదల చేసి సాగు చేసిన పంటలను కాపాడాలని కోరారు.



## పట్టణ పేదల సొంతింటి కలకు

# మరో అడుగు

**రాయదుర్గం మల్కం చెరువు వద్ద ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన**

- ఖరీదైన ప్రాంతాల్లోనే పేదలకు సొంత ఇళ్లు
- పైరవీలకు తావులేకుండా లాటరీలో పారదర్శక ఎంపిక
- ఉచిత రిజిస్ట్రేషన్‌తో ఇళ్లపై పూర్తి హక్కులు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, నేటిధాత్రి:
పట్టణ పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు వేసింది. శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గంలోని మల్కం చెరువు సమీపంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు.

పేదలను నగరానికి దూరంగా తరలించకుండా.. వారు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్లు నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. పేదవాడికి కేవలం ఇల్లు కాదు.. ఆత్మగౌరవంతో జీవించే చిరునామా కల్పించడమే లక్ష్యమన్నారు. భూముల విలువ భారీగా ఉన్న ప్రాంతాల్లోనే ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు.

**ఉచిత రిజిస్ట్రేషన్‌తో హక్కులు**

ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులకు 17 నుంచి 20 గజాల వరకు అన్‌డివైడెడ్ షేర్‌తో పాటు అపార్ట్‌మెంట్‌పై పూర్తి హక్కులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని పొంగులేటి తెలిపారు. రిజిస్ట్రేషన్ చార్జీలు లేకుండా సేల్‌డీడ్ అందించేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

**లాటరీలో లబ్ధిదారుల ఎంపిక**

లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం, పైరవీలకు తావులేదని మంత్రి స్పష్టం చేశారు. అర్హత ఆధారంగా లాటరీ విధానంలో పారదర్శకంగా ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ఒక్కో నియోజకవర్గంలో తొలి విడతగా 480 ఇళ్ల చొప్పున నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పారు.

**నగర పరిధిలో లక్ష ఇళ్లు**

గ్రామీణ ప్రాంతాల్లో తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల సాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు. హైదరాబాద్ నగర పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

**దశలవారీగా అందరికీ ఇళ్లు**

ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేద కుటుంబాలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని పొంగులేటి అన్నారు. రెండో, మూడో, నాలుగో, ఐదో విడతల్లోనూ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే రెండున్నరేళ్లలో అర్హులైన పేదలకు దశలవారీగా ఇళ్లు అందిస్తామని తెలిపారు. నిర్మాణాల్లో నాణ్యత విషయంలో రాజీపడబోమని స్పష్టం చేశారు.

## కేసీఆర్ కుటుంబం అడ్డగోలుగా

# దోచుకుంది!

- కేటీఆర్ చెబుతున్న వందల ఎకరాల్లో మా భూమి ఎక్కడ?
- సంతోష్‌రావుకు కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి?: రమ్యారావు
- కుదురుపాకలో ఒక్క కుటుంబానికే 8 ప్లాట్లు ఎలా?
- కేటీఆర్ ఎందుకు మౌనం వహిస్తున్నారు? అని నిలదీత

హైదరాబాద్, నేటిధాత్రి:
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలన చేస్తూ ప్రజల మద్దతు పొందుతుంటే.. బీఆర్ఎస్ నేతలు 22ఏ పేరుతో రాజకీయాలు చేస్తున్నారని టీపీసీసీ సీనియర్ నేత రమ్యారావు విమర్శించారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం అడ్డగోలుగా దోచుకుందని ఆరోపించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు.

***'వందల ఎకరాల్లో మా భూమి ఏది?'***

"మాకు వందల ఎకరాలు ఉన్నాయని కేటీఆర్ అంటున్నారు. నేను కేసీఆర్ సొంత అన్న బిడ్డను. కేటీఆర్ ఆరోపిస్తున్న ఆ వందల ఎకరాల్లో మా భూమి ఎక్కడ ఉంది? నేను, కవిత ఇద్దరం ఇంటి వాళ్లం. మాకు సంబంధంలేని సంతోష్‌రావు కేసీఆర్ వద్ద ఎందుకు ఉంటున్నారు? ఆయన సంపాదించిన ఆస్తులపై కేటీఆర్ ఎందుకు మౌనంగా ఉంటున్నారు?" అని రమ్యారావు ప్రశ్నించారు.

***కుదురుపాకలో 8 ప్లాట్ల ఆరోపణ***

సంతోష్‌రావుకు 2013లో క్వారీలో 25 శాతం వాటా ఉండేదని రమ్యారావు తెలిపారు. 2015లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులో ముంపునకు గురైందంటూ సంతోష్ కుటుంబ సభ్యులు ఇళ్ల పట్టాలు తీసుకున్నారని ఆరోపించారు.



కుదురుపాక గ్రామానికి సంబంధం లేని వారు కూడా ప్లాట్లు తీసుకున్నారని, సంతోష్‌రావు, ఆయన కుటుంబ సభ్యులు కలిసి ఎనిమిది ప్లాట్లు తీసుకున్నారని పేర్కొన్నారు.

***అఫిడవిట్‌లో ఒక్క ప్లాటే ఎందుకు?***

2018లో రాజ్యసభ అవకాశం వచ్చిన సందర్భంగా సంతోష్‌రావు తన అఫిడవిట్‌లో ఒక్క ప్లాట్ మాత్రమే చూపించారని రమ్యారావు ఆరోపించారు. ఎనిమిది ప్లాట్లు తీసుకుని ఒక్కదానినే అఫిడవిట్‌లో ఎలా చూపించారని ప్రశ్నించారు. కుదురుపాకలో ప్రధాన రహదారిపై బాధితుల భూములను కూడా కొనుగోలు చేశారని ఆరోపించారు.

***కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి?'***

కరీంనగర్‌లో ఉన్నప్పుడు సంతోష్‌రావుకు చెప్పులు కూడా లేవని రమ్యారావు వ్యాఖ్యానించారు. ఇప్పుడు కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. మార్కుక్ గ్రామంలో తొమ్మిది ఎకరాల భూమి, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లో భూమి, ఇల్లు ఎలా వచ్చాయని నిలదీశారు. 2018 తర్వాత కొండాపూర్, బంజారాహిల్స్‌లో ఆస్తులు ఎలా సమకూరాయని ప్రశ్నించారు.

**కేటీఆర్‌కు రమ్యారావు ప్రశ్నలు**

అక్కను, చెల్లిని ఇంటి నుంచి బయటకు పంపి సంతోష్‌రావును ఎందుకు పక్కన పెట్టుకున్నారని కేటీఆర్‌ను రమ్యారావు ప్రశ్నించారు. సంతోష్‌రావు భార్య రోహిణి పేరుతో నానక్‌రామ్‌గూడలో పెద్ద వాణిజ్య భవనం ఎలా వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

## బండ్లగూడ ఆర్టీవో ఆఫీసులో ఏసీబీ సోదాలు

- నగదు లెక్కిస్తున్న వీడియో వైరల్.. ఫిర్యాదుల నేపథ్యంలో ఆకస్మిక తనిఖీలు
- ఎంవీఐ, ఆర్టీవో, కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు
- ఫైళ్లు, రికార్డులను నిశితంగా పరిశీలించిన ఏసీబీ అధికారులు




హైదరాబాద్, నేటిధాత్రి:
బండ్లగూడ ఆర్టీవో కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వాహనదారుల నుంచి ఆర్టీవో కార్యాలయ సిబ్బందిపై పలు ఫిర్యాదులు అందడంతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగినట్లు సమాచారం. సరైన పత్రాలు ఉన్నప్పటికీ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని వాహనదారులు ఆరోపించిన నేపథ్యంలో తనిఖీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**నగదు లెక్కిస్తున్న వీడియో కలకలం**

కానిస్టేబుల్ అరుణ్ కార్యాలయంలోని ఓ చాంబర్‌లో నగదు లెక్కిస్తున్న దృశ్యాలు వీడియోలో నమోదయ్యాయి. ఈ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో వ్యవహారం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో ఏసీబీ బృందం కార్యాలయంలో తనిఖీలు నిర్వహించింది.

**ఫైళ్లు, రికార్డుల పరిశీలన**

ఏసీబీ అధికారులు ఆర్టీవో కార్యాలయ సిబ్బందిని ప్రశ్నించినట్లు సమాచారం. గంటకు పైగా తనిఖీలు కొనసాగినట్లు తెలుస్తోంది. కార్యాలయంలోని పలు ఫైళ్లు, రికార్డులను అధికారులు నిశితంగా పరిశీలించినట్లు సమాచారం. తనిఖీలు పూర్తయిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

**ముగ్గురు అధికారులపై సస్పెన్షన్**

బండ్లగూడ ఆర్టీవో కార్యాలయ ఘటనపై రవాణా శాఖ కమిషనర్ చర్యలు చేపట్టారు. ఎంవీఐ భీమ్‌సింగ్, ఆర్టీవో రామచందర్, కానిస్టేబుల్ అరుణ్‌లను సస్పెండ్ చేశారు. నగదు లెక్కిస్తున్న వీడియో వైరల్ కావడంతో రవాణా శాఖ ఉన్నతాధికారులు వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. ఏసీబీ తనిఖీల అనంతరం ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

# జూరాల ఆయకట్టుకు వెంటనే సాగునీళ్లు విడుదల చేయాలి

హైదరాబాద్, నేటిధాత్రి:
జూరాల ఆయకట్టు రైతులకు వెంటనే సాగునీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేస్తున్న రైతులు, ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. రైతుల పక్షాన పోరాడుతున్న మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు ఇతర నాయకులను నిర్బంధించడం దుర్మార్గమని పేర్కొన్నారు.

## పాలమూరుకు నీళ్లెందుకు ఎత్తరు?

కృష్ణా జలాలను శ్రీశైలం నుంచి 738 కిలోమీటర్ల దూరంలోని పెన్నా బేసిన్‌లో ఉన్న కుప్పం వరకు తరలిస్తుంటే.. పక్కనే ఉన్న పాలమూరుకు మాత్రం ఎందుకు తరలించడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ పాలనా వైఫల్యం కాదా? పాలకుల చేతగానితనం కాదా? అని నిలదీశారు.
50 టీఎంసీల జలాశయాలున్నా.. కేసీఆర్ హయాంలో పాలమూరు ప్రాజెక్టులో భాగంగా నార్లపూర్ 8.51 టీఎంసీలు, ఏదుల 6.55 టీఎంసీలు, కరివెన 17.34 టీఎంసీలు, వట్టెం 16.74 టీఎంసీల సామర్థ్యంతో మొత్తం 50 టీఎంసీల జలాశయాలు నిర్మించినట్లు తెలిపారు. వాటిని నీటితో నింపే ఆలోచన కూడా ప్రభుత్వానికి లేదని విమర్శించారు.

## కృష్ణాలో నీళ్లున్నా మోటర్లు ఎందుకు నడపలేదు?

గడిచిన రెండున్నరేళ్లలో కృష్ణానదిలో పుష్కలంగా నీరు పారినా మోటర్లు ఎందుకు నడపలేదని ప్రశ్నించారు. శ్రీశైలం నిండుకుండలా ఉన్న సమయంలోనూ రైతులకు నీటిని ఎత్తిపోసే ప్రయత్నం ఎందుకు చేయలేదన్నారు. కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్‌కు వదిలిపెట్టి తెలంగాణ రైతుల ప్రయోజనాలను గాలికొదిలేశారని ఆరోపించారు.

## జూరాలలో 8.4 టీఎంసీలున్నా..

జూరాల ప్రాజెక్టులో 8.4 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ ఆయకట్టు పంటలకు సాగునీరు ఎందుకు విడుదల చేయడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

## జూరాలను దిగ్బంధిస్తారా?

జూరాల ప్రాజెక్టును పోలీసులు పూర్తిగా దిగ్బంధించి, ఆనకట్ట పరిసరాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారని హరీశ్‌రావు తెలిపారు. కనిపించిన వారిని అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. రైతులు నీళ్లు అడిగితే వారి చేతులకు సంకెళ్లు వేస్తారా? అని ప్రశ్నించారు.

## రైతులపై నిర్లక్ష్యమెందుకు?

కృష్ణాలో నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నీటిని ఎత్తిపోకుండా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. నీటిని ఒడిసిపట్టకుండా వదిలేసి తెలంగాణకు జలద్రోహం చేశారని విమర్శించారు. తప్పు ప్రభుత్వం చేస్తే శిక్ష రైతులు అనుభవించాలా? అని నిలదీశారు.

## వెంటనే నీళ్లు విడుదల చేయాలి

పంట పొలాలకు సాగునీరు ఇవ్వడం చేతకాని ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం సిగ్గుచేటని హరీశ్‌రావు అన్నారు. జూరాల ఆయకట్టు రైతులకు వెంటనే సాగునీళ్లు విడుదల చేయాలని, అదుపులోకి తీసుకున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులను తక్షణమే విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

# పదవుల కంటే ప్రజల పక్షాన నిలబడటమే నాయకత్వం

హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ ఉద్యమ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్ ఘన నివాళులర్పించారు. తెలంగాణ కోసం బాపూజీ చేసిన త్యాగాలను, ప్రజా ఉద్యమాల్లో ఆయన పోషించిన కీలక పాత్రను గుర్తు చేసుకున్నారు.
మంత్రి పదవినే వదులుకున్నారు
కొండా లక్ష్మణ్ బాపూజీ పదవుల కంటే ప్రజల పక్షాన నిలబడటమే నాయకత్వమని తన ఆచరణతో చాటిన గొప్ప దార్శనికుడని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు ఆయన జీవితం నిరంతర పోరాటంగా సాగిందన్నారు. 1969 తెలంగాణ ఉద్యమ సమయంలో మంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకున్నారని గుర్తుచేశారు. బడుగు, బలహీన వర్గాలు, చేనేత కార్మికుల పట్ల ఆయన చూపిన నిబద్ధత స్ఫూర్తిదాయకమన్నారు.

## జలదృశ్యం నుంచే ఉద్యమానికి బీజం

కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యమాలనే ఊపిరిగా, పోరాటాలనే పరమావధిగా జీవించిన ధీశాలి అని కేటీఆర్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు ఆయన పాత్ర మరువలేనిదన్నారు. కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ




రాష్ట్ర సమితి ఆవిర్భావం బాపూజీ నివాసమైన జలదృశ్యంలోనే జరిగిందని గుర్తుచేశారు. అక్కడి నుంచే మలిదశ తెలంగాణ ఉద్యమానికి బీజం పడిందన్నారు.

## బాపూజీ సేవలకు గౌరవం

తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం కేసీఆర్ ప్రభుత్వం ట్యాంక్‌బండ్‌పై కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టి గౌరవించిందన్నారు. బాపూజీ ఆశయాలు, త్యాగాలు తెలంగాణ సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

# జూరాల ఆయకట్టుకు నీళ్లివ్వాలి.. రైతులను కాపాడాలి

మహబూబ్‌నగర్, నేటిధాత్రి:
జూరాల ఆయకట్టుకు సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలని రైతుల పక్షాన డిమాండ్ చేసిన ఉమ్మడి పాలమూరు జిల్లా బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులను నిర్బంధించడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు.

## రైతుల గోస పట్టదా?

కళ్లముందే పంటలు ఎండిపోతూ అన్నదాతలు అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ విమర్శించారు. న్యాయమైన డిమాండ్‌తో నిరసనకు సిద్ధమైన బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని, తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే బీఆర్ఎస్ నేతలను ముందస్తుగా అరెస్టు చేస్తున్నారని విమర్శించారు.

## 9 టీఎంసీలున్నా విడుదల చేయరా?

జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీటి లభ్యత ఉన్నప్పటికీ ఆయకట్టు పంటలకు నీరు విడుదల చేయడం లేదని కేటీఆర్ అన్నారు. పనికిరాని సాకులతో పచ్చని పంటలను ఎండబెడుతున్నారని ఆరోపించారు. తాగునీటి అవసరాలకు రెండు టీఎంసీలు సరిపోతాయని తెలిసినా.. మిగిలిన నీటిని ఆయకట్టు రైతులకు విడుదల చేయకుండా సంక్షోభంలోకి నెట్టడం సరికాదన్నారు.

## రైతులపై కేసులా?

పంటలను కాపాడుకునే తపనతో రైతులు జూరాల గేట్లు ఎత్తే ప్రయత్నం చేస్తే వారిపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. అన్నదాతల సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారినే అణచివేయడం సరికాదన్నారు.
వెంటనే నీళ్లు విడుదల చేయాలి
అక్రమంగా అరెస్టు చేసిన బీఆర్ఎస్ నేతలను వెంటనే విడుదల చేయడంతోపాటు జూరాల ఆయకట్టు రైతులకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్లను పట్టించుకోకుండా ప్రభుత్వం వ్యవహరిస్తే అన్నదాతల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# కేసీఆర్ కుటుంబం అడ్డగోలుగా దోచుకుంది!

హైదరాబాద్, నేటిధాత్రి:
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలన చేస్తూ ప్రజల మద్దతు పొందుతుంటే.. బీఆర్ఎస్ నేతలు 22ఏ పేరుతో రాజకీయాలు చేస్తున్నారని టీపీసీసీ సీనియర్ నేత రమ్యారావు విమర్శించారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం అడ్డగోలుగా దోచుకుందని ఆరోపించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు.

## 'వందల ఎకరాల్లో మా భూమి ఏది?'

"మాకు వందల ఎకరాలు ఉన్నాయని కేటీఆర్ అంటున్నారు. నేను కేసీఆర్ సొంత అన్న బిడ్డను. కేటీఆర్ ఆరోపిస్తున్న ఆ వందల ఎకరాల్లో మా భూమి ఎక్కడ ఉంది? నేను, కవిత ఇద్దరం ఇంటి వాళ్లం. మాకు సంబంధంలేని సంతోష్‌రావు కేసీఆర్ వద్ద ఎందుకు ఉంటున్నారు? ఆయన సంపాదించిన ఆస్తులపై కేటీఆర్ ఎందుకు మౌనంగా ఉంటున్నారు?" అని రమ్యారావు ప్రశ్నించారు.

## కుదురుపాకలో 8 ప్లాట్ల ఆరోపణ

సంతోష్‌రావుకు 2013లో క్వారీలో 25 శాతం వాటా ఉండేదని రమ్యారావు తెలిపారు. 2015లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులో ముంపునకు గురైందంటూ సంతోష్ కుటుంబ సభ్యులు ఇళ్ల పట్టాలు తీసుకున్నారని ఆరోపించారు. కుదురుపాక గ్రామానికి సంబంధం లేని వారు కూడా ప్లాట్లు తీసుకున్నారని, సంతోష్‌రావు, ఆయన కుటుంబ సభ్యులు కలిసి ఎనిమిది ప్లాట్లు తీసుకున్నారని పేర్కొన్నారు.

## అఫిడవిట్‌లో ఒక్క ప్లాటే ఎందుకు?

2018లో రాజ్యసభ అవకాశం వచ్చిన సందర్భంగా సంతోష్‌రావు తన అఫిడవిట్‌లో ఒక్క ప్లాట్ మాత్రమే చూపించారని రమ్యారావు ఆరోపించారు. ఎనిమిది ప్లాట్లు తీసుకుని ఒక్కదానినే అఫిడవిట్‌లో ఎలా చూపించారని ప్రశ్నించారు. కుదురుపాకలో ప్రధాన రహదారిపై బాధితుల భూములను కూడా కొనుగోలు చేశారని ఆరోపించారు.

## కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి?'

కరీంనగర్‌లో ఉన్నప్పుడు సంతోష్‌రావుకు చెప్పులు కూడా లేవని రమ్యారావు వ్యాఖ్యానించారు. ఇప్పుడు కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. మార్కుక్ గ్రామంలో తొమ్మిది ఎకరాల భూమి, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లో భూమి, ఇల్లు ఎలా వచ్చాయని నిలదీశారు. 2018 తర్వాత కొండాపూర్, బంజారాహిల్స్‌లో ఆస్తులు ఎలా సమకూరాయని ప్రశ్నించారు.

## కేటీఆర్‌కు రమ్యారావు ప్రశ్నలు

అక్కను, చెల్లిని ఇంటి నుంచి బయటకు పంపి సంతోష్‌రావును ఎందుకు పక్కన పెట్టుకున్నారని కేటీఆర్‌ను రమ్యారావు ప్రశ్నించారు. సంతోష్‌రావు భార్య రోహిణి పేరుతో నానక్‌రామ్‌గూడలో పెద్ద వాణిజ్య భవనం ఎలా వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

# ప్రతి గ్రామపంచాయతీని మోడల్‌గా తీర్చిదిద్దాలి

హైదరాబాద్, నేటిధాత్రి:
ప్రతి గ్రామపంచాయతీని మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ 2న గ్రామసభలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ ఏడాది చేపట్టాల్సిన పనులు, కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గ్రామసభల్లో అభివృద్ధి ప్రణాళిక

అక్టోబర్ 2న నిర్వహించే గ్రామసభల్లో కార్యాచరణ ప్రణాళికపై తీర్మానాలు ప్రవేశపెట్టాలని సీతక్క సూచించారు. గ్రామాల అవసరాలు, అందుబాటులో ఉన్న నిధుల ఆధారంగా ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ ఏడాది పంచాయతీలకు వచ్చే అన్ని నిధులపై గ్రామసభల్లో చర్చించాలని సూచించారు.

## ప్రతి గ్రామంలో రూ.50 లక్షల పనులు

ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రంలో రూ.6,700 కోట్లను ఖర్చు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామంలో సగటున రూ.50 లక్షల పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. ఉపాధి హామీ పనులు కోరిన ప్రతి ఒక్కరికీ కల్పించాలని ఆదేశించారు.

## సామాజిక ఆస్తులపైనా దృష్టి

ఉపాధి కల్పనతో పాటు గ్రామాల్లో సామాజిక ఆస్తుల సృష్టిపై దృష్టి సారించాలని సీతక్క సూచించారు. జలసిరి కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎల్‌నినో తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.

## క్షేత్రస్థాయిలో పర్యటించాలి

రాష్ట్రస్థాయి అధికారులకు జిల్లాల వారీగా పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని మంత్రి ఆదేశించారు. రెండు రోజులపాటు జిల్లాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని సూచించారు. సమీక్షా సమావేశాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలో పర్యటించి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# పంటలను ఎండబెడుతున్న పాపం కాంగ్రెస్‌దే!

- నీళ్లు,కరెంట్ ఉన్నా పాలన చేతకాక పంటలు ఎండబెడుతున్నారు
- రైతుల పట్ల రేవంత్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది: జగదీష్‌రెడ్డి
- ఇదే పరిస్థితి కొనసాగితే రైతులు ప్రభుత్వం వెంట పడటం ఖాయం
- పంటలు కాపాడుకునేందుకు మరో పోరాటానికి సిద్ధం కావాలి

సూర్యాపేట, నేటిధాత్రి:
రైతులకు పంటలను దూరం చేస్తున్న పాపం కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆరోపించారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం నూర్జహాన్‌పేట, గూడెపుకుంట తండాలో ఎండిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితులను తెలుసుకున్నారు.

## వందల ఎకరాల్లో ఎండిన పంటలు

ఏ గ్రామంలో చూసినా వందల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని జగదీష్‌రెడ్డి తెలిపారు. వాతావరణ పరిస్థితులను చూసి రైతులు సగం పొలాల్లోనే నాట్లు వేసుకున్నారని, అందులోనూ సగానికి పైగా పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా పరిస్థితి మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## నీళ్లు, కరెంట్ ఉన్నా.. పంటలు ఎందుకు ఎండాలి?

నీళ్లు, విద్యుత్తు పుష్కలంగా ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకాక పంటలు ఎండబెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. విద్యుత్తును సైతం సక్రమంగా ఇవ్వలేక మోటర్లు కాలిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో కావాలనే ఎండబెడుతున్నారని ఆరోపించారు.



## రైతులపై కక్షపూరిత వైఖరి


రైతుల పట్ల రేవంత్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని జగదీష్‌రెడ్డి విమర్శించారు. రైతులను ఇబ్బంది పెట్టిన ఏ ప్రభుత్వం ముందుకు సాగలేదన్నారు. సమస్యలపై ప్రశ్నిస్తే తప్పు ప్రభుత్వానికి కనికరం ఉండదని ఆరోపించారు.

## పోరాటానికి సిద్ధం కావాలి

కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సాధించుకున్న తర్వాత పదేళ్లపాటు నస్యశ్యామలంగా పంటలు పండించుకున్నామని జగదీష్‌రెడ్డి అన్నారు. మరోసారి పంటలను కాపాడుకునేందుకు రైతులు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాయకులపై దాడులు చేసినా, రాజకీయ అంశాలను తెరపైకి తెచ్చినా ఎండిపోయిన పొలాల సమస్య పరిష్కారం కాదన్నారు.

## నీళ్లు, విద్యుత్తుపై దృష్టి పెట్టాలి

ప్రభుత్వం ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని పంటలకు సాగునీరు, విద్యుత్తు అందించడంపై దృష్టి పెట్టాలని జగదీష్‌రెడ్డి సూచించారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.



# గుంతలతో ప్రయాణం నరకప్రాయం



గొట్టె అజయ్
నాగారం గ్రామ యువకుడు

- గుంతలమయంగా పరకాల మొగుళ్లపల్లి ప్రధాన రహదారి
- నాగారం నుంచి లక్ష్మీపురం వరకు భారీ గుంతలు
- మరమ్మతుల కోసం ఎదురుచూపులు

పరకాల,నేటిధాత్రి
సాఫీగా సాగాల్సిన ప్రయాణం అడుగడుగునా గుంతలతో అవస్థలమయం.పరకాల మొగుళ్లపల్లి ప్రధాన రహదారిలో నాగారం గ్రామ ప్రారంభం నుంచి లక్ష్మీపురం వరకు పలుచోట్ల రహదారి దెబ్బతిని పెద్ద గుంతలు ఏర్పడ్డాయి.ముఖ్యంగా మూల మలుపుల వద్ద పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారడంతో నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు,ఆటోలు,కార్లలో వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.చాలాకాలంగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టకపోవడంతో స్థానికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.ప్రధాన రహదారి కావడంతో ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు సమస్యపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.గుంతలను తప్పించుకునే క్రమంలో వాహనదారులు రహదారిపై పక్కకు మళ్లాల్సి రావడం కూడా ఇబ్బందులకు కారణమవుతోంది.

## మలుపుల వద్ద మరింత ప్రమాదకర పరిస్థితి

నాగారం నుంచి లక్ష్మీపురం వైపు వెళ్లే మార్గంలోని కొన్ని మూల మలుపుల వద్ద రహదారి దుస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంది.గుంతలను తప్పించే క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాలను గమనించడం కష్టమవుతుండటంతో ప్రమాదాల అవకాశం ఏర్పడుతోంది.ఆయా ప్రాంతాల్లో అవసరమైన రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.రాత్రి సమయంలో గుంతలు స్పష్టంగా కనిపించకపోవడంతో వాహనదారులు మరింత అప్రమత్తంగా ప్రయాణించాల్సి వస్తోంది.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఆర్ అండ్ బి శాఖ అధికారులు స్పందించాలని విజ్ఞప్తి

పరకాల మొగుళ్లపల్లి మార్గం అనేక గ్రామాల ప్రజలకు కీలకమైన రహదారి.విద్యార్థులు,ఉద్యోగులు,రైతులు,వ్యాపారులు ప్రతిరోజూ ఈ మార్గంపైనే ఆధారపడుతున్నారు.ఈ నేపథ్యంలో నాగారం నుంచి లక్ష్మీపురం వరకు దెబ్బతిన్న ప్రాంతాలను ఆర్‌అండ్‌బీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి,అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ ప్రధాన మార్గంలో సమస్య మరింత తీవ్రమయ్యేలోపు అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.నాగారం నుంచి లక్ష్మీపురం వరకు రహదారిని సమగ్రంగా పరిశీలించి, ప్రమాదకరంగా మారిన గుంతలను పూడ్చడంతో పాటు దెబ్బతిన్న ప్రాంతాలకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకుని సురక్షితమైన రాకపోకలకు మార్గం సుగమం చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## త్వరగా స్పందించాలి లేదంటే ప్రమాదాలు జరగొచ్చు

ఈ రహదారిపై నిత్యం అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.గుంతల కారణంగా ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ముఖ్యంగా కల్వరి చర్చి ముందు ఉన్న మూలమలుపు వద్ద పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంది.గుంతలను తప్పించుకునే క్రమంలో కొన్నిసార్లు వాహనాలు అదుపుతప్పి పక్కకు వెళ్లే పరిస్థితి కూడా ఎదురవుతోంది. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి రహదారిని పరిశీలించి, వీలైనంత త్వరగా మరమ్మతులు చేపట్టాలి.

# ఘనంగా కుంకుమ పూజ

వరంగల్, నేటిధాత్రి:
వరంగల్ మహానగరంలోని కరీమాబాద్ రామస్వామి గుడి వీధి రజకవాడలో మన గణపయ్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కుంకుమ పూజను ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

## ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలు

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మంగళవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాముల బాబు, రాముల అయ్యప్ప, ధృవ్‌కుమార్, ప్రభాకర్, సతీష్, గణేష్, దత్తు, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.



# ఆధార్ కార్డు వివరాల సవరణ

కమలాపూర్, నేటిధాత్రి:
నేను బుర్ర సాయిప్రియ, తండ్రి పేరు బుర్ర రాజు, వయస్సు 19 సంవత్సరాలు, విద్యార్థిని, డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాను. నా పుట్టిన తేదీ 15-03-2007. నా నివాసం ఇంటి నం. 3-32, గునిపర్తి గ్రామం, కమలాపూర్ మండలం, హనుమకొండ జిల్లా, తెలంగాణ--505101.
నా ఆధార్ కార్డులో పొరపాటున నమోదైన తప్పుడు వివరాలను సరిచేయించుకుంటున్నాను. ఇకపై నా పేరు బుర్ర సాయిప్రియ, తండ్రి పేరు బుర్ర రాజుగా పిలవబడును.

# దానం నాగేందర్ అనర్హతపై బుధవారం విచారణ

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌ను బుధవారం విచారిస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వెల్లడించింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## అత్యవసర విచారణకు విజ్ఞప్తి

దానం నాగేందర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి పిటిషన్‌ను సుప్రీంకోర్టులో ప్రత్యేకంగా ప్రస్తావించారు. స్పీకర్ తిరస్కరించిన పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకుని హైకోర్టు దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేసును అత్యవసరంగా విచారించకపోతే ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఉందని పేర్కొంటూ వెంటనే విచారణ చేపట్టాలని కోరారు.

## విచారణను వ్యతిరేకించిన ప్రతివాదులు

దానం నాగేందర్ తరఫు న్యాయవాది విజ్ఞప్తిని ప్రతివాదుల తరఫు న్యాయవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. తమ వాదనలను కూడా వినాలని కోరారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తరఫు న్యాయవాదులు ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేశామని తెలిపారు. కేసును మరో రోజు విచారించాలని కోరారు.

## ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం

ఇరుపక్షాల వాదనలు విన్న సీజేఐ ధర్మాసనం.. దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై బుధవారం విచారణ జరుపుతామని స్పష్టం చేసింది.

# పిడుగుపాటుకు బాలుడు మృతి

గద్వాల, నేటిధాత్రి:
జోగులాంబ గద్వాల జిల్లాలో సోమవారం సాయంత్రం విషాద ఘటన చోటుచేసుకుంది. పిడుగుపాటుకు 16 ఏళ్ల బాలుడు మృతి చెందాడు.
కేటీ దొడ్డి మండలం యర్సన్‌దొడ్డి గ్రామానికి చెందిన కుర్వ వెంకటేష్ కుమారుడు మల్లేష్ (16) పొలం నుంచి ఇంటికి వస్తుండగా వర్షం కురిసింది. దీంతో కృష్ణస్వామి దేవాలయం సమీపంలోని చెట్టు కిందకు వెళ్లి నిల్చున్నాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడటంతో మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.







# పని మాది..కోత మీది

## జీఓ 1181ను రద్దు చేస్తారా, పునఃపరిశీలిస్తారా?



**మియాపురం శ్రీకాంత్**
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) ఔట్‌సోర్సింగ్ జేఏసీ ప్రధాన కార్యదర్శి
ఫోన్ నెం. 9059027650

- ఒక్క ఉద్యోగి సమస్య కాదు, అన్ని శాఖల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలపై కోతలు
- కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్లు, డ్రైవర్లు, హార్టికల్చర్, మెడికల్, రెవెన్యూ, వాటర్ సిబ్బందిపైనా ప్రభావం ప్రభుత్వం ఆలోచించాలి, లేదంటే ఉద్యమం ఉధృతం
- వంటావార్పు నుంచి ముట్టడుల వరకు, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధం
- కుటుంబాలతో కలిసి రోడ్డెక్కుతాం, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తాం
- కేటగిరీల వారీగా వేతన వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్

హైదరాబాద్ , నేటిధాత్రి:

జీఓ 1181 ప్రభావం ఒక్క ఉద్యోగికే పరిమితం కాదని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలపై కోతలు పడే పరిస్థితి ఏర్పడిందని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (+ఔవీజ) ఔట్‌సోర్సింగ్ జేఏసీ ప్రధాన కార్యదర్శి మియాపురం శ్రీకాంత్ అన్నారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు, రెవెన్యూ, మెడికల్, హార్టికల్చర్, వాటర్ వర్క్స్, విద్యుత్, ఇంజినీరింగ్, కార్యాలయ పరిపాలన తదితర విభాగాల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్లు, డ్రైవర్లు, ఫీల్డ్ సిబ్బంది, సాంకేతిక ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు అందరూ ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు.

జీఓ 1181ను ప్రభుత్వం రద్దు చేస్తుందా? లేక పునఃపరిశీలిస్తుందా? అనే అంశంపై వెంటనే స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించకపోతే భార్యాపిల్లలతో కలిసి తెలంగాణ ఉద్యమం కంటే ఉధృతమైన పోరాటం చేపడతామని హెచ్చరించారు.

రాష్ట్రంలోని నాలుగు మూలల నుంచి సుమారు ఐదున్నారా లక్షల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రోడ్డెక్కి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తారని తెలిపారు. వంటావార్పు కార్యక్రమాలు చేపడతామని, సీఎంఓ కార్యాలయం, ప్రగతిభవన్, ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం, సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలు ప్రారంభం కాకముందే ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు.

### అన్ని శాఖల్లోనూ అదే పరిస్థితి

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని శ్రీకాంత్ తెలిపారు. మున్సిపాలిటీల్లో పారిశుధ్య కార్మికులు మురుగు కాలువలు, చెత్తకుప్పలు, మలమూత్రాలు, చనిపోయిన జంతువుల తొలగింపు వంటి పనులు చేస్తుండగా, కంప్యూటర్ ఆపరేటర్లు కార్యాలయాల డేటా ఎంట్రీ, రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ సేవలు, ప్రజలకు ధ్రువపత్రాల జారీ వంటి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. బిల్ కలెక్టర్లు ఇంటింటికీ తిరిగి పన్నులు, నీటి బిల్లులు, ఇతర రుసుములు వసూలు చేస్తున్నారని, డ్రైవర్లు అధికారులు, సిబ్బంది, అత్యవసర సేవల కోసం వాహనాలు నడుపుతున్నారని తెలిపారు. హార్టికల్చర్ సిబ్బంది పార్కులు, మొక్కలు, పచ్చదనం సంరక్షణలో పనిచేస్తున్నారని, మెడికల్ విభాగంలోని సిబ్బంది ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు.

రెవెన్యూ శాఖలో ఫీల్డ్ సర్వేలు, రికార్డుల నిర్వహణ, ప్రజా సేవలు, ధ్రువపత్రాల ప్రక్రియల్లో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వాటర్ వర్క్స్ సిబ్బంది నీటి సరఫరా, పైప్‌లైన్ మరమ్మతులు, లీకేజీల నివారణ, పంపింగ్ స్టేషన్ల నిర్వహణలో పనిచేస్తున్నారని చెప్పారు. గ్రామపంచాయతీల్లో కార్యాలయ పనులు, పన్నుల వసూళ్లు, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, నీటి సరఫరా వంటి అనేక బాధ్యతలను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే నిర్వహిస్తున్నారని వివరించారు.

### పేరు మారితే, పని మారుతుందా?

కంప్యూటర్ ఆపరేటర్ నేటికీ కంప్యూటర్ పనులే చేస్తున్నారు. బిల్ కలెక్టర్ నేటికీ బిల్లుల వసూళ్లే చేస్తున్నారు. డ్రైవర్ నేటికీ వాహనమే నడుపుతున్నారు. హార్టికల్చర్ సిబ్బంది మొక్కలు, పార్కుల సంరక్షణే చేస్తున్నారు. మెడికల్ సిబ్బంది ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లోనే సేవలందిస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది ఫీల్డ్ పనులు, రికార్డుల నిర్వహణే చేస్తున్నారు. వాటర్ వర్క్స్ సిబ్బంది నీటి సరఫరా, పైప్‌లైన్ పనులే చేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు మురుగు కాలువలు, చెత్తకుప్పలు, మలమూత్రాలు, చనిపోయిన జంతువుల తొలగింపు వంటి ప్రమాదకర పనులే చేస్తున్నారు.

మరి డిజిగ్నేషన్ లేదా వర్గీకరణ మారితే పని మారుతుందా? బాధ్యతలు తగ్గుతాయా? ప్రజలకు అందించే సేవలు తగ్గుతాయా? కంప్యూటర్ ఆపరేటర్ పని తగ్గుతుందా? బిల్ కలెక్టర్ వసూళ్లు ఆపేస్తారా? డ్రైవర్ వాహనం నడపడం మానేస్తారా? హార్టికల్చర్, మెడికల్, రెవెన్యూ, వాటర్, మున్సిపల్, గ్రామపంచాయతీ సిబ్బంది విధులు మారుతున్నాయా? లేదంటే కేవలం పేరు మార్చి వేతనం తగ్గించడమేనా? అని శ్రీకాంత్ ప్రశ్నించారు.

### మురుగు కాలువల్లోకి దిగేది మేమే

మున్సిపాలిటీల్లో మోరీలు మూసుకుపోతే వాటిని తెరిచేది పారిశుధ్య కార్మికులే. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మట్టి, మలినాలను చేతులతో తొలగించేది వారే. రోడ్లపై పేరుకుపోయిన చెత్తను ఎత్తి వాహనాల్లో వేసేది వారే. మురుగు నీటిలో గంటల తరబడి నిలబడి పనిచేసే సమయంలో చేతులకు గాయాలై రక్తాలు కారినా, దుర్వాసనతో వాంతులు వచ్చినా విధులు ఆపలేని పరిస్థితి వారిదని శ్రీకాంత్ తెలిపారు. మలమూత్రాలు, కుళ్లిన వ్యర్థాలు, ప్లాస్టిక్, మురుగు, రసాయనాలతో కలిసిన చెత్తను ఎత్తి తరలించే సమయంలో అనేక మంది కార్మికులు చర్మవ్యాధులు, శ్వాసకోశ సమస్యలు, కళ్ల మంట, గాయాలతో బాధపడుతున్నారని చెప్పారు. అయినా ప్రజారోగ్యం కోసం విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు.

### ముక్కులకు గుడ్డలు కట్టుకుని

మురుగు కాలువలు, చెత్తకుప్పల వద్ద దుర్వాసన భరించలేని స్థాయిలో ఉంటుందని కార్మికులు చెబుతున్నారని శ్రీకాంత్ తెలిపారు. ముక్కులకు గుడ్డలు కట్టుకుని, కొందరు ఎలాంటి రక్షణ పరికరాలు లేకుండానే పనిచేస్తున్నారని చెప్పారు. గ్లౌజులు, మాస్కులు, బూట్లు, రక్షణ దుస్తులు అందించాల్సిన బాధ్యత అధికారులదేనని, అవి లేకపోయినా కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు.

ఆపరేషన్లు జరిగినా, చేతులకు గాయాలున్నా, ఆరోగ్యం సహకరించకపోయినా కుటుంబ అవసరాల కోసం పనికి రావాల్సి వస్తోందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో పనిచేసే వారి వేతనాన్ని తగ్గించడం అంటే వారి కుటుంబాలపై మరింత ఆర్థిక భారం మోపటమేనన్నారు.

### చనిపోయిన జంతువులనూ తొలగించేది వారే

గ్రామపంచాయతీల్లో కుక్కలు, పందులు, ఇతర జంతువులు చనిపోతే వాటిని తొలగించేందుకు ఎవరూ ముందుకు రారని, చివరకు పారిశుధ్య కార్మికులే ఆ పని చేయాల్సి వస్తుందని శ్రీకాంత్ తెలిపారు. దుర్వాసన వ్యాపిస్తున్నా, వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నా, చనిపోయిన జంతువులను ఎత్తి తరలించి పూడ్చేది వారేనన్నారు. ప్రజలు దూరంగా నిలబడి చూస్తున్న పనులను కార్మికులు తమ చేతులతో నిర్వహిస్తున్నారని, అలాంటి సేవలను ప్రభుత్వం గుర్తించాల్సింది పోయి వేతనాల్లో కోత పెట్టడం అన్యాయమని అన్నారు.

### కంప్యూటర్ ఆపరేటర్లపైనా భారం

ప్రభుత్వ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లు కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారని శ్రీకాంత్ తెలిపారు. డేటా ఎంట్రీ, ఆన్‌లైన్ దరఖాస్తుల పరిశీలన, రికార్డుల నవీకరణ, ప్రజలకు ధ్రువపత్రాల జారీ, ప్రభుత్వ పథకాల వివరాల నమోదు వంటి పనులు వారి ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయని చెప్పారు.

ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండటంతో ఒకే వ్యక్తి అనేక విభాగాల పనులు నిర్వహించాల్సి వస్తోందన్నారు. పని గంటలు పెరిగినా, బాధ్యతలు పెరిగినా వేతనం మాత్రం తగ్గించే విధానం ఎలా న్యాయమని ప్రశ్నించారు. కంప్యూటర్ ఆపరేటర్లకు సాంకేతిక అర్హత, అనుభవం ఉన్నప్పటికీ కేటగిరీ మార్పుల పేరుతో వేతన కోతలు విధించడం సరికాదన్నారు.

### బిల్ కలెక్టర్లు, డ్రైవర్ల సేవలు గుర్తించాలి

బిల్ కలెక్టర్లు ఎండ, వాన, దుమ్ము, ట్రాఫిక్‌ను లెక్కచేయకుండా ఇంటింటికీ తిరిగి పన్నులు, నీటి బిల్లులు, ఇతర రుసుములు వసూలు చేస్తున్నారని శ్రీకాంత్ తెలిపారు. ప్రజలతో నేరుగా సంబంధం ఉండే ఈ ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతున్నా వేతన భద్రత లేకపోవడం అన్యాయమన్నారు.

డ్రైవర్లు అధికారులు, సిబ్బంది, అత్యవసర సేవల కోసం రోజంతా వాహనాలు నడుపుతున్నారని చెప్పారు. రాత్రి వేళల్లోనూ, సెలవు రోజుల్లోనూ విధులకు హాజరు కావాల్సి వస్తోందన్నారు. వాహనాల నిర్వహణ, ప్రయాణికుల భద్రత, సమయపాలన వంటి బాధ్యతలు ఉన్నప్పటికీ వారి వేతనాలను తగ్గించడం తగదన్నారు.

### హార్టికల్చర్, మెడికల్, రెవెన్యూ, వాటర్ సిబ్బందిపైనా ప్రభావం

హార్టికల్చర్ సిబ్బంది పార్కులు, మొక్కలు, పచ్చదనం సంరక్షణలో కీలకంగా పనిచేస్తున్నారని శ్రీకాంత్ తెలిపారు. ఎండలో గంటల తరబడి పనిచేస్తూ మొక్కలకు నీరు పోయడం, కత్తిరింపులు, పార్కుల శుభ్రత, పచ్చదనం నిర్వహణ వంటి పనులు చేస్తున్నారని చెప్పారు. మెడికల్ విభాగంలోని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో రోగుల సేవలు, రికార్డుల నిర్వహణ, శుభ్రత, సహాయక పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. రోగులు, వ్యాధులు, వైద్య వ్యర్థాల మధ్య పనిచేసే సిబ్బందికి ఆరోగ్య భద్రత, వేతన రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రెవెన్యూ శాఖలో ఫీల్డ్ సర్వేలు, రికార్డుల పరిశీలన, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, ధ్రువపత్రాల ప్రక్రియల్లో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని చెప్పారు. వాటర్ వర్క్స్ సిబ్బంది నీటి సరఫరా, పైప్‌లైన్ మరమ్మతులు, లీకేజీల నివారణ, పంపింగ్ స్టేషన్ల నిర్వహణలో ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు.

### రూ.500 కూడా కుటుంబానికి భారమే

వేతన వ్యత్యాసం రూ.500 నుంచి రూ.15 వేల వరకు ఉండొచ్చని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సాంకేతిక పోస్టుల్లో రూ.30 వేలకుపైగా తేడా వచ్చే పరిస్థితులు ఉన్నాయని చెబుతున్నారు. అయితే ఈ సంఖ్యలపై ప్రభుత్వం కేటగిరీవారీగా అధికారిక వివరాలు ప్రకటించాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. రూ.500 ప్రభుత్వ ఖజానాకు చిన్న మొత్తంగా కనిపించవచ్చు. కానీ ఉద్యోగి కుటుంబానికి అది నెల సరుకుల ఖర్చు కావచ్చు. రూ.5 వేలు తగ్గితే పిల్లల ఫీజు, ఇంటి అద్దె, రేషన్ వంటి ఖర్చులపై ప్రభావం పడుతుంది. రూ.10 వేలు, రూ.15 వేలు తగ్గితే కుటుంబ నెలవారీ బడ్జెట్ మొత్తం మారిపోతుంది. రూ.30 వేలకుపైగా వ్యత్యాసం వస్తే ఆ కుటుంబం అప్పులపాలయ్యే పరిస్థితి ఏర్పడుతుందని శ్రీకాంత్ పేర్కొన్నారు.

### పగలు ప్రభుత్వ సేవ, రాత్రి అదనపు పనులా?

ప్రభుత్వ శాఖలో పగలంతా విధులు నిర్వహించి, కుటుంబాన్ని పోషించేందుకు రాత్రి అదనపు పనులు చేయాల్సిన పరిస్థితి ఎందుకు రావాలని శ్రీకాంత్ ప్రశ్నించారు. కొందరు ఉద్యోగులు ఫుడ్ డెలివరీ, నిర్మాణ పనులు, ఇతర కూలి పనులకు వెళ్లాల్సి వస్తోందన్నారు.

పారిశుధ్య కార్మికులు మురుగు, చెత్త, మలినాల మధ్య పనిచేస్తుండగా, ఇతర శాఖల ఉద్యోగులు కార్యాలయాలు, ఫీల్డ్ ప్రాంతాలు, ఆసుపత్రులు, నీటి సరఫరా కేంద్రాలు, పార్కుల్లో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అందరి పని స్వభావం వేర్వేరైనా, వేతన కోతల ప్రభావం మాత్రం అన్ని కుటుంబాలపైనా పడుతోందన్నారు.

### జీఓ 1181పై పూర్తి లెక్కలు చెప్పాలి

జీఓ 1181 అమలుతో ఉద్యోగులపై పడే ఆర్థిక ప్రభావాన్ని ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని శ్రీకాంత్ కోరారు. ఏ కేటగిరీకి ఎంత వేతనం? కంప్యూటర్ ఆపరేటర్, బిల్ కలెక్టర్, డ్రైవర్, పారిశుధ్య కార్మికుడు, హార్టికల్చర్, మెడికల్, రెవెన్యూ, వాటర్ సిబ్బందికి ఎంత చెల్లిస్తారు? ఎవరి వేతనం ఎంత తగ్గుతుంది? తగ్గింపునకు ప్రాతిపదిక ఏమిటి? ఇప్పటికే పనిచేస్తున్న ఉద్యోగుల అనుభవానికి ఎలాంటి గుర్తింపు ఉంటుంది? ప్రస్తుత వేతనానికి రక్షణ ఉంటుందా? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్య కార్మికులకు ప్రమాద భత్యం, రక్షణ పరికరాలు, ఆరోగ్య బీమా, వైద్య పరీక్షలు, ప్రమాదంలో మరణిస్తే కుటుంబానికి పరిహారం వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలని కోరారు. అదే విధంగా అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, సమయానికి వేతనం, అనుభవానికి తగిన గుర్తింపు కల్పించాలని డిమాండ్ చేశారు.

### ఒకవైపు ప్రభుత్వ సేవలు, మరోవైపు వేతన కోతలేంటి?

ప్రభుత్వ శాఖల పనితీరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సేవలపై ఆధారపడి ఉందని శ్రీకాంత్ అన్నారు. కార్యాలయాల్లో కంప్యూటర్ పనులు, ప్రజా సేవలు, పన్నుల వసూళ్లు, వాహనాల నిర్వహణ, పార్కుల సంరక్షణ, ఆసుపత్రుల సేవలు, రెవెన్యూ పనులు, నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ వంటి అన్ని రంగాల్లో వారు కీలకంగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజలకు సేవలు అందించడంలో ఉద్యోగుల పాత్రను ప్రభుత్వం గుర్తిస్తూనే, వారి వేతనాల్లో కోతలు పెట్టడం విరుద్ధమైన విధానమన్నారు. ఉద్యోగుల సేవలు అవసరమైనప్పుడు వారిని ప్రభుత్వ వ్యవస్థలో భాగంగా చూస్తూ, వేతనాల విషయంలో మాత్రం తక్కువగా చూడటం సరికాదన్నారు.

### మొదటి తేదీ జీతం హామీపై స్పష్టత ఏది?

ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీన జీతాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా వాస్తవ పరిస్థితి ఏమిటో వెల్లడించాలని శ్రీకాంత్ కోరారు. ఎన్ని శాఖల్లో జీతాలు మొదటి తేదీన అందుతున్నాయి? ఎక్కడెక్కడ ఆలస్యం జరుగుతోంది? ఆలస్యానికి కారణం ఏమిటి? బాధ్యత ఎవరిది? అనే వివరాలను ప్రభుత్వం సమీక్షించాలన్నారు. జీతాలు ఆలస్యమైతే కుటుంబ ఖర్చులు, పిల్లల చదువులు, వైద్యం, ఇంటి అద్దె, రుణాల చెల్లింపులు అన్నీ నిలిచిపోతాయని తెలిపారు. తక్కువ వేతనం, ఆలస్యమైన జీతం, ఆరోగ్య సమస్యలు కలిసి ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి పెంచుతున్నాయని పేర్కొన్నారు.

### ఉద్యోగి వెనుక ఒక కుటుంబం ఉంది

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని కేవలం ఒక ఉద్యోగిగా చూడకూడదని శ్రీకాంత్ అన్నారు. అతని వెనుక పిల్లల చదువులు, ఇంటి అద్దె, తల్లిదండ్రుల వైద్యం, రేషన్, విద్యుత్ బిల్లులు, రుణాల చెల్లింపులు వంటి అనేక బాధ్యతలు ఉంటాయని తెలిపారు. వేతనంలో కోత అంటే ఉద్యోగి జేబులో నుంచి డబ్బు తగ్గడం మాత్రమే కాదని, కుటుంబ జీవన బడ్జెట్‌పై ప్రభావం పడటమని పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులు వైద్య ఖర్చులతోనే ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మురుగు, చెత్త, రసాయనాలు, చనిపోయిన జంతువులతో సంబంధం ఉన్న పనుల వల్ల అనారోగ్యానికి గురైనా చికిత్స ఖర్చులు వారే భరించాల్సి వస్తోందన్నారు. అదే విధంగా మెడికల్ సిబ్బంది, వాటర్ వర్క్స్ ఉద్యోగులు, ఫీల్డ్ సిబ్బంది కూడా విధుల కారణంగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

### విషాద ఘటనలపై ప్రభుత్వం సున్నితంగా స్పందించాలి

ఉద్యోగ వర్గాల్లో చోటుచేసుకుంటున్న విషాద ఘటనలను కేవలం ఒక్క కారణంతో ముడిపెట్టడం సరికాదని శ్రీకాంత్ అన్నారు. అయితే ఆర్థిక ఒత్తిడి, ఉద్యోగ భద్రతపై అనిశ్చితి, కుటుంబ బాధ్యతలు, ఆరోగ్య సమస్యలు వంటి అంశాలు ఉద్యోగులపై చూపే ప్రభావాన్ని ప్రభుత్వం సున్నితంగా పరిశీలించాలన్నారు. సమస్య తీవ్రతరం అయిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే పరిష్కారం చూపాలని కోరారు.

### పరామర్శకు వెళ్లిన వారిపై కేసులా?

విషాద ఘటనల నేపథ్యంలో బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లిన పృథ్వీరాజ్, బక్క జెడ్సన్, దాసరి, జేఏసీ యూనియన్ అధ్యక్షుడు పులి లక్ష్మయ్య తదితరులపై అరెస్టులు జరిగినట్లు పేర్కొంటూ శ్రీకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించడం, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం సమస్యగా మారకూడదన్నారు. ఉద్యోగులతో చర్చల ద్వారానే సమస్యలకు పరిష్కారం కనుగొనాలని కోరారు.

### ప్రభుత్వం ముందుగా ఒకటే చెప్పాలి

జీఓ 1181ను ప్రభుత్వం రద్దు చేస్తుందా? లేక పునఃపరిశీలిస్తుందా? అనే విషయాన్ని వెంటనే స్పష్టం చేయాలని శ్రీకాంత్ డిమాండ్ చేశారు. జీఓ వల్ల వేతనాల్లో ఎలాంటి మార్పు ఉండదని ప్రభుత్వం భావిస్తే, కేటగిరీవారీ వేతన వివరాలను అధికారికంగా ప్రకటించాలని కోరారు. ఒకవేళ వేతనాల్లో మార్పులు ఉంటే వాటికి కారణాలు, అమలు విధానం, ఇప్పటికే పనిచేస్తున్న ఉద్యోగుల వేతన రక్షణకు తీసుకునే చర్యలను కూడా స్పష్టం చేయాలన్నారు. అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఒకే విధమైన పారదర్శక వేతన విధానం అమలు చేయాలని, పని స్వభావం, అర్హత, అనుభవం, ప్రమాద స్థాయి ఆధారంగా వేతనాలను నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

### మాకు అదనంగా ఏమీ వద్దు, ఉన్న జీతం కాపాడండి

'మాకు అదనంగా ఏమీ ఇవ్వకపోయినా పర్వాలేదు. సంవత్సరాలుగా వస్తున్న వేతనాన్ని మాత్రం తగ్గించవద్దు. మురుగు కాలువల్లోకి దిగేది మేమే. రోడ్లపై చెత్త ఎత్తేది మేమే. మలమూత్రాలు, కుళ్లిన వ్యర్థాలు తొలగించేది మేమే. కుక్కలు, పందులు చనిపోతే దుర్వాసనను భరించి వాటిని తొలగించేది మేమే. కంప్యూటర్ ఆపరేటర్లు కార్యాలయ పనులు, బిల్ కలెక్టర్లు వసూళ్లు, డ్రైవర్లు వాహన సేవలు, హార్టికల్చర్ సిబ్బంది పచ్చదనం, మెడికల్ సిబ్బంది ఆరోగ్య సేవలు, రెవెన్యూ సిబ్బంది ప్రజా సేవలు, వాటర్ సిబ్బంది నీటి సరఫరా నిర్వహిస్తున్నారు. ప్రజలకు సేవలందిస్తున్న మా అందరి జీతాల్లో కోత పెట్టడం ఎంతవరకు న్యాయం? అని శ్రీకాంత్ ప్రశ్నించారు.

'అర్హత, అనుభవానికి తగిన గుర్తింపు ఇవ్వాలి. ఉద్యోగ భద్రతపై స్పష్టమైన విధానం తీసుకురావాలి. అన్ని శాఖల్లో పారదర్శకమైన ఒకే విధానాన్ని అమలు చేయాలి. పారిశుధ్య కార్మికులకు రక్షణ పరికరాలు, ఆరోగ్య భద్రత, ప్రమాద భత్యం కల్పించాలి. అన్ని విభాగాల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమయానికి వేతనాలు చెల్లించాలి అని ఆయన అన్నారు. 'జీఓ 1181ను రద్దు చేస్తారా? పునఃపరిశీలిస్తారా? ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించాలి. లేదంటే భార్యాపిల్లలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం. వంటావార్పు కార్యక్రమాలు నిర్వహిస్తాం. సీఎంఓ, ప్రగతిభవన్, ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం, సచివాలయాన్ని ముట్టడిస్తాం. రాష్ట్రంలోని నాలుగు మూలల నుంచి ఐదున్నారా లక్షల మంది ఉద్యోగులు రోడ్డెక్కి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తారు. ఈ పరిస్థితి రాకముందే ప్రభుత్వం చర్చలకు పిలిచి న్యాయం చేయాలి అని మియాపురం శ్రీకాంత్ స్పష్టం చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల ప్రతినిధులతో వెంటనే చర్చలు జరిపి జీఓ 1181పై నిర్ణయం తీసుకోవాలని, అన్ని శాఖల కేటగిరీవారీ వేతన వివరాలను బహిర్గతం చేయాలని, ఇప్పటికే పనిచేస్తున్న ఉద్యోగుల ప్రస్తుత వేతనానికి రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

---

# ముగ్ధంపురం ఎస్బిఐ బ్యాంక్ మిత్రపై వస్తున్న ఆరోపణలపై అనుమానాలు?

- సంఘాల రికార్డుల నిర్వహణ, ఆడిటింగ్‌పై వెల్లువెత్తుతున్న అనుమానాలు
- రికార్డుల్లో కొట్టివేతలు, పేజీల చింపివేత వెనుక ఆంతర్యమేమిటి?
- పాత లెక్కల కోసం కొత్త బుక్కుల మార్పిడిపై సర్వత్రా చర్చ




నర్సంపేట, నేటిధాత్రి:

వరంగల్ జిల్లా నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు ముగ్ధంపురంలో స్వయం సహాయక సంఘాల నిధుల వ్యవహారం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. గ్రామంలోని బంజారా, రాజేశ్వరి, విఘ్నేశ్వర గ్రామ సమాఖ్యల పరిధిలో మొత్తం 70 మహిళా స్వయం సహాయక సంఘాలు కొనసాగుతున్నాయి. అయితే, గత కొంతకాలంగా వివిధ సంఘాల నిధుల దుర్వినియోగం జరుగుతోందని, అందుకు ఎస్బిఐ బ్యాంక్ మిత్రే కారణమంటూ వస్తున్న ఆరోపణలపై స్థానికంగా తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆరోపణల వెనుక అసలు సూత్రధారులు వేరే ఉన్నారా అనే కోణంలో కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పటికప్పుడు లెక్కలను రికారులల్లో రాయాల్సిన సిఏలు ఏండ్ల తరబడి రాయకపోవడంతో మరిన్ని అనుమానాలు రేకెత్తుతున్నాయి.

### రికార్డులలో కొట్టివేతలు.. పేజీల చింపివేత!

గ్రామ సమాఖ్యల పరిధిలోని రికార్డుల నిర్వహణ అత్యంత అస్తవ్యస్తంగా ఉన్నట్లు తెలుస్తోంది. మహిళా సంఘాల సభ్యుల డిపాజిట్లు, రుణాల రికార్డు పుస్తకాల్లో విపరీతంగా కొట్టివేతలు ఉండడం, కొన్ని కీలకమైన బుక్కుల్లోని పేజీలను కావాలనే చించివేయడం స్థానికంగా పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా, నిబంధనలకు విరుద్ధంగా పాత లెక్కలను సరిచేసేందుకు కొత్త పుస్తకాల్లో రాతలు రాయడం వెనుక ఎవరి హస్తం ఉందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అసలు నిజాలను దాచిపెట్టేందుకే రికార్డులను తారుమారు చేశారనే అనుమానాలు బలపడుతున్నాయి.

సంఘాల నిర్వహణ కోసం ప్రభుత్వ అధీనంలో కేటాయించిన సిఏలు వారి వారి విధుల పట్ల బాధ్యత వహించకపోవడంతో ప్రజల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. నిధుల దుర్వినియోగం పట్ల రికార్డు బుక్కుల్లో అడిట్ చేసే క్రమంలో గత 6 సంవత్సరాలుగా సిఏ లెక్కలు,సమాచారం రాయకపోవడం నిధుల సమాచారం లేకపోవడంతో అడిటర్లు నివ్వెరపోయినట్లు సమాచారం. ఐతే లెక్కలు తేల్చడం ఎలా అని తలలు దాడుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయా వివోల పరిధిలో ఉన్న సంఘాల నిధుల దుర్వినియోగం సంఘాల సిఏ పనా లేక మరెవరైనా అని అనుమానాలు మరింత రేకెత్తుతున్నాయి.

### నాపై కావాలనే నిందలు వేస్తున్నారు:బ్యాంక్ మిత్ర గొడుగు కనకలక్ష్మి

ఈ వ్యవహారంపై ఎస్బిఐ బ్యాంక్ మిత్ర నిర్వాహకురాలు గొడుగు కనకలక్ష్మి తీవ్రంగా స్పందించారు. మహిళా సంఘాల నిధుల దుర్వినియోగంతో తనకు ఎలాంటి సంబంధమూ లేదని ఆమె స్పష్టం చేశారు. "గత కొన్ని సంవత్సరాలుగా నేను ఎంతో నిజాయితీగా, నిష్పాక్షికంగా నా విధులను నిర్వహిస్తున్నాను. కానీ, వివో కమ్యూనిటీ అసిస్టెంట్లు (సిఏలు), వివో నిర్వాహకులే నిధుల దుర్వినియోగం చేస్తూ, తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి నాపై నిందలు వేస్తున్నారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అసలు రికార్డులను ఆడిటింగ్ చేస్తే నిజానిజాలు బయటపడతాయని, కావాలని తన వ్యక్తిత్వాన్ని హననం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని పేర్కొన్నారు. నేను రసీదులు ఎప్పటికప్పుడు ఇచ్చాను. గత కొన్ని సంవత్సరాలుగా సిఏలు, సంఘాల బాధ్యులు సంబంధిత రికార్డులలో జమలు చెల్లింపులు ఎందుకు రాయలేదు అని ప్రశ్నించారు. కొన్ని బుక్కుల్లో పేజీలను చించిపేశారని అలాగే కొట్టివేతలు చేశారని,నాపై అవినీతి బురదజల్లాలని కొన్ని కొత్త బుక్కుల్లో లెక్కలు రాస్తున్నారని ఆరోపించారు.నేను కొన్ని సంవత్సరాలుగా ఎస్బిఐ బ్యాంక్ మిత్రగా సేవలు అందిస్తున్న.చెన్నారావుపేట,నర్సంపేట మండలాల నుండి ఖాతాదారులు వస్తుంటారు.రైతు బంధు,సేవింగ్ ఖాతాలు,ఇతర లావాదేవీలు జరుపుతాను.ఇప్పటి వరకు నాపై ఎలాంటి రిమార్క్ లేదు అని గొడుగు కనకలక్ష్మి తెలిపారు.నేను చేసిన సేవలకు ఎస్బిఐ బ్యాంక్ అధికారులు ఉత్తమ బ్యాంకు మిత్రగా అవార్డు ఇచ్చారని ఆమె పేర్కొన్నారు. నేను మహిళా సంఘాలను సంబంధించిన ఎలాంటి నిధుల దుర్వినియోగానికి పాల్పడలేదు అని కావాలనే నాపై అసత్యపు ప్రచారం చేస్తున్నారని బ్యాంకు మిత్ర గొడుగు కనకలక్ష్మి తెలిపారు.



- నిధుల దుర్వినియోగంతో నాకు ఏలాంటి సంబంధం లేదు: ఎస్బిఐ బ్యాంక్ మిత్ర కనకలక్ష్మి

# జిల్లా టీఎల్ఎస్ఏ అధ్యక్షుడిగా దుప్పటి సుజయ్ రణదేవ్



పరకాల, నేటిధాత్రి: తెలంగాణ లీగల్ స్టూడెంట్ అసోసియేషన్(టీఎల్ఎస్ఏ)హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా పరకాలకు చెందిన దుప్పటి సుజయ్ రణదేవ్‌ను నియమించారు.టీఎల్ఎస్ఏ సంస్థ అభివృద్ధి,విద్యార్థుల సమస్యల పరిష్కారం,సంస్థ లక్ష్యాల సాధనకు మరింత బలోపేతం చేయడంలో భాగంగా ఈ నియామకం చేపట్టినట్లు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కె.బాలు నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు.విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంతో పాటు సంస్థ లక్ష్యాల సాధనలో సుజయ్ రణదేవ్ తన వంతు కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు.సంస్థ కార్యకలాపాలకు విద్యార్థులు,సభ్యులు సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా టీఎల్ఎస్ఏ అధ్యక్షుడిగా నియమితులైన దుప్పటి సుజయ్ రణదేవ్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# ఖమ్మం జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

**ఐఎఫ్టీయూ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఏఐ కెఎంఎస్ నాయకుల పిలుపు...**



ఆళ్ళపల్లి, నేటిధాత్రి: సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో ఖమ్మంలో జరగనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (AIKMS) జాతీయ మహాసభలను అత్యంత విజయవంతం చేయాలని కోరుతూ మండల పరిధిలోని రాయిపాడు, ముత్తాపురం గ్రామాలలో రౌండ్ టేబుల్ గ్రూప్ మీటింగ్ నిర్వహించి, మహాసభల గోడ పత్రికలను (పోస్టర్లను) నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు కొక్కు సారంగపాణి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ మండల కార్యదర్శి బట్టు సురేష్ మాట్లాడారు. ఖమ్మం నగరం వేదికగా జరగబోయే ఈ జాతీయ మహాసభలకు కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు మరియు ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా, కార్మిక, రైతు సమస్యలపై భవిష్యత్ ఉద్యమ పోరాట దిశా నిర్దేశానికి ఈ మహాసభలు వేదిక కానున్నాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు వాగబోయిన రాంబాబు, పూసం రాంబాబులతో పాటు గ్రామ నాయకులు పెండెకట్ల ముత్తక్క, పెండెకట్ల యర్రన్న, కృష్ణ, అనిల్, రాంబాబు మరియు పలువురు పార్టీ, ప్రజా సంఘాల కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఆత్మగౌరవ పతాకం

**మూడు తరాల ఉద్యమ దార్శనికులు శ్రీఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక మాత్రమే కాదు పతాక కూడా - తహశీల్దార్ దాసరి రాజమల్లు....**



కరీంనగర్, నేటిధాత్రి: కొందరు జీవితాంతం తమ కోసమే బ్రతికితే మరికొందరు జీవితాంతం ప్రజల కోసం, వ్యవస్థ కోసమే బ్రతుకుతారు. రెండవ కోవకు చెందిన వ్యక్తి తెలంగాణ ఉద్యమానికి కొండంత అండ తెలంగాణ ఆత్మగౌరవ పతాక, మూడు తరాల ఉద్యమ దార్శనికుడు శ్రీఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని కరీంనగర్ జిల్లా రామడుగు మండల తహసీల్దార్ దాసరి రాజమల్లు అన్నారు. గోపాలరావుపేట పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి సంఘ భవనంలో బుధవారం శ్రీఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహశీల్దార్ దాసరి రాజమల్లు మాట్లడుతూ తెలంగాణ ప్రాంతంలో బాపూజీగా పిలువబడే కొండాలక్ష్మణ్ తన జీవిత కాలంలో తెలంగాణ కోసం ప్రాధాన్యత ఇవ్వడం వల్ల అనేక సార్లు ముఖ్యమంత్రి పదవి కూడా వదులుకున్నారని, ఎన్నో కుల సంఘాలకు సహకార సంఘాలకు మార్గదర్శకత్వం వహించిన బాపూజీ సంఘాలకు నిరంతరం మద్దతిచ్చి ముందుకు సాగేవారని, సంఘాల రిజిస్ట్రేషన్లు, రిజర్వేషన్లు, కుల వృత్తి సహకార సంఘాలకు సబ్సిడీలు, రాయితీలు, చేనేత అభివృద్ధి, హక్కుల వంటి అంశాలలో అనేక కార్యక్రమాలు చేపట్టి ఆవర్గాలకు అండగా ఉన్నారని, బహుజనులు అన్ని రంగాలలో సాధికారత సాధించాలని ఆశించిన బాపూజీ అందుకు విద్య మార్గమని విద్యని అందుకోవడానికి హాస్టల్ సౌకర్యాలను సమకూర్చడంలో కృషి చేశారన్నారు. అనంతరం జాతీయ యువజన అవార్డు గ్రహీత, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు అలువాల విష్ణు మాట్లాడుతూ 1977 ఎన్నికల్లో శాసనసభ్యునిగా గెలిచి మంత్రి పదవి దక్కినప్పటికీ ఉమ్మడి రాష్ట్రాన్ని రాష్ట్ర పాలనను వ్యతిరేకించారని, 1969లో తొలి దశ తెలంగాణ ఉద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించారని, తెలంగాణ కోసం 1969 మార్చి 27న ఆయన మంత్రి పదవికి రాజీనామా చేశారని, తెలంగాణ ఆత్మగౌరవం కోసం వెనక్కు తగ్గక పదవిని త్యాగం చేసిన ధన్యజీవి. మంత్రి పదవి త్యాగం చేసి తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పాల్గొన్నందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆయనను అరెస్ట్ చేసి జైలుకు పంపిందని, చిన్నతనంలోనే ధిక్కార స్వరాన్ని సొంతం చేసుకున్న ఆయనకు పోరాట దృక్పథం అలవడిందని, విద్యార్థిదశలో గ్రామంలో మూఢనమ్మకాలను వ్యతిరేకించడంతో పాటు యువజన సంఘాలను ఏర్పాటు చేశారని, ముఖ్యమంత్రి పదవికి రెండుసార్లు పరిశీలించినప్పటికీ ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కంటే తెలంగాణ రాష్ట్రమే ముఖ్యమని కేంద్రానికి చెప్పడంతో ఆయనకు ముఖ్యమంత్రి పదవి దక్కలేదని అన్నారు. ఈసందర్భంగా పద్మశాలి యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోలిపాక కమలాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క చేనేత కుటుంబానికి చేనేత భీమా పథకాన్ని వర్తింపజేయాలని, చేనేత భీమా పథకానికి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని ఈసందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎడవల్లి వనజా నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ బుర్ర నరేష్ గౌడ్, పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు కొలిపాక మల్లయ్య, వర్తక సంఘం అధ్యక్షులు కొలిపాక నాగరాజు, పద్మశాలి సంఘం నాయకులు, సిరిపురం మల్లేశం, కొలిపాక శ్రీనివాస్, మచ్చ గంగయ్య, అలవాల శంకర్, మామిడాల నాగరాజు, నల్ల శ్రీనివాస్, గోనె రాజు,కొలిపాక కమలాకర్, సిరిపురం గంగరాజు, కొలిపాక సత్తయ్య , కోలిపాక లక్ష్మణ్, ఆడేటి సంతోష్, కొలిపాక అజయ్, కొలిపాక మల్లేశం, కొలిపాక నాగరాజు, కొలిపాక రాములు, అలువాల జగదీష్, కొలిపాక పురుషోత్తం, కొలిపాక భూమయ్య, కొలిపాక సీతారాములు, పలువురు కుల సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సర్వేల్ గురుకుల పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సందర్శన

**విద్యార్థుల సమస్యలు, వసతులపై సమగ్ర పరిశీలన....**



యాదాద్రి సర్వేల్, నేటిధాత్రి: సర్వేల్ గురుకుల పాఠశాలను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సందర్శించి విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, వసతులు, భోజనం, వసతి సౌకర్యాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడిన చైర్మన్ వారి విద్యాభ్యాసం, పాఠశాలలో ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, వారి సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చైర్మన్ పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, అందుబాటులో ఉన్న ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశమైన చైర్మన్ విద్యా ప్రమాణాలు, విద్యార్థుల ప్రగతి, మౌలిక వసతులపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా గణపతి నిమజ్జనం జరపాలి

**మాజీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్....**



నర్సంపేట, నేటిధాత్రి: నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని మాదన్నపేట చెరువు కట్టపై ఈ నెల 23న నిర్వహించనున్న గణపతి నిమజ్జన కార్యక్రమాలను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్ కోరారు. నిమజ్జనం కోసం మున్సిపల్ సిబ్బంది చేపడుతున్న పారిశుద్ధ్య, ముందస్తు ఏర్పాట్లను పలువురు కౌన్సిలర్ మిత్రులైన వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ యూఐ పట్టణ అధ్యక్షుడు కటారి ఉత్తమ్ కుమార్ లతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సాంబయ్య గౌడ్ మాట్లాడుతూ... నిమజ్జన ఊరేగింపుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తులు నియమ నిష్ఠలతో పాల్గొనాలన్నారు. ఊరేగింపు సమయంలో డీజేలు వినియోగించరాదని, మద్యం సేవించి ఎవరూ రావద్దని సూచించారు. ఆ గణనాథుని ఆశీస్సులతో నర్సంపేట ప్రాంతంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జవాన్లు కందికొండ స్వామి, గోపగాని ప్రభాకర్, రమేష్, మహేందర్ తో పాటు ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# శివాలయం పునర్నిర్మాణానికి విరాళం.



చిట్యాల, నేటిధాత్రి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని చిట్యాల మండలం లోని నవాబుపేట గ్రామ శివాలయ నిర్మాణానికి తూడి ముక్తేశ్వర్ రెడ్డీ దంపతులు పోతుగల్లు అబిరాం రెడ్డీ 1,00,116 రూపాయలు విరాళం ఇచ్చారు, ఈ కార్యక్రమంలో రత్నాకర్ రెడ్డి రాఘవరెడ్డి శరత్ కుమార్ సారంగం సత్యనారాయణ రెడ్డి రాజయ్య నరేష్ ప్రభాకర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి శ్రీకాంత్ సతీష్ రాజు దుర్గారావ్ పాల్గొన్నారు.

# "డి ఎమ్ జె ఎ" సేవలు అవసరం



**కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు....**

శ్రీకాకుళం, నేటిధాత్రి: దేశవ్యాప్తంగా, తెలుగు రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న డిజిటల్ మీడియా జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే లక్ష్యంగా ఏర్పాటైన డిజిటల్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ (DMJA) అధికారిక లోగోను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేషనల్ ప్రెసిడెంట్ వేలూరి శివకుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి గొంద్యాల దుర్గాప్రసాద్ ,ఏపీ ప్రెసిడెంట్



డాక్టర్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, జాయింట్ సెక్రటరీ జనరల్ వై. గాయత్రి రెడ్డి పాల్గొని కేంద్ర మంత్రితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. డిజిటల్ మీడియా ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితులు, ఫీల్డ్ రిపోర్టర్ల సమస్యలు, అసోసియేషన్ భవిష్యత్ కార్యాచరణను కేంద్ర మంత్రికి వివరించారు. ఈ వివరాలను సావధానంగా విన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ, క్షేత్రస్థాయిలో కష్టపడే డిజిటల్ వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం తరపున ప్రోత్సాహం కల్పిస్తామని బరోసా ఇచ్చారు..అనంతరం జాతీయ అద్యక్షులు వేలూరి శివకుమార్ మాట్లాడుతూ, డిజిటల్ జర్నలిజంలో పారదర్శకత, బాధ్యతను పెంపొందించేందుకు సంస్థను కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (MCA) వద్ద సెక్షన్ 8(1) కింద లైసెన్స్ నెం. 164827, రిజిస్ట్రేషన్ నెం. U88900TS2025NPL194539 తో అధికారికంగా నమోదు చేసినట్లు తెలిపారు. కేంద్ర సమాచార ప్రసార శాఖ (MIB) గుర్తింపు పొందిన వర్కింగ్ జర్నలిస్ట్ మీడియా కౌన్సిల్ (WJMC) సెల్ఫ్-రెగ్యులేటరీ బాడీ నిబంధనలు, ఐటీ రూల్స్ 2021 ఎథిక్స్ కోడ్‌ను అసోసియేషన్ ఖచ్చితంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. నకిలీ ఐడీ కార్డులను పూర్తిగా అరికట్టేందుకు www.dmja.org పోర్టల్ ద్వారా డైనమిక్ క్యూఆర్ కోడ్ (QR Code) ఆధారిత ఐడీ కార్డుల వ్యవస్థను తీసుకొచ్చినట్లు వెల్లడించారు. అర్హులైన జర్నలిస్టులకు ప్రమాద బీమా, రైల్వే, బస్సు పాసులు, అక్రిడిటేషన్లలో న్యాయమైన ప్రాధాన్యత కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద గళం విప్పుతామని నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ముఖ్య ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# ఏఐకేఎంఎస్ 4వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి



**వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు...**

వరంగల్, నేటిధాత్రి: ఈనెల 28, 29,30 తేదీలలో ఖమ్మం జిల్లా కేంద్రంలో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాల్గవ జాతీయ మహాసభలు జరగబోతున్నాయని ఈ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు తెలిపారు.సభలను జయప్రదం చేయాలని కోరుతూ ఈరోజు వరంగల్ గ్రైన్ మార్కెట్ సెంటర్లో ఆ సంఘం నాయకులు పోస్టర్ ను ఆవిష్కరించారు.28వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు పెవిలియన్ గ్రౌండ్ నుండి ప్రజా ప్రదర్శన ఉంటుందని మధ్యాహ్నం రెండు గంటలకు ఎస్సార్ అండ్ బిజీఎన్ఆర్ కాలేజ్ గ్రౌండ్ లో బహిరంగ సభ జరుగుతుందన్నారు.ఈ సభకు ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య అధ్యక్షత వహిస్తారని జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆశిష్ మిట్టల్, ఉపాధ్యక్షులు జితేందర్ సింగ్, సుశాంత్ ఝా, తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి కోటేశ్వరరావు, అధ్యక్ష కార్యదర్శులు మామిడాల బిక్షపతి, గౌని ఐలయ్య లతోపాటు ఒడిస్సా, పశ్చిమబెంగాల్, ఉత్తర ప్రదేశ్,పంజాబ్, బీహార్,అస్సాం తదితర రాష్ట్రాల నాయకులు ప్రసంగిస్తారని తెలిపారు.29,30 తేదీలలో ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్ లో ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి ప్రారంభ ఉపన్యాసం చేస్తారని మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ తొలిపలుకులు ఇస్తారని ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వేణు ప్రసంగిస్తారని ఆయన తెలిపారు.ఈ మహాసభలలో కార్పొరేట్ వ్యవసాయ రంగం బలవంతపు భూసేకరణ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు రుణమాఫీ చట్టం, గ్రామీణ ఉపాధి హామీ పథకం,మోడీ ప్రభుత్వ ఫాసిస్ట్ నిర్బంధం పర్యావరణం మొదలగు అంశాలపై చర్చ ఉంటుందన్నారు. సభలను జయప్రదం చేయాలని రైతు కూలీలతో పాటు వివిధ వర్గాల ప్రజలను ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి బండి వెంకటేశ్వర్లు, ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్,సహాయ కార్యదర్శి బండి కుమార్,పోతరాజు రాజు, జక్కుల రమేష్, ఓర్సు సుధాకర్, చేరాలు, శంకర్, భాస్కర్, రాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రయాణికుల ఇబ్బందులు



వీణవంక, నేటిధాత్రి: జమ్మికుంట నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఫోర్ లేన్ రోడ్డు రహదారిలో వీణవంక నుంచి కోర్కల్ గ్రామం వరకు రోడ్డు నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తి కాకపోవడంతో బస్సులు,ఆటోలు, ఇతర వాహనాలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు మార్గంలో పెద్ద గుంతలు ఏర్పడి, దుమ్ము, బురదతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని స్థానికులు తెలిపారు. వర్షం పడినప్పుడు గుంతల్లో నీరు నిలిచి వాహనదారులకు దారి పరిస్థితి అర్థం కాక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు . అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ లు, కార్లు,స్కూల్ బస్సులు కూడా ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డు దుస్థితిపై గతంలో పలుమార్లు పత్రికలలో వార్తలు ప్రచురితమైనప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిత్యం అధికారులు, నాయకులు ఇదే రహదారిపై ప్రయాణిస్తూ...? పరిస్థితిని గమనించిన చర్యలు తీసుకోవడం విచారకరమని మండల ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీణవంక కోర్కల్ ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు, తాత్కాలికంగా గుంతలను పూడ్చి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు



పాటన్‌చేరు, నేటిధాత్రి: శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో పలువురు చిన్నారుల కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బీరంగూడ సాయి భగవాన్ కాలనీలో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ, వందనపురి కాలనీ సొసైటీ ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆదివారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక పూజల అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు



అలరించాయి. భరత వేద ఆర్ట్స్ అసోసియేషన్ నిర్వాహకులు డాక్టర్ పీ శ్రీనివాస్ వరప్రసాద్, డాక్టర్ సంధ్యా దేవి సమక్షంలో చిన్నారులు కృతి అన్వికశ్రీ, అన్విత, ఆనంది, లాస్య, వివర్ధన కృష్ణ, భవ్యశ్రీ, హాసిని, దుర్గ, సహస్ర, వేద, కార్తిక, ఆద్య, సిరి, అవని, ఋత్విక, సౌగంధి, చక్రికలు కూచిపూడి నృత్యరూపకంలో పలు అంశాలను నర్తించిన తీరు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. అనంతరం గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు మోహన్ శంకర్, రాజశేఖర్, కృష్ణ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి,శ్రీనివాస్,సాగర్,వీరేందర్,సంజీవ, భాస్కర్ రెడ్డి, సురేష్,సతీష్,సత్యనారాయణ రెడ్డి సత్యనారాయణ రాజు, ఇందు శేఖర్ రెడ్డి తదితరులు పిల్లలని అభినందించి బహుమతులు అందజేశారు

# గణేష్ నవరాత్రి ఉత్సవాలలోఘనంగా కుంకుమ పూజ.



చిట్యాల, నేటిధాత్రి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం బావుసింగ్ పల్లి గ్రామంలో శ్రీ రామధూత హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు గణపతి కుంకుమ పూజ కార్యక్రమంలో భాగంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడికి రకరకాల పూలతో అలకరించి, తీర్థప్రసాదాలు సమర్పించి,భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ కుంకుమ అర్చన చెయ్యడం వలన తెలంగాణ ప్రాంతంలో రైతులకు వర్షాలు సకాలంలో పడి పాడిపశువుల, పంటలు బాగా పండి, అందరు ఆయురారోగ్యాలతో ఉండాలని గణేష్ ని ఆశీస్సులు ఉండలని కోరారు మహిళలు, పెద్దలు, చిన్నలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని గణపయ్య ఆశీస్సులు పొందారు.

# రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ క్రీడల్లో నైన్ పాక విద్యార్థినీల ప్రతిభ.




చిట్యాల, నేటిధాత్రి: చిట్యాల మండలం జడ్.పి.హెచ్.ఎస్ నైన్ పాక పాఠశాలకు చెందిన తొట్ల వాగ్దేవి పదవ తరగతి, పాలడుగుల మధుప్రియ పదవ తరగతి విధ్యర్థినులు రాష్ట్రస్థాయిలో పాల్గొన్నారు, అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏం సుధాకర్ మరియు ఫిజికల్ డైరెక్టర్ బి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన జిల్లా స్థాయి క్రీడల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికై ఈనెల 19,20 తేదీలలో నిజామాబాదులో జరిగిన 11వ తెలంగాణ సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ క్రీడలలో పాల్గొన్నారు అని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏం సుధాకర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ నైన్ పాక పాఠశాల నుండి విద్యార్థినిలు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షిస్తూ, క్రీడాకారులకు మరియు ఫిజికల్ డైరెక్టర్ కు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ప్రణీత ,పల్లవి, ప్రవీణ్ కుమార్ రఘు, రాజయ్య, నాగరాజు, రఘునాథ్, కోటేశ్వరరావు సి ఆర్ పి తిరుపతి ,ఓదేలు మరియు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాలొన్నారు.


# చల్లగరిగే లో భూములు రీ సర్వే ప్రారంభం.

**తహసీల్దార్ వసంతరావు.**



చిట్యాల, నేటిధాత్రి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని చిట్యాల మండలం లోని చల్లగారిగే గ్రామంలో భూముల రీ సర్వే మొదలు కావడం జరిగింది అని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వసంతరావు తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేలో మొదలుగా గ్రామం సరిహద్దులు నిర్ణయించుట జరుగుతుంది అని అన్నారు, ఈ సర్వే లో చల్లగరిగె గ్రామ సర్పంచ్ సిరిపెల్లి జంపయ్య మరియు వార్డు సభ్యులు గ్రామ పెద్దలు రైతులు జూకల్ గ్రామ శివారు రైతులు మండల సర్వేయర్ గ్రామ జిపిఓ జూకల్ గ్రామం జిపిఓ మరియు ఇతర గ్రామాల జిపిఓలు రైతులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం




పరకాల, నేటిధాత్రి: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలితరం ఉద్యమ నాయకుడు స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని మడికొండ బ్రదర్స్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో, తెలంగాణ ఉద్యమంలో,బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. సమాజంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ మడికొండ శ్రీను,బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు,మాజీ కౌన్సిలర్,సమన్వయ కమిటీ సభ్యులు మడికొండ సంపత్ కుమార్,కాంగ్రెస్ నాయకులు బొచ్చు జితేందర్,ఉడుత సుమన్,భాషబోయిన తిరుపతి,మిత్రులు ఒంటేరు గోపి,ఒంటెల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్కేపీ ఓసీపీలో 58 లక్షల షావల్ యంత్రం ప్రారంభం.

▸▸ త్వరలో పూర్తిస్థాయిలో రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ బి 2...

▸▸ ముందస్తు పనులకు యంత్రం వినియోగం:

▸▸ మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ...





**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** మందమర్రి ఏరియా పరిధిలోని రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ (ఆర్కేపీ ఓసీపీ)లో రూ.58 లక్షల వ్యయంతో నూతనంగా సమకూర్చిన షావల్ యంత్రాన్ని సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకమైన రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టును అతి త్వరలోనే పూర్తిస్థాయిలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు ప్రారంభానికి అవసరమైన ముందస్తు సన్నాహక పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రాజెక్టు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అవసరమైన భూమిని సమన్వయం చేయడంతో పాటు డంప్‌యార్డ్‌ల సంబంధించిన పనులను వేగవంతం చేసేందుకు నూతనంగా సమకూర్చిన షావల్ యంత్రాన్ని వినియోగిస్తున్నట్లు వివరించారు. ఓపెన్ కాస్ట్ బొగ్గు గనుల నిర్వహణలో షావల్ యంత్రాలు అత్యంత కీలకమైనవని జీఎం తెలిపారు. బొగ్గు పొరపై పేరుకుపోయిన భారీ మట్టి, రాతి పొరలను తొలగించడం (ఓవర్‌బర్డెన్)లో ఈ యంత్రం ముఖ్యపాత్ర పోషిస్తుందని చెప్పారు. అలాగే తవ్విన మట్టి, బొగ్గును భారీ డంపర్లలోకి వేగంగా లోడ్ చేయడానికి కూడా షావల్ యంత్రం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆర్కేపీ ఓసీపీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చే ముందు చేపట్టాల్సిన వివిధ పనులకు ఈ యంత్రం ఉపయోగపడుతుందని తెలిపారు. ముఖ్యంగా డంప్‌యార్డ్ ఏర్పాటుతో పాటు ప్రాజెక్టు పరిధిలోని ప్రాంతాల్లో అవసరమైన భూమిని సిద్ధం చేయడం, మట్టి తరలింపు వంటి పనుల్లో యంత్రం సేవలను వినియోగించనున్నట్లు చెప్పారు. నూతన యంత్రం అందుబాటులోకి రావడంతో ప్రాజెక్టు పనులు మరింత వేగవంతం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు ఫేస్-2 పనులు ప్రారంభానికి ముందస్తుగా చేపట్టాల్సిన పనులపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో అవసరమైన మౌలిక సదుపాయాలు, డంప్‌యార్డ్, భూమి సమన్వయం తదితర పనులను దశలవారీగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నూతన షావల్ యంత్రం అందుబాటులోకి రావడంతో సంబంధిత పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు మరింత అవకాశం ఏర్పడిందన్నారు. భారీ స్థాయిలో మట్టి, రాతి పొరలను తొలగించాల్సిన సందర్భాల్లో యంత్రాల వినియోగం ద్వారా పనుల సామర్థ్యం పెరుగుతుందని అధికారులు వివరించారు. ఆర్కేపీ ఓసీపీ ప్రాజెక్టు కార్యకలాపాలకు అవసరమైన సన్నాహకాల్లో ఈ యంత్రం కీలకంగా ఉపయోగపడనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం జి.ఎల్. ప్రసాద్, ఏరియా ఇంజనీర్ (ఈఅండ్ఎం) బాలాజీ భగవతి జ, కేకే ఓసీపీ మరియు ఆర్కేపీ ఓసీపీ మేనేజర్ రామారావు, డిప్యూటీ జీఎం (స్టోర్స్) రవీందర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ (వర్క్‌షాప్) సంపత్, సూపరింటెండింగ్ ఇంజనీర్ (సిహెచ్‌పీ) చంద్రమౌళి, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ హరి రామకృష్ణ తదితరులతో పాటు ఆర్కేపీ ఓసీపీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. నూతన షావల్ యంత్రం ప్రారంభంతో ఆర్కేపీ ఓసీపీ ప్రాజెక్టు పనులకు మరింత ఊతం లభించనుందని అధికారులు, సిబ్బంది పేర్కొన్నారు.

# ఉచితంగా కంప్యూటర్, గ్రంథాలయ పుస్తకాల పంపిణీ



**మంగపేట, నేటిధాత్రి:** విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు, ఆధునిక విద్యకు అవసరమైన పరిజ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతో అమెరికాలోని మిడ్‌వెస్ట్ ప్రాంతంలో సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్‌గా, స్కూల్ ఆఫ్ ఇండియా ఫర్ లాంగ్వేజెస్ అండ్ కల్చర్‌లో సుమారు 15 సంవత్సరాలుగా స్వచ్ఛంద సేవలు అందిస్తున్న డాక్టర్ జాస్తి శివరామకృష్ణ తన స్వగ్రామ ప్రాంతానికి సేవ చేయాలనే సంకల్పంతో స్వచ్ఛంద సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డాక్టర్ జాస్తి శివరామకృష్ణకు మల్లూరు గ్రామానికి చెందిన శ్రీ గంటా భగీరథుడు మేనమామ. ఈ కుటుంబ సంబంధం ద్వారా మంగపేట మండలంలోని పాఠశాలల అవసరాలను తెలుసుకున్న డాక్టర్ జాస్తి శివరామకృష్ణ తన మేనమామ గంటా భగీరథుడి సహకారంతో మండలంలోని వెనుకబడిన ప్రాంతాల పాఠశాలలకు పుస్తకాలు అందించేందుకు ముందుకు వచ్చారు. మంగపేట మండలంలోని విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో ముందుకు సాగాలనే ఉద్దేశంతో డాక్టర్ జాస్తి శివరామకృష్ణ ఆధ్వర్యంలో, ఆయన మేనమామ శ్రీ గంటా భగీరథుడి సహకారంతో మండలంలోని 13 పాఠశాలలకు కంప్యూటర్ సంబంధిత పుస్తకాలు, గ్రంథాలయ పుస్తకాలను ఉచితంగా అందించారు. అందిన పుస్తకాలను ప్రతిరోజూ విద్యార్థులకు అందుబాటులో ఉంచి, వాటిని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి కృషి చేస్తామని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 22న డాక్టర్ జాస్తి శివరామకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోడెబోయిన సర్వంగారావు పాల్గొన్నారు. ప్రత్యేక సమావేశంలో మండల విద్యాధికారి పాడెం మేనక మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉచితంగా గ్రంథాలయ పుస్తకాలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు, వారి జ్ఞానాన్ని విస్తరించేందుకు మరియు సర్వతోముఖ అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. డాక్టర్ జాస్తి శివరామకృష్ణ, గంటా భగీరథుడు అందిస్తున్న సేవలను ఆమె అభినందించారు.

# గణపతి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న పరకాల కాంగ్రెస్ నాయకులు



**పరకాల, నేటిధాత్రి:** శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హనుమకొండ నయీంనగర్‌లోని మారుతి చింతల్ ప్రాంతంలో గజానన ఉత్సవ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడిని పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్, ఏఎంసీ గౌరవ అధ్యక్షులు సోదా రామకృష్ణ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత,సోదరభావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 53వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సోదా కిరణ్,పరకాల కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు పసుల రమేష్,బండి సదానందం గౌడ్,ఏకు రాజు,కాంగ్రెస్ నాయకులు బొచ్చు జెమిని,ఆనంద్ రెడ్డి,చంద్రమౌళి,వెంకటరమణ,మునిగంటి విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# కన్నె రాజుకు రక్తదానంలో ఉత్తమ సేవా పురస్కారం

▸▸ 21 ఏళ్లుగా రక్తదాన సేవల్లో విశేష కృషి...



**పరకాల, నేటిధాత్రి:** వరంగల్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏఆర్ 2009 బ్యాచ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బ్లడ్ డోనర్, బ్లడ్ మోటివేటర్ కన్నె రాజు(స్విమ్మర్ రాజు)కు రక్తదానంలో ఉత్తమ సేవా పురస్కారం2026 లభించింది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ మండలంలోని పీఎస్ ఫంక్షన్ హాల్‌లో భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. గత 21 ఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కన్నె రాజు స్వయంగా 38 సార్లు రక్తదానం చేయడంతో పాటు, అత్యవసర రోగులకు దాతల సహకారంతో 18,832 మందికి ఉచితంగా రక్తం అందించడంలో కీలక పాత్ర పోషించారు.

అలాగే తలసేమియా చిన్నారుల కోసం 86 రక్తదాన శిబిరాలు నిర్వహించడం, కోవిడ్ సమయంలో 235 మందికి ప్లాస్మాదానం చేయించడం, 430 రోజులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం వంటి సేవలు అందించారు. ఆయన సేవలను గుర్తించిన భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ అధ్యక్షులు కురుమేటి నవీన్, ప్రధాన కార్యదర్శి హేమంత్ అవార్డుకు ఎంపిక చేశారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ బ్లడ్ డోనర్ డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ గౌతమ్ కుమార్, జే.బి.బాలు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ అవార్డును తన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, రక్తదాతలు, యువ నేతాజీ ఫౌండేషన్ సభ్యులు, గురువులు, రాగంపేట గ్రామ ప్రజలు, పోలీసు ఉన్నతాధికారులకు అంకితం చేస్తున్నట్లు కన్నె రాజు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలు

▸▸ మారుతీనగర్ రోడ్ నంబర్-2 లో నిత్య అన్నదానం.....



**మంచిర్యాల, నేటిధాత్రి:** వినాయక చవితిని పురస్కరించుకుని మంచిర్యాల పట్టణంలోని మారుతీనగర్ రోడ్ నంబర్-2 లో వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. భాద్రపద శుద్ధ చవితి నుంచి ప్రారంభమైన ఉత్సవాల్లో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు, భజనలు నిర్వహిస్తున్నారు.

ఉత్సవాల్లో భాగంగా చిన్నారులు, మహిళలు, యువత కోసం వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రతిరోజూ భక్తులకు నిత్య అన్నదానం నిర్వహిస్తూ, ప్రసాద వితరణ చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారని తెలిపారు. నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదానం అనంతరం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు భక్తులు, ప్రజలు సహకరించాలని వారు కోరారు.

# గణనాధుని సన్నిధిలో గొప్ప అన్నదానం



**శ్రీరాంపూర్, నేటిధాత్రి:** శ్రీ మల్లికార్జున నగర్ గణేష్ మండలి తీగల్ పహాడ్ నందు వినాయక మండపం వద్ద, గొప్ప అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆ గణనాధుని. సన్నిధిలో, భక్తిశ్రద్ధలతో, వినాయక కమిటీ సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే భజన కార్యక్రమం, రంగా రంగా వైభవంగా. భజన కళాకారులతో ఆ యొక్క గణ నాధునికి నిత్యం పూజలతో భజనలు చేయించి. భజన కళాకారులకు సన్మానం చేయించారు, ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మహా ప్రసాదాన్ని స్వీకరించారు. సభ్యులు భక్తులకు మంచి సేవలు అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమం విజయవంతం కావడం ఆనందంగా ఉందన్నారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో స్థానిక ప్రజలు, భక్తులు, యువకులు పాల్గొని నిర్వాహకులను అభినందించారు. భక్తి శ్రద్ధల మధ్య కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని. కమిటీ సభ్యులు తెలిపారు. ఇలాంటి మరెన్నో సేవలు మేమందరం కలిసి కట్టుగా చేస్తామని తెలియపరిచారు.



# కోటగుళ్ళ లో ఎస్ఐ దంపతుల పూజలు



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళా క్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ లో ఎస్ఐ రాజశేఖర్, యోగిత దంపతులు సోమవారం స్వామివారికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపురం పోలీస్ స్టేషన్ లో రెండవ ఎస్సైగా పనిచేసి బదిలీపై వెళ్తున్న సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నారుఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు.

# వినాయక నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన



**శాయంపేట, నేటిధాత్రి:** శాయంపేట మండల కేంద్రం లోని అన్ని గ్రామాల్లోని గణ నాథులు నవరాత్రులు ముగించుకొని నిమజ్జనం చేసే ప్రదేశాన్ని అధికారులు పరిశీలించారు భద్రతా ఏర్పాట్లను మండల స్థాయి అధికారులు క్షేత్రస్థా యిలో పరిశీలించారు. ప్రగతి సింగా రంవద్ద గల చలివాగు ప్రాజెక్టు బ్రిడ్జి, అలాగే గ్రామ పరిధిలోని దేవుని కుంట, తాళ్ళ కుంటలను అధికా రులు పరిశీలించి, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సమీక్షించారు. నిమజ్జన ప్రాంతాల వద్ద ప్రమాదాలు జరగకుండా బారికేడ్ల ఏర్పాటు, తగినంత వెలు తురు కోసం విద్యుత్ దీపా లు, క్రేన్ల ఏర్పాటు మరియు పటిష్ట



బందోబస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఉత్సవ కమిటీలు, నిర్వా హకులు పోలీసు మరియు రెవెన్యూ శాఖల నిబంధ నలను పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో విజయవం తం చేయాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ సుధాకర్ రెడ్డి, తహ సిల్దార్ ప్రవీణ్ కుమార్, ఎస్సై పరమేశ్వర్, ఎంపీడీవో ఫణి చంద్ర, టీజీఎస్పీడీసీ ఎల్ చొక్కారావు అధికా రులు పాల్గొన్నారు

# అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన

▸▸ పిల్లలు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి....



**సిరిసిల్ల, నేటిధాత్రి:** రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలోని ఐదో వార్డులో సోమవారం రెండు అంగన్వాడీ కేంద్రంలో కమిటీలు వేయడం జరిగింది. ఈ అంగన్వాడి కేంద్రం కమిటీలకు అధ్యక్షులుగా వార్డు కౌన్సిలర్ దార్నం అరుణ లక్ష్మీనారాయణ ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, వారి ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితులపై చర్చించారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదల కోసం అంగన్వాడీ కేంద్రం ద్వారా పాలు, గుడ్లు, పిండి పదార్థాలు, ఇతర పోషకాహారం అందిస్తున్నట్లు దార్నం అరుణ తెలిపారు. గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన ఆహార విధానాలపై కూడా అవగాహన కల్పించారు. పిల్లలు, గర్భిణుల ఆరోగ్యంపై అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు అధికారి కనకరాజు, ఆర్పీలు గోలి సుచిత్ర, నక్క సంధ్య, అంగన్వాడీ ఉపాధ్యాయులు అంజలి, విజయ, విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కమిటీ సభ్యులు, పిల్లల తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# మురికినీటి కాలువ, కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ

▸▸ రూ.5 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



**సిరిసిల్ల, నేటిధాత్రి:** రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలోని మూడో వార్డులో అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. విద్యానగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా ప్రధాన మురికినీటి కాలువ, కల్వర్టు నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.5 లక్షలు కేటాయించినట్లు ఆమె తెలిపారు. ప్రజల నిత్య అవసరాలు, ఇతర కారణాల వల్ల వెలువడే మురికినీటికి సరైన పారుదల వ్యవస్థ లేకపోవడంతో నీరు నిలిచిపోతుందని, దీంతో దోమలు, ఇతర కీటకాలు వృద్ధి చెంది ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. సమస్యను గుర్తించి శాశ్వత పరిష్కారం కోసం కాలువ, కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సిరిసిల్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులు చేపడుతూ పట్టణ సమగ్ర అభివృద్ధికి పాలకవర్గం కృషి చేస్తుందని అన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాషా, వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్ దార్నం అరుణ లక్ష్మీనారాయణ, మాజీ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు మ్యాన రవి, గెంట్యాల శ్రీనివాస్, మాజీ శివ సాయిబాబా దేవాలయం అధ్యక్షుడు మామిడాల కృష్ణ, మాజీ ఎఫ్ఏసీఎస్ డైరెక్టర్ గడీల సురేష్, పద్మశాలి సంఘం సిరిసిల్ల ఉపాధ్యక్షుడు గాజుల బాలయ్య, బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల అధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు దూస రాజేశం, బండారి శివ, వేముల హరికృష్ణ, సబ్బని నరేందర్, జిందం దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

# కొండ లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

▸▸ ప్రత్యేక తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన తొలి మంత్రి...

▸▸ మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి..



**సిరిసిల్ల, నేటిధాత్రి:** రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలోని ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ చౌరస్తాలో కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండ లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ పాలకులకు, తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా సేవలందించిన సమయంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన తొలి మంత్రి కొండ లక్ష్మణ్ బాపూజీ అని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు విలువైన సూచనలు, సలహాలు అందించి మార్గదర్శిగా నిలిచారని తెలిపారు. అఖిల భారత పద్మశాలి సంఘం ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన కొండ లక్ష్మణ్ బాపూజీ, పద్మశాలీల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ కులబాంధవుల ఐక్యతకు విశేష కృషి చేశారని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ నెల 27న నిర్వహించనున్న కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో ప్రజలు, ముఖ్యంగా పద్మశాలి కులబాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు దూడం శంకర్, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు సబ్బని హరీష్, పద్మశాలి సంఘం కార్యవర్గ సభ్యులు, యువజన విభాగం సభ్యులు, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, పద్మశాలి కులబాంధవులు, పుర ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

# తీగల్పహాడ్‌లో ఘనంగా అన్నదాన, భజన కార్యక్రమాలు



**శ్రీరాంపూర్, నేటిధాత్రి:** మంచిర్యాల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్ తీగల్పహాడలో శ్రీ మల్లికార్జున నగర్ గణేష్ మండలి ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గణనాథుడి దర్శనానికి వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం వినాయక మండపం వద్ద ప్రత్యేకంగా భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. భజన కళాకారులు భక్తి గీతాలను ఆలపించడంతో మండప పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. భక్తులు భజన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని స్వామివారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమాన్ని నిర్వహించిన కళాకారులను శ్రీ మల్లికార్జున నగర్ గణేష్ మండలి కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కళాకారుల సేవలను అభినందిస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. గణేష్ మండలి సభ్యులు, భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సత్తా చాటిన షాలిన్ డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు



**భూపాలపల్లి, నేటిధాత్రి:** ఈనెల 20వ తేదీ ఆదివారం మంచిర్యాల జిల్లా సోమగూడెం త్రినేత్ర గార్డెన్ హాలులో కేఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన షాలిన్ డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించినట్లు అకాడమీ ఫౌండర్, డైరెక్టర్, సీనియర్ మాస్టర్ కరాటే శ్రీనివాస్ ( మాదాసి ) తెలిపారు. ఈ సందర్భంగా మాస్టర్ శ్రీనివాస్ కటాస్ విభాగంలో విధిష దేవి, ఆరాధ్య, నివేదన గోల్డ్ మెడల్స్, జాహ్నవి, తనూశ్రీ, అనుభవ్ సిల్వర్ మెడల్స్, స్నేహజ, హిమన్ష్, శ్రేయన్స్ బ్రాంజ్ మెడల్ సుషాన్, స్నేహజ, కౌశిక్ బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా స్పారింగ్ విభాగంలో విధిష దేవి, కౌశిక్, తనూశ్రీ గోల్డ్ మెడల్స్, శ్రేయన్స్, అనుభవ్, ఆరాధ్య సిల్వర్ మెడల్స్, సుషాన్, స్నేహజ, జాహ్నవి, నివేదన, హిమాన్ష్ బ్రాంజ్ మెడల్స్, వెపన్ కటాస్ విభాగంలో తనూశ్రీ గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను మాస్టర్లు శ్రీనివాస్, అశోక్ లను పోటీల నిర్వాహకులు కుందేల రవి, ప్రసాద్, సీనియర్ మాస్టర్లు నారాయణ, మహేష్, శివ మహేష్, అన్వర్ ప్రత్యేకంగా అభిందించినట్లు ఈ సందర్భంగా మాస్టర్ శ్రీనివాస్ తెలిపారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటం స్ఫూర్తిదాయకం

▶▶ కాంగ్రెస్ మండల పార్టీ అధ్య క్షుడు దూదిపాల బుచ్చి రెడ్డి...



**శాయంపేట, నేటిధాత్రి:** తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమ ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. మం డల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి, నివాళు లర్పించారు. మాట్లాడుతూ తెలంగాణ కోసం జీవితాం తం పోరాడిన ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమర యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని పేర్కొన్నారు బాపూజీ సేవలు, త్యాగాలు తెలం గాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతా యి ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దుబా సి కృష్ణమూర్తి, బాసాని రవి, కొత్తపెల్లిరవీందర్, మాదిరెడ్డి ప్రపంచరెడ్డి, రఫీ, మారపెల్లి రాజేందర్, వరద రాజు, వడ్డే పల్లి శ్రీనివాస్, వినుకొండ శంకరాచారి, అంకేశ్వరపు కుమారస్వామి పాల్గొన్నా రు.

# గని కార్మికుల సమ స్యలను వెంటనే పరిష్కరించాలి

▶▶ కార్మికులకు రక్షణ పరికరాలు అందజేయాలి...

▶▶ ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ మోటపలుకుల రమేష్...



**భూపాలపల్లి, నేటిధాత్రి:** స్థానిక గనుల, గని కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బ్రాంచ్ సెక్రటరీ మోట పలుకుల రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 8వ గని లో బ్రాంచ్ సెక్రటరీ తో పాటు అన్ని గనులపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గని మేనేజర్లకు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ..గత కొన్ని నెలలుగా గనుల్లో పనిచేస్తున్న కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు, పనిముట్లు, ఇతర సౌకర్యాలు సక్రమంగా అందకపోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మికుల భద్రత విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానంగా స్థానికంగా సమస్యలైన రక్షణ పరికరాలు అందజేయాలని, గనుల్లో పనిచేసే కార్మికు లకు నాణ్యమైన మైన్ షూస్, హెల్మెట్లు ఇతర అవసరమైన రక్షణ పరికరాలను వెంటనే అందజేయాలని ఆయన కోరారు. అవసరమైన గని సామగ్రిని అన్ని గనులకు సరిపడా డ్రిల్ బిట్స్, బోల్డర్ బిట్స్, డ్రిల్ రాడ్స్, రెసిన్ క్యాప్సూల్స్, డాగ్ నెయిల్స్ తదితర అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మ్యాన్ రైడింగ్ ఎక్స్టెన్షన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, కేటీకే వన్, కేటీకే 5, కేటీకే 8 గనుల్లో మ్యాన్ రైడింగ్ సౌకర్యాన్ని కార్మికులకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. అన్ని గనుల్లో కార్మికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని క్వార్టర్ అలాట్మెంట్ పారదర్శకంగా నిర్వహించాలని , సీఎం పి ఎఫ్ చిట్టీలు కార్మికులందరికీ యాజమాన్యం అందించాలని కోరారు.గని కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సీఎం పి ఎఫ్ సమ స్యలను వెంటనే పరిష్కరించి,అన్ని గనుల్లో పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను పరిశీలించి అర్హత కలిగిన కార్మికులకు తక్షణమే ప్రమోషన్లు మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో కూడా పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేటీకే వన్ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు గురిజేపల్లి సుధాకర్ రెడ్డి, గంగసారం శ్రీనివాస్,నూకల చంద్రమౌళి, సదానందం, కేటీకే 5 గనిలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ఎండి ఆసిఫ్ పాషా, జి తిరుపతి, వి రాజేందర్, కేటీకే 6 గనిలో పి. శ్రీనివాస్, కేటీకే 8 సుధాకర్ రెడ్డి, ఎల్ శంకర్, కృష్ణ, పిట్ కమిటీ సభ్యులు కార్యకర్తలు, కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బహిరంగ పంచాయతీ సభను విజయవంతం చేయాలి

▶▶ ఎవరి కులం ఎంతో వారికంత వాటా కోసం పోరాటం...

▶▶ బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ మండల ఇంచార్జ్ బొచ్చు నాగరాజు....



**పరకాల, నేటిధాత్రి:** ఎవరి కులం ఎంతో వారికంత వాటా నినాదంతో ఈ నెల 27న హనుమకొండ హంటర్ రోడ్‌లోని డి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న బహిరంగ పంచాయతీ సభను విజయవంతం చేయాలని బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ పరకాల మండల ఇంచార్జ్ బొచ్చు నాగరాజు పిలుపునిచ్చారు.రాష్ట్ర బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ ఆదేశాల మేరకు ధర్మ సమాజ్ పార్టీ మద్దతుతో నిర్వహించనున్న ఈ సభకు సంబంధించిన కరపత్రాలను సోమవారం పరకాల మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొచ్చు నాగరాజు మాట్లాడుతూ కులాల జనాభా ప్రాతిపదికన ఆయా వర్గాలకు తగిన వాటా దక్కేలా సామాజిక,రాజకీయ హక్కుల కోసం అన్ని కులాల ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని కోరారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అన్ని కులాలు భాగస్వామ్యులైనట్లుగానే,సామాజిక న్యాయం కోసం జరిగే ఉద్యమంలోనూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.పరకాల మండలంలోని అన్ని కులాల ప్రతినిధులు,నాయకులు స్వచ్ఛందంగా తరలివచ్చి బహిరంగ పంచాయతీ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మామునూరు ప్రశాంత్,ధర్మ సమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొట్టే ఏసోబు,మండల శ్రీకాంత్,సురేష్,శ్రీకాంత్,నాగేంద్ర,బాలు,రాజు తదితరులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కాపాడాలి



**భూపాలపల్లి, నేటిధాత్రి:** తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బాపూజీ విగ్రహానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పద్మశాలి సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి, త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బాపూజీ సేవలను ఎల్లవేళలా స్మరించుకోవాలని పేర్కొన్నారు.జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. ప్రజల కోసం నిరంతరం పోరాడిన ఉద్యమకారుడిగా, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా, పద్మశాలి సమాజానికి పేరు తీసుకొచ్చిన మహానాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి టౌన్ అధ్యక్షులు, చిట్యాల మండల అధ్యక్షులు, పద్మశాలి సంఘం నాయకులు భగవాన్ విక్రమ్, సేరు కుమారస్వామి, దాసరి సుదర్శన్, కుసుమ కృష్ణమోహన్, పాకకంటి శ్రీనివాస్, గుండా వీరస్వామి, పుల్లె రాజేశం, ఎల్ల శంకర్, పేరాల వెంకటేశం, బొద్దుల శంకర్, మాచిదా రవీందర్, దుంప నర్సయ్య, బూర ప్రవీణ్, కొలిపాక శ్రీనివాస్, వంగ కుమారస్వామి, కొలిపాక ప్రసాద్, కుసుమ చంద్రశేఖర్, మామిడి శ్రీకాంత్, కొండి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక కౌన్సిలర్లు హాజరయ్యారు.

# ప్రజావాణికి ఏడు అర్జీలు

నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు...



**పరకాల, నేటిధాత్రి:** పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన సోమవారం పరకాలలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరకాల డివిజన్,మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.ప్రజల నుంచి మొత్తం ఏడు అర్జీలను స్వీకరించారు.ఆయా అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, నిర్ణీత గడువులోగా పరిశీలించి పరిష్కరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

# 26వ వార్డులో వినాయక అన్నప్రసాద వితరణ




**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట పట్టణంలోని 26వ వార్డుతో పాటు వివిధ ప్రాంతాల పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు కన్నులపండువగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో గణపతి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని జీఆర్ గార్డెన్ సమీపంతో పాటు వాసవి కళ్యాణమండపం రోడ్డులోని రైతు బజార్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ అన్నదాన మహోత్సవంలో స్థానిక కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని, భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గణేశ్ ఉత్సవాలు ప్రజలందరిలో ఆధ్యాత్మిక చింతనతో పాటు సోదరభావాన్ని, సమైక్యతను నింపుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ వార్డు అధ్యక్షుడు గుండెబోయిన శివకోటి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు వేల్పుల శ్రీను, వేల్పుల కన్నయ్య, వేల్పుల సాంబయ్య, బండి వేణు, దోనాల రవి, దోర్నాల శ్రీధర్, సంఘ రమేష్, అడుప రాంబాబు, వేల్పుల సాయి తేజ, కొమ్మ శ్రీధర్, నీరటి రంజిత్, చల్ల కర్ణాకర్, బండి సన్నీ, కొమ్మ స్వరూప, నాడెం ఇంద్ర, కళ్ళెపు నీరాజ, కాగితపు విష్ణు, చెల్పూరు శ్రీను, పుట్టపాక సాయిలు, బ్రాహ్మణపెల్లి సుమన్, వేణు, మండల సంతోష్, దండు ఐలయ్య, లింగమూర్తి, అందే నాగరాజు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# బాలాజీ విద్యాసంస్థల్లో ఇంటర్నేషనల్ పీస్ డే




**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్లో అంతర్జాతీయ శాంతి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ రెడ్డి,ట్రెజరర్ డాక్టర్ ఏ.వనజా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోని ప్రజలంతా శాంతియుతను కోరుతూ ఐక్యంగా ఉండాలని పాఠశాల విద్యార్థులతో మెడిటేషన్ చేయించానన్నారు.ప్రపంచ దేశాల్లోని ప్రజలంతా శాంతియుత జీవనం గడపాలనే ఉద్దేశంతో ఘర్షణలకు ముగింపు పలకడానికి శాంతియుత సమాజం ఏర్పాటు దిశగా ముందడుగు వేయడానికి శాంతి దినోత్సవాన్ని ఏర్పాటు చేశారని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి గౌడ్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# కరెన్సీ నోట్లతో గణపేశ్వరుడి అలంకరణ



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండల కేంద్రంలోని చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయంలో వినాయక నవరాత్రుల సందర్భంగా స్వామివారిని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతి సంవత్సరం నవరాత్రుల్లో కరెన్సీ నోట్లతో గణపేశ్వరుడిని అలంకరించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా సోమవారం కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు భక్తులకు ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా గణపతి ఉత్సవాలు



▶▶ ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాణా ప్రతాప్ రెడ్డి...

▶▶ అన్నప్రసాద దాతలుగా జూలూరి మనీష్ గౌడ్ - శైవాలిని....

**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట పట్టణంలోని శివాజీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.లంబోదరుని దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.అనంతరం అన్నప్రసాద దాతలు జూలూరి మనీష్ గౌడ్ - శైవాలిని దంపతుల సహకారంతో ఏర్పాటు చేసిన మహా అన్నప్రసాద వితరణలో రాణా ప్రతాప్ రెడ్డి పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులకు సేవ చేయడం ఎంతో సంతృప్తిని ఇస్తుందని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్న శివాజీ యూత్ క్లబ్ సభ్యులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో 28వ వార్డు కౌన్సిలర్, బీజేపీ ఫ్లోర్ లీడర్ జూలూరు రోజా రాణి, నాయకులు తాబేటి క్రాంతి, మనీష్ గౌడ్, మధు, అన్వేష్, బబ్బులు, రాంకీ, నర్సంపేట పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కొంకిసా విగ్నేష్ గౌడ్, ఎర్ర రాజ, బీజేపీ పట్టణ నాయకులు నూనె రంజిత్, ఠాకూర్ విజయ్ సింగ్, కాసుల నాగేంద్రబాబు, ఘౌటం నిశాంత్, కుసుమ భవాని శంకర్, గోస్కుల సందీప్ తదితరులతో పాటు శివాజీ యూత్ క్లబ్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యారంగంలో విశిష్ట సేవలకు మేడికాల అంజయ్యకు అరుదైన గుర్తింపు

▶▶ ప్రపంచ విద్యా సదస్సులో పాల్గొని ధ్రువపత్రం అందుకున్న తెలుగు ఉపాధ్యాయుడు.






**చందుర్తి, నేటిధాత్రి:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం జోగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న మేడికాల అంజయ్య విద్యారంగంలో తన విశిష్ట సేవలు, సృజనాత్మక బోధనా విధానాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగంతో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. 2026 సెప్టెంబర్ 12న నిర్వహించిన స్టార్ ఉత్తమ ప్రతిభా పురస్కారాలు--2026 కార్యక్రమంలో భాగంగా జరిగిన నాలుగో ప్రపంచ విద్యా సదస్సులో మేడికాల అంజయ్య పాల్గొన్నారు.

"కృత్రిమ మేధస్సు యుగంలో మానవ మేధస్సును సద్వినియోగం చేసుకోవడం" అనే ప్రధాన అంశంతో ఈ సదస్సు నిర్వహించారు. విద్యారంగంలో నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, మానవ మేధస్సు ప్రాధాన్యత, విద్యలో అర్థవంతమైన మార్పులు తదితర అంశాలపై సదస్సులో చర్చలు జరిగాయి. ఈ సదస్సులో పాల్గొన్నందుకు గుర్తింపుగా మేడికాల అంజయ్యకు ఆదివారం ఆన్‌లైన్ ద్వారా ధ్రువపత్రం అందించారు. వినూత్న బోధనా పద్ధతులతో ప్రత్యేక గుర్తింపు మేడికాల అంజయ్య తెలుగు బోధనలో విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సృజనాత్మకత, అభ్యసన ఆసక్తిని పెంపొందించేందుకు వినూత్న పద్ధతులను అనుసరిస్తున్నారు. పాఠ్యాంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా చేసేందుకు దృశ్య, శ్రవణ, సాంకేతిక ఆధారిత బోధనా విధానాలను వినియోగిస్తున్నారు. తెలుగు పాఠ్యాంశాలకు సంబంధించిన బోధనా సామగ్రి, దృశ్య రూపకల్పనలు, ప్రజెంటేషన్లు, విద్యా విషయక డిజిటల్ వనరుల రూపకల్పనలోనూ ఆయన ఆసక్తి కనబరుస్తున్నారు. ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి, శిక్షణా కార్యక్రమాలు, విద్యా నాణ్యత పెంపుదలకు సంబంధించిన కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారు. ప్రస్తుతం పాఠశాలల విద్యా పరిశీలన బృందంలో సభ్యుడిగా కొనసాగుతూ, విద్యా సంస్థల్లో విద్యా ప్రమాణాలు, బోధనా విధానాలు, అకడమిక్ అంశాల పరిశీలనలో భాగస్వామ్యం అవుతున్నారు. ప్రపంచ విద్యా సదస్సులో పాల్గొనడం మరో మైలురాయి ఉపాధ్యాయుల వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంపొందించడం, విద్యలో నూతన ఆలోచనలను ప్రోత్సహించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చిన ప్రపంచ విద్యా సదస్సులో మేడికాల అంజయ్య పాల్గొనడం ఆయన విద్యా ప్రస్థానంలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా ఆధునిక బోధనా పద్ధతులను అవలంబిస్తూ ముందుకు సాగుతున్న మేడికాల అంజయ్య సేవలను పలువురు విద్యావేత్తలు, ఉపాధ్యాయులు అభినందిస్తున్నారు. విద్యార్థి కేంద్రిత బోధన, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి, విద్యా నాణ్యత పెంపుదల దిశగా ఆయన చేస్తున్న కృషికి ప్రపంచ విద్యా సదస్సులో పాల్గొనడం మరో మంచి గుర్తింపుగా నిలిచింది.

# రామకృష్ణాపూర్ లో గణపతి మండలిల వద్ద మహా అన్నప్రసాద వితరణలు.



**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణంలో గల వర్తక వ్యాపార సంఘం ఆధ్వర్యంలో గణేష్ మండలి వద్ద , గంగా కాలనీ వద్ద, భగత్ సింగ్ నగర్ హాట్స్ ఏరియాలో, ఏ జోన్ ఏరియాలో, ఆర్కే వన్ మార్కెట్ ఏరియాలలో మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా పట్టణ ఎస్సై జాడి శ్రీధర్,మున్సిపల్ చైర్ పర్సన్ గొడిసెల సంధ్యారాణి, డాక్టర్ రాజా రమేష్, వైస్ చైర్ పర్సన్ మిట్టపల్లి సరిత, సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వోడ్నాల శ్రీనివాస్, కౌన్సిలర్లు కూతురు ప్రభాకర్, బొమ్మ భూమయ్య గౌడ్ లు హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులు స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ గణపతి మండలి ల నిర్వాహకులు మాట్లాడుతూ.. వినాయక స్వామివారి కృపతో ప్రతి సంవత్సరం వినాయక మండలి ల ఆధ్వర్యంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తుల సహకారం, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో గణపతి మండలి ల నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఉత్తమ అవార్డు గ్రహీతల టీచర్స్‌ను సన్మానించిన అంబేద్కర్ సంఘం నాయకులు



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు శనిగరపు రాజేందర్ ఆధ్వర్యంలోగణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ దేశు సతీష్ కి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు ఫిజికల్ డైరెక్టర్ సరిత మేడం కి ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ ఉత్తమ అవార్డు రాగ వారిని ఘనంగా పూలదండ శాలువాతో సన్మానించడం జరిగింది ఆదర్శ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ తిరుపతి కి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు రాగా వారిని పూలదండ శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది కేజీబీవీ పాఠశాల సోషల్ టీచర్ డి విజయలక్ష్మి కి ఉత్తమ అవార్డు రాగా వారిని పూలదండతో ఘనంగా సన్మానించడం జరిగింది ఉత్తమ ఉపాధ్యాయుల ఎన్నికైన ఉపాధ్యాయులను వారి పాఠశాలలో వేరువేరుగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు తిక్క సంపత్ అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు కట్ల శంకరయ్య ఉపాధ్యాయ సంఘాలడీటీఫ్ మండల అధ్యక్షులు సిహెచ్ రాంబాబు యు టి ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పరికి రమేష్ చిలువేరు ఉదయాకర్ మైనార్టీ మండల నాయకులు ఎండి సైదులు పాషా రజక సంఘం జిల్లా యూత్ అధ్యక్షులు పసునూటి శంకర్ వారి పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది

# జిల్లా స్థాయికి శ్రీ వివేకవర్ధిని విద్యార్థుల ఎంపిక

▶▶ విద్యతో పాటు క్రీడల్లో రాణించడం మా పాఠశాలకు గర్వకారణం....

▶▶ కరస్పాండెంట్ చిర్రాయకాంతం గౌడ్...



**కేసముద్రం, నేటిదాత్రి:** కేసముద్రం మండలంలోని పెనుగొండ గ్రామంలో ఈ నెల 18, 19 తేదీలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ జోనల్ స్థాయి క్రీడా పోటీలలో మహమూదుపట్నం శివారులోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ అండర్-17 విభాగంలో భూక్య విజయ్, అండర్-14 విభాగంలో భూక్య మోహన్, అజ్మీరా జ్ఞానేశ్వర్, కోకో అండర్-17 విభాగంలో వాంకుడోత్ భరత్, కుండే ప్రణయ్, వాంకుడోత్ నగేశ్, కోకో అండర్-14 విభాగంలో బానోత్ అనిరుద్, గుగులోతు నవదీప్, వాలీబాల్ అండర్-14 విభాగంలో చిలుకూరి శ్రీచందు, సపావట్ మోహన్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్, ప్రిన్సిపల్ చిర్ర నరేశ్ విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని, జిల్లా స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబర్చి పాఠశాలకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకుల కృషి ఎంతో ఉందని కొనియాడారు.

## తమ్ముడిని దారుణంగా పొడిచి చంపిన అన్న అరెస్టు

**కేసు ఛేదించిన పోలీసులు.. కత్తి, రక్తపు మరకల దుస్తులు స్వాధీనం...**

**గీసుగొండ పరిధిలోని గరీబ్‌నగర్‌లో ఘటన...**




**గీసుగొండ, నేటిధాత్రి:** కన్నతల్లి సంపాదించే డబ్బు తనకే దక్కాలనే దురాశ, తమ్ముడిపై పెంచుకున్న కక్ష ఓ అన్నను హంతకుడిగా మార్చాయి. కత్తితో దారుణంగా పొడిచి తమ్ముడిని హత్య చేసిన సంఘటన గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గరీబ్‌నగర్‌లో చోటుచేసుకుంది.
ఈ కేసును 24 గంటల్లో ఛేదించిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మామునూరు ఏసీపీ ఎన్.వెంకటేశ్ సోమవారం వెల్లడించారు.

**డబ్బుల గొడవే హత్యకు దారితీసింది..** పోలీసుల వివరాల ప్రకారం.. కీర్తినగర్‌కు చెందిన ఎలుబాక ప్రవీణ్ వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. అతను తన తల్లి సుజాత వద్ద తరచూ డబ్బుల కోసం గొడవపడేవాడు. ఈ విషయమై గరీబ్‌నగర్‌లో అద్దెకు ఉంటున్న తమ్ముడు ఎలుబాక ప్రసాద్ (31) పలుమార్లు అన్నను నిలదీసి దూషించాడు. దీంతో ప్రసాద్‌పై కక్ష పెంచుకున్న ప్రవీణ్, తల్లి సంపాదనంతా తనకే దక్కాలనే దురుద్దేశంతో తమ్ముడిని అంతమొందించాలని పథకం పన్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 19న రాత్రి 9:30 గంటల సమయంలో తల్లి ఆసుపత్రిలో నైట్ డ్యూటీకి వెళ్లగా, ప్రసాద్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. ఇదే అదునుగా భావించిన ప్రవీణ్, తాను సొంతంగా తయారు చేసుకున్న కత్తితో అక్కడకు వెళ్లాడు. తమ్ముడితో ఉద్దేశపూర్వకంగా గొడవపడి, కత్తితో ఛాతి, వీపు, భుజం భాగాల్లో విచక్షణారహితంగా పొడిచాడు. తీవ్ర రక్తస్రావమై ప్రసాద్ అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు. దాడి సమయంలో జరిగిన పెనుగులాటలో నిందితుడి ఎడమ బొటనవేలికి కూడా గాయమైంది. తల్లిని బెదిరించి.. ఆర్‌ఎంపీ వద్ద చికిత్స దాడి అనంతరం ప్రవీణ్ కీర్తినగర్‌లోని తన ఇంటికి వెళ్లి భార్యకు విషయం చెప్పాడు. తిరిగి ఘటనా స్థలానికి రాగా, మృతదేహం వద్ద ఏడుస్తున్న తల్లిని చూసి.. "ఏడిస్తే నిన్ను కూడా చంపుతాను, తమ్ముడిని చంపింది నేనే" అని బెదిరించాడు. అనంతరం 20న తెల్లవారుజామున చికిత్స నిమిత్తం గీసుగొండలోని ఓ ఆర్‌ఎంపీ డాక్టర్ వద్దకు వెళ్లాడు. గాయం గురించి డాక్టర్ ప్రశ్నించగా.. తమ్ముడిని చంపే క్రమంలో గాయపడినట్లు నిజం ఒప్పుకున్నాడు. దీంతో ఆ ఆర్‌ఎంపీ అతడికి ప్రాథమిక చికిత్స చేసి పోలీసులకు లొంగిపోవాలని సూచించారు.

**హత్య జరిగిన 24 గంటల్లోనే అరెస్టు..** తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గీసుగొండ పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. సోమవారం నిందితుడు ఇంటివైపు వస్తున్నాడనే సమాచారంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు ఇంటి సమీపంలోని పొదల్లో దాచిన హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించగా, స్వాధీనం చేసుకున్న వస్తువులను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఏసీపీ తెలిపారు. ఈ కేసును వేగంగా ఛేదించిన గీసుగొండ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్, ఎస్‌ఐలు అనిల్‌కుమార్, కుమార్‌లతో పాటు సిబ్బంది అరవింద్, విజయ్, ప్రవీణ్, భాస్కర్, రజినీకుమార్‌లను ఏసీపీ అభినందించారు.

## భాదిత కుటుంబానికి కాంగ్రెస్ అధ్యక్షుడు చిలువేరు సమ్మిగౌడ్ చేయూత

**సారయ్య ముదిరాజ్ పిల్లల ఉన్నత చదువులకు భరోసా..**

**దశదిన కర్మకు 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకుల అందజేత....**






**కేసముద్రం, నేటిధాత్రి:** కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్ కుల సంఘం సభ్యుడు మొలకల సారయ్య ముదిరాజ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మిగౌడ్ పీసీసీ సభ్యులు దస్రునాయక్ తో కలిసి శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి, వారి దుఃఖంలో తానూ భాగస్వామినని తెలిపారు. కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సారయ్య పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారి ఉన్నత చదువులకు తన వంతు సహాయం అందిస్తానని చిలువేరు సమ్మిగౌడ్ హామీ ఇచ్చారు. దశదిన కర్మ కార్యక్రమాలకు తన వంతు సహాయంగా 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు గుగులోతు దసురు నాయక్ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు వాటిని అందించారు. ఆపదలో ఉన్న కుటుంబాన్ని పలకరించి, మాటలకే పరిమితం కాకుండా అవసరమైన సమయంలో చేయూత అందించిన చిలువేరు సమ్మిగౌడ్‌కు కాట్రపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబానికి అండగా నిలవడంతో పాటు పిల్లల చదువుకు సహాయం చేస్తానని హామీ ఇవ్వడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాట్రపల్లి గ్రామ ఉపసర్పంచ్ చాగంటి యాదగిరి, గ్రామ కమిటీ అధ్యక్షులు జల్లె యకాంబరం, ఉపాధ్యక్షులు పుట్ట ప్రభాకర్, మండల ఉపాధ్యక్షులు జాటోత్ లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వార్డు సభ్యులు కాలేపాక కలమ్మ, లక్ష్మయ్య, కర్నూరపు వెంకటేశ్వర్లు, సాంబారి వీరస్వామి, బోదాసు చంద్రయ్య, అడప రవీందర్, శీలం యాదగిరి, దెబ్బట సూరయ్య, కుంచం మునీందర్, కాలేపాక కృష్ణవేణి, వంశీ, ఏఐడీఎఫ్ నాయకులు గద్దం నాగార్జున, బాదావత్ నరేష్, ఆంగోతు శివ, జాటోత్ లాల్‌సింగ్, గూగులోత్ సురేష్, ఆంగోతు వీరు, పోలేపాక శ్రీనివాస్, గుండెపాక మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మారెడ్డిపల్లి లో ఘనంగా గణనాథుడి మహా అన్నదానం పాల్గొన్న సీఐ కరుణాకర్ రావు



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండలంలోని లక్ష్మారెడ్డి పల్లి గ్రామంలో శ్రీ రామలింగేశ్వర అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో వినాయక మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గత 6 సంవత్సరాలుగా లక్ష్మారెడ్డి పల్లిలో గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామన్నారు. వినాయక ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన అన్న ప్రసాద కార్యక్రమానికి గణపురం సిఐ కరుణాకర్ రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గణనాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వయంగా అన్న ప్రసాదాలను వడ్డించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీఐ కర్ణాకర్ రావుకి శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మహా అన్న ప్రసాద దాత మేడిపల్లి సంధ్యారాణి రాజు గౌడ్, గ్రామ సర్పంచ్ వీరమల్ల సంపత్ రెడ్డి, మాజీ సర్పంచ్, ఓద్దుల విజయ అశోక్ రెడ్డి, ఎడ్ల సంతోష్, మేడిపల్లి శ్రీనివాస్, మామిడాల శరత్ బాబు, చుక్క నరేష్, మామిడాల విజయ్ కుమార్, మాదారపు కృష్ణమూర్తి, వీరగోని నాగరాజు, వీరమల్ల వీరారెడ్డి, భోజ వాసుదేవ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, విధ్వత్ తదితరులు పాల్గొన్నారు

## వినాయక మండపాల వద్ద అన్నప్రసాద వితరణ ప్రారంభం



**యాదాద్రి భువనగిరి, నేటిధాత్రి:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భజరంగ్ యూత్, కిసాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం హనుమాన్ యూత్ సభ్యులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి గారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల నాయకులు, యూత్ సభ్యులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పత్తిపాకలో ఘనంగా మహా అన్నదానం





**శాయంపేట, నేటిధాత్రి:** శాయంపేట మండలం పత్తి పాక గ్రామంలోని ఐజెల్ వాటర్ ప్లాంట్ వద్ద రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి వేడుకల సందర్భంగా మహా అన్నదానం కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహిం చారు గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరిం చారు. రెడ్డి సంఘం ఆధ్వ ర్యంలో ప్రత్యేక పూజా కార్య క్రమాలు నిర్వహించారు. భక్తుల కోసం మహా అన్న దాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. గ్రామ ప్రజల సహకారంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు పలువురు భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరిం చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లా డుతూ ప్రతి సంవత్సరం వినాయక చవితి వేడుక లను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ, భక్తులకు అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమా నికి సహకరించిన గ్రామస్థు లకు, భక్తులకు రెడ్డి సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వినాయక స్వామి ఆశీస్సులతో పత్తిపాక గ్రామ ప్రజలందరూ సుఖసంతో షాలతో, ఆయురారోగ్యాల తో ఉండాలని ఆకాంక్షించారు.

## వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



**శాఖల సమన్వయంతో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు...**

**జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ...**

**జైపూర్, నేటిధాత్రి:** వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఏసీపీ వెంకటేశ్వర్ సూచించారు. సోమవారం సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో జైపూర్ మండలంలోని వివిధ శాఖల అధికారులతో వినాయక నిమజ్జన ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. నిమజ్జన కార్యక్రమంలో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రదేశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, ప్రజలు, భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన సమయంలో పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య, అగ్నిమాపక, అటవీ, మత్స్య తదితర శాఖలు సమన్వయంతో విధులు నిర్వహించాలని నిర్ణయించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా సంబంధిత శాఖలు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐ నవీన్ కుమార్, ఎంపీడీవో శ్రీపతి బాపురావు, తహసీల్దార్ వనజారెడ్డి, ఎస్ఐ భూమేష్, మత్స్యశాఖ పర్యవేక్షకుడు శ్రవణ్, వైద్యాధికారి శ్రావ్య, సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ అధికారులు, అగ్నిమాపక శాఖ, అటవీ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో దసరా సెలవుల ధమాకా!




**తెలంగాణలో 13 రోజులు.. ఏపీలో 10 రోజుల పాటు సెలవులు**

**యాదాద్రి, నేటిధాత్రి:** దసరా పండుగను పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులకు వరుస సెలవులు రానున్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో దసరా సెలవుల తేదీల్లో స్వల్ప వ్యత్యాసం ఉంది. తెలంగాణలో పాఠశాలలకు అక్టోబర్ 10 నుంచి 22 వరకు 13 రోజుల పాటు సెలవులు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ పాఠశాలలకు అక్టోబర్ 12 నుంచి 21 వరకు 10 రోజుల పాటు సెలవులు ఇవ్వనున్నారు.

**తెలంగాణలో 13 రోజుల సెలవులు....** తెలంగాణలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలకు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం అక్టోబర్ 10 నుంచి 22 వరకు దసరా సెలవులు కొనసాగనున్నాయి. అక్టోబర్ 9 చివరి పనిదినం కాగా, సెలవుల అనంతరం అక్టోబర్ 23న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దీంతో విద్యార్థులకు వరుసగా 13 రోజుల పాటు సెలవులు లభించనున్నాయి.

**ఏపీలో 10 రోజుల హాలిడేస్...** ఆంధ్రప్రదేశ్ 2026-27 విద్యా క్యాలెండర్ ప్రకారం సాధారణ పాఠశాలలకు అక్టోబర్ 12 నుంచి 21 వరకు దసరా సెలవులు ప్రకటించారు. దీంతో ఏపీ విద్యార్థులకు 10 రోజుల పాటు సెలవులు లభించనున్నాయి. క్రైస్తవ మైనారిటీ విద్యాసంస్థలకు మాత్రం సెలవుల షెడ్యూల్‌లో మార్పులు ఉండనున్నాయి.

**అక్టోబర్ 20న విజయదశమి....** ఈ ఏడాది విజయదశమి అక్టోబర్ 20న జరగనుంది. తెలంగాణ ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం అక్టోబర్ 18న సద్దుల బతుకమ్మ, అక్టోబర్ 19న మహర్నవమి, అక్టోబర్ 20న విజయదశమి, అక్టోబర్ 21న విజయదశమి మరుసటి రోజు సెలవులు ఉన్నాయి. తెలంగాణలో బతుకమ్మ వేడుకలు అక్టోబర్ 11 నుంచి ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగియనున్నాయి.

**దసరాకు ముందే SA-1 పరీక్షలు....** తెలంగాణ విద్యార్థులకు దసరా సెలవులకు ముందే సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 (SA-1) పరీక్షలు పూర్తికానున్నాయి. షెడ్యూల్ ప్రకారం 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అక్టోబర్ 1 నుంచి 9 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాథమిక తరగతులకు అక్టోబర్ 5 నుంచి 9 వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు పూర్తైన మరుసటి రోజు నుంచే దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి.

**స్వగ్రామాలకు వెళ్లేందుకు అవకాశం....** వరుసగా సెలవులు రావడంతో పట్టణాలు, నగరాల్లో చదువుకుంటున్న విద్యార్థులు, ఉద్యోగులు దసరా పండుగకు స్వగ్రామాలకు వెళ్లేందుకు అవకాశం లభించనుంది. ముఖ్యంగా తెలంగాణలో 13 రోజుల విరామం ఉండటంతో ముందుగానే ప్రయాణ ప్రణాళికలు, రిజర్వేషన్లు చేసుకుంటే సౌకర్యంగా స్వగ్రామాలకు వెళ్లొచ్చు.


## దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలి: గొంగిడి సునిత మహేందర్ రెడ్డి....**



**యాదాద్రి కలెక్టరేట్టు, నేటిధాత్రి:** దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి గొంగిడి సునిత మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన మహాధర్నా కార్యక్రమంలో ఆమె పాల్గొని దివ్యాంగులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దివ్యాంగులతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్లు శ్రీ భాస్కర్ రావు, శ్రీ వెంక రెడ్డిలను కలిసి వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. దివ్యాంగుల సమస్యలపై ప్రభుత్వం ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటని ఆమె ప్రశ్నించారు. దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించిన హామీలను వెంటనే అమలు చేసి, పెన్షన్లు, ఉపాధి, సంక్షేమ పథకాలు, ఇతర సమస్యలపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యలను కేవలం హామీలకే పరిమితం చేయకుండా, వాటి పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని గొంగిడి సునిత మహేందర్ రెడ్డి కోరారు.

## మాచిలేశ్వర్ శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో బీర్ల అయిలయ్య దంపతుల ప్రత్యేక పూజలు



**యాదాద్రి /హైదరాబాద్, నేటిధాత్రి:** నార్సింగి పరిధిలోని మంచిరేవుల మాచిలేశ్వర్ శ్రీ వీరభద్రస్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య తన సతీమణి శ్రీమతి బీర్ల అనితతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీ వీరభద్రస్వామివారికి బీర్ల అయిలయ్య దంపతులు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య దంపతులు మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని శ్రీ వీరభద్రస్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

## కోదాడ పెద్ద చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



**కోదాడ, నేటిధాత్రి:** గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు పురస్కరించుకొని కోదాడ పట్టణంలోని పెద్ద చెరువు వద్ద జరుగుతున్న నిమజ్జన ముందస్తు ఏర్పాట్లను స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా పరిశీలించారు. నిమజ్జనం రోజున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలపై సమీక్షించారు. భారీ ఏర్పాట్లు-భద్రతా చర్యలు: క్రేన్ల ఏర్పాటు: పెద్ద విగ్రహాల నిమజ్జనం కోసం చెరువుగట్టు వద్ద భారీ క్రేన్లను సిద్ధం చేస్తున్నారు. లైటింగ్ మరియు గజ ఈతగాళ్లు: రాత్రి సమయంలో నిమజ్జనానికి ఇబ్బంది లేకుండా విద్యుత్ దీపాలు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. రహదారుల మరమ్మతులు: విగ్రహాల ఊరేగింపు సాఫీగా సాగేందుకు చెరువుకు వచ్చేదారులను సిద్ధం చేస్తున్నారు. పోలీస్ బందోబస్తు: ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, శాంతిభద్రతల పరిరక్షణకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. నిమజ్జనోత్సవాన్ని భక్తులంతా ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.

## సూపర్ స్పెషాలిటీ పనులు వేగంగా పూర్తి చేయాలి

**నాణ్యత ప్రమాణాలు పాటించాలి.. ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా ఆదేశం...**





**వరంగల్, నేటిధాత్రి:** వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న నూతన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జె. చోంగ్తూ, ఐఏఎస్ ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ వాణితో కలిసి సోమవారం ఆమె సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య కార్యదర్శిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించిన పలు అంశాలపై అధికారులతో చర్చించారు. తదుపరి నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు. ఆసుపత్రిలో అందుబాటులోకి రానున్న వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ టి. వెంకన్న, వరంగల్ ఆర్డీవో సుమ, ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుల ఆరోగ్యానికి ఆయుర్వేద అండ

**జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం...**




**వరంగల్, నేటిధాత్రి:** 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వరంగల్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం శంభునిపేటలోని పోతన గ్రంథాలయంలో జెరియాట్రిక్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.
ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూయ, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి.ఎస్.కె. ధర్మరాజు శిబిరాన్ని ప్రారంభించారు. వృద్ధుల ఆరోగ్య సంరక్షణ, వ్యాధుల నివారణ, ఆయుర్వేద వైద్య విధానాలపై అవగాహన కల్పించడం శిబిరం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. మొత్తం 180 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు, చికిత్సా సేవలు అందించారు. కార్యక్రమంలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ సాంబమూర్తి, డాక్టర్ స్వరూప, మెడికల్ క్యాంప్ ఇన్‌చార్జి డాక్టర్ ప్రశాంత్ కుమార్, డాక్టర్ మహేశ్, హౌస్ సర్జన్ డాక్టర్ రోహిత్, డాక్టర్ వైభవ్, డాక్టర్ అంకిత, డాక్టర్ గాయత్రి, నర్సింగ్ ఆఫీసర్ కె. ఝాన్సీ, ఎం.ఎన్.ఓ. వీరన్న, దయాకర్, జెర్రా తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల నుంచి డాక్టర్ శ్రీధర్, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల నుంచి సీనియర్ వైద్యాధికారులు డాక్టర్ జగన్మోహన్ చారి, డాక్టర్ హరికిషన్, డాక్టర్ శ్రవణ్ తదితరులు వైద్య సేవలు అందించారు.

# ముగ్ధంపురం ఎస్బిఐ బ్యాంక్ మిత్రపై వస్తున్న ఆరోపణలపై అనుమానాలు?



**నిధుల దుర్వినియోగంతో నాకు ఏలాంటి సంబంధం లేదు: ఎస్బిఐ బ్యాంక్ మిత్ర కనకలక్ష్మి....**

**సంఘాల రికార్డుల నిర్వహణ, ఆడిటింగ్‌పై వెల్లువెత్తుతున్న అనుమానాలు....**

**రికార్డుల్లో కొట్టివేతలు, పేజీల చింపివేత వెనుక ఆంతర్యమేమిటి?**

**పాత లెక్కల కోసం కొత్త బుక్కుల మార్పిడిపై సర్వత్రా చర్చ...**

**నర్సంపేట, నేటిధాత్రి:** వరంగల్ జిల్లా నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు ముగ్ధంపురంలో స్వయం సహాయక సంఘాల నిధుల వ్యవహారం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. గ్రామంలోని బంజారా, రాజేశ్వరి, విఘ్నేశ్వర గ్రామ సమాఖ్యల పరిధిలో మొత్తం 70 మహిళా స్వయం సహాయక సంఘాలు కొనసాగుతున్నాయి. అయితే, గత కొంతకాలంగా వివిధ సంఘాల నిధుల దుర్వినియోగం జరుగుతోందని, అందుకు ఎస్బిఐ బ్యాంక్ మిత్రే కారణమంటూ వస్తున్న ఆరోపణలపై స్థానికంగా తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆరోపణల వెనుక అసలు సూత్రధారులు వేరే ఉన్నారా అనే కోణంలో కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఎప్పటికప్పుడుడు లెక్కలను రికారులల్లో రాయాల్సిన సిఏలు ఏండ్ల తరబడి రాయకపోవడంతో మరిన్ని అనుమానాలు రేకెత్తుతున్నాయి.

**రికార్డులలో కొట్టివేతలు.. పేజీల చింపివేత.....** గ్రామ సమాఖ్యల పరిధిలోని రికార్డుల నిర్వహణ అత్యంత అస్తవ్యస్తంగా ఉన్నట్లు తెలుస్తోంది. మహిళా సంఘాల సభ్యుల డిపాజిట్లు, రుణాల రికార్డు పుస్తకాల్లో విపరీతంగా కొట్టివేతలు ఉండడం, కొన్ని కీలకమైన బుక్కుల్లోని పేజీలను కావాలనే చించివేయడం స్థానికంగా పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా, నిబంధనలకు విరుద్ధంగా పాత లెక్కలను సరిచేసేందుకు కొత్త పుస్తకాల్లో రాతలు రాయడం వెనుక ఎవరి హస్తం ఉందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అసలు నిజాలను దాచిపెట్టేందుకే రికార్డులను తారుమారు చేశారనే అనుమానాలు బలపడుతున్నాయి.సంఘాల నిర్వహణ కోసం ప్రభుత్వ అధీనంలో కేటాయించిన సిఏలు వారి వారి విధుల పట్ల బాధ్యత వహించకపోవడంతో ప్రజల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.నిధుల దుర్వినియోగం పట్ల రికార్డు బుక్కుల్లో అడిట్ చేసే క్రమంలో గత 6 సంవత్సరాలుగా సిఏ లెక్కలు,సమాచారం రాయకపోవడం నిధుల సమాచారం లేకపోవడంతో అడిటర్లు నివ్వెరపోయినట్లు సమాచారం.ఐతే లెక్కలు తేల్చడం ఎలా అని తలలు దాడుకుంటున్నట్లు తెలుస్తోంది.దీంతో ఆయా వివోల పరిధిలో ఉన్న సంఘాల నిధుల దుర్వినియోగం సంఘాల సిఏ పనా లేక మరెవరైనా అని అనుమానాలు మరింత రేకెత్తుతున్నాయి.

**నాపై కావాలనే నిందలు వేస్తున్నారు:బ్యాంక్ మిత్ర గొడుగు కనకలక్ష్మి.....** ఈ వ్యవహారంపై ఎస్బిఐ బ్యాంక్ మిత్ర నిర్వాహకురాలు గొడుగు కనకలక్ష్మి తీవ్రంగా స్పందించారు. మహిళా సంఘాల నిధుల దుర్వినియోగంతో తనకు ఎలాంటి సంబంధమూ లేదని ఆమె స్పష్టం చేశారు. "గత కొన్ని సంవత్సరాలుగా నేను ఎంతో నిజాయితీగా, నిష్పాక్షికంగా నా విధులను నిర్వహిస్తున్నాను. కానీ, వివో కమ్యూనిటీ అసిస్టెంట్లు (సిఏలు), వివో నిర్వాహకులే నిధుల దుర్వినియోగం చేస్తూ, తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి నాపై నిందలు వేస్తున్నారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అసలు రికార్డులను ఆడిటింగ్ చేస్తే నిజానిజాలు బయటపడతాయని, కావాలని తన వ్యక్తిత్వాన్ని హననం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని పేర్కొన్నారు. నేను రసీదులు ఎప్పటికప్పుడు ఇచ్చాను. గత కొన్ని సంవత్సరాలుగా సిఏలు, సంఘాల బాధ్యులు సంబంధిత రికార్డులలో జమలు చెల్లింపులు ఎందుకు రాయలేదు అని ప్రశ్నించారు. కొన్ని బుక్కుల్లో పేజీలను చించిపేశారని అలాగే కొట్టివేతలు చేశారని,నాపై అవినీతి బురదజల్లాలని కొన్ని కొత్త బుక్కుల్లో లెక్కలు రాస్తున్నారని ఆరోపించారు.నేను కొన్ని సంవత్సరాలుగా ఎస్బిఐ బ్యాంక్ మిత్రగా సేవలు అందిస్తున్న.చెన్నారావుపేట,నర్సంపేట మండలాల నుండి ఖాతాదారులు వస్తుంటారు.రైతు బంధు,సేవింగ్ ఖాతాలు,ఇతర లావాదేవీలు జరుపుతాను.ఇప్పటి వరకు నాపై ఎలాంటి రిమార్క్ లేదు అని గొడుగు కనకలక్ష్మి తెలిపారు.నేను చేసిన సేవలకు ఎస్బిఐ బ్యాంక్ అధికారులు ఉత్తమ బ్యాంకు మిత్రగా అవార్డు ఇచ్చారని ఆమె పేర్కొన్నారు. నేను మహిళా సంఘాలను సంబంధించిన ఎలాంటి నిధుల దుర్వినియోగానికి పాల్పడలేదు అని కావాలనే నాపై అసత్యపు ప్రచారం చేస్తున్నారని బ్యాంకు మిత్ర గొడుగు కనకలక్ష్మి తెలిపారు.

# వాసం రమేష్ కుమార్తె శ్రీమంతం వేడుకల్లో గొంగిడి సునిత మహేందర్ రెడ్డి



**యాదగిరిగుట్ట, నేటిధాత్రి:** యాదగిరిగుట్ట పట్టణ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వాసం రమేష్ గారి కుమార్తె శ్రీమంతం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి గొంగిడి సునిత మహేందర్ రెడ్డి గారు హాజరై, కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా శ్రీమంతం వేడుకల్లో పాల్గొని, కాబోయే తల్లికి ఆశీస్సులు అందజేశారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ఆత్మీయంగా గడిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# సేవా దృక్పథానికి నిదర్శనం: గణేశుడి నవరాత్రి ఉత్సవాల్లో ఘనంగా మహా అన్నదానం




**కోదాడ, నేటిధాత్రి:** సమాజంలో అన్ని దానాల కంటే అన్నదానమని కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ బాబు అన్నారు. సోమవారం పట్టణంలోని పెరిక నగర్‌లో మైలారపు శెట్టి భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి అన్నదాన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం కంటే గొప్ప సేవ మరొకటి లేదన్నారు. సమాజంలో సేవాభావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన మైలారపు శెట్టి భాస్కర్‌రావును ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో కందిబండ ఎలమందరావు, చింతల శ్రీనివాసరావు, రమేష్, , విష్ణుమూర్తి, సైదులు, వెంకన్న, హేమంత్, శ్రీనివాస్ చారి, సైదారావు తదితరులు పాల్గొన్నారు

**శ్రీరంగాపురంలోనూ అన్నదానం....** కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగాపురం ఐదో వార్డులో ప్రజా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని అవార్డు కౌన్సిలర్ కందుల చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత సేవా కార్యక్రమాల్లో ముందుండటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజలకు ఆహారం అందించడం, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం వంటి కార్యక్రమాలు సమాజంలో సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్‌లోనూ కొనసాగించాలని ఆకాంక్షించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు కట్టే కోలా రమేష్ గౌడ్, చిత్తలూరి శ్రీను, పిల్లి వెంకీ, కే. సురేష్, కందుల రవితేజ, బెక్కం లింగయ్య, దొంగరి వెంకటేశ్వర్లు, ఓం శ్రీను తదితరులు పాల్గొన్నారు



# యుక్తితో, నేర్పుగా వ్యవహరించాలి

**ఆతిథ్య ఉపన్యాసంలో భారత-పశ్చిమ ఆసియావిధానంపై కల్నల్ రాజీవ్‌అగర్వాల్**



**పాటన్‌చేరు, నేటిధాత్రి:** పశ్చిమ ఆసియాతో భారతదేశానికి ఉన్న అనుబంధం ఈనాటిది కాదని, ఎన్నో అంశాలతో ముడిపడి ఉన్న ఈ బంధాన్ని యుక్తితో, నేర్పుగా వ్యవహరించాలని న్యూఢిల్లీకి చెందిన చింతన్ రీసెర్చ్ ఫౌండేషన్ సీనియర్ రీసెర్చ్ కన్సల్టెంట్, కల్నల్ రాజీవ్ అగర్వాల్ (రిటైర్డ్) అన్నారు. హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కే.ఎస్.పీ.పీ)లో 'ప్రాంతీయ సంఘర్షణ, విచ్ఛిన్నత నేపథ్యంలో భారత పశ్చిమ ఆసియా విధానాన్ని పున:సమీక్షించడం' అనే అంశంపై ఆతిథ్య ఉపన్యాసం చేశారు.పశ్చిమ ఆసియాతో భారతదేశం యొక్క అభివృద్ధి చెందుతున్న సంబంధాలను కల్నల్ అగర్వాల్ వివరించారు. సాంప్రదాయ సంబంధాల నుంచి ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడి, రక్షణ, అనుసంధానం, భద్రత, ప్రజల మధ్య సంబంధాలను కలిగి ఉన్న బహుముఖ వ్యూహాత్మక భాగస్వామ్యానికి జరిగిన మార్పును ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. భారతదేశం, కీలక పశ్చిమ ఆసియా దేశాల మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక ఏకీకరణను, అలాగే నిఘా సమాచార మార్పిడి, సైబర్ భద్రత, అంతరిక్షం, డ్రోన్లు, సముద్ర భద్రత వంటి రంగాలలో అభివృద్ధి చెందుతున్న సహకారాన్ని ఆయన పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధి యొక్క వ్యూహాత్మక ప్రాముఖ్యతను కల్నల్ అగర్వాల్ ప్రస్తావిస్తూ, ప్రపంచ ఇంధన సరఫరాలో దాని కీలక పాత్రను, అలాగే ముడి చమురు, ఎల్.ఎన్.జీ., ఎల్.పి.జీ. కోసం పశ్చిమ ఆసియాపై దేశం గణనీయంగా ఆధారపడి ఉన్నందున, భారతదేశానికి కూడా ఇది ఎంతో కీలకమన్నారు. ఇంధన స్థితిస్థాపకత, అనుసంధానాన్ని బలోపేతం చేస్తూనే, భారత ప్రవాసులు, నావికుల ప్రయోజనాలను పరిరక్షించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.ఈ ఉపన్యాస ముగింపులో, కల్నల్ అగర్వాల్ పశ్చిమ ఆసియాతో భారతదేశ సంబంధాల కోసం షీల్డ్ ("SHIELDμ') ఫ్రేమ్ వర్కును ప్రతిపాదించారు. అవి: భద్రత, మానవత్వమే ప్రథమం, మౌలిక సదుపాయాలు, అనుసంధానం, ఇంధన భద్రత, ఎదురు దెబ్బలను తట్టుకునే శక్తి, వాణిజ్యం, పెట్టుబడుల ద్వారా అనుసంధానాలు, దౌత్యం, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిగా ఆయన విశదీకరించారు. ఈ ఉపన్యాసానికి కె.ఎస్.పి.పి., గీతం విద్యార్థులతో పాటు కె.ఎస్.పి.పి. డీన్, మాజీ దౌత్యవేత్త సయ్యద్ అక్బరుద్దీన్ కూడా హాజరయ్యారు.



**గీతంలో జాతీయ పోషకాహార వారోత్సవాలు....** గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ (జీఎస్ఎస్) హైదరాబాదులోని లైఫ్ సైన్స్ విభాగం 'ఆహార శుద్ధి సాంకేతికతల ద్వారా పోషకాహార భవిష్యత్తును తీర్చిదిద్దడం' అనే ఇతివృత్తంతో 'ఫుడ్ టెక్నో ఫెస్ట్ 2026'తో జాతీయ పోషకాహార వారోత్సవాలను జరుపుకుంది. ఈ కార్యక్రమంలో, మైసూరులోని సీఎస్ఐఆర్-సీఎఫ్టీఆర్ఐ మాజీ డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి అన్నపూర్ణ సింగ్, 'ఆహార శుద్ధి ద్వారా ప్రపంచ పోషకాహార అవసరాలను తీర్చడం' అనే అంశంపై ప్రసంగించారు. సమతుల్య పోషకాహారం, బాధ్యతాయుతమైన ఫుడ్ ప్రాసెసింగ్, ఆహార నిల్వ, ప్రత్యామ్నాయ ప్రోటీన్లు, విలువ జోడింపు, జీర్ణ వ్యవస్థ పనితీరు (గట్ హెల్త్) ప్రాముఖ్యతలను ఆమె వివరించారు. ఆహార నష్టాన్ని తగ్గించడానికి, ప్రపంచ పోషకాహార సవాళ్లను పరిష్కరించడానికి వినూత్న ఆహార సాంకేతికతల సామర్థ్యాన్ని వివరించారు. హైదరాబాదులోని హీూచీజు టెక్నికల్ డైరెక్టర్ (పరిశోధన, అభివృద్ధి) దేబాశిష్ మొహంతి, 'వినియోగదారుల ఆధారిత ఉత్పత్తి వ్యూహాలు -- విభజన, ప్రాధాన్యత విశ్లేషణ' అనే అంశంపై ప్రసంగించారు. వినియోగదారుల అంతర్దృష్టులు, ప్రాధాన్యతల విశ్లేషణ, విభజన, ఉత్పత్తి ధ్రువీకరణ అనేవి సందర్భోచితమైన, సుస్థిరమైన, వాణిజ్యపరంగా విజయవంతమైన ఆహార ఉత్పత్తులను అభివృద్ధి చేయడానికి ఎలా సహాయపడతాయో విడమరచి చెప్పారు.తొలుత, గీతం విశిష్ట ఆచార్యుడు డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ స్వాగతోపన్యాసం చేసి, ఈ కార్యక్రమానికి నాంది పలికారు. జీఎస్ఎస్ విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్లు, నమూనాల తయారీ, వినూత్న ఆహార ఉత్పత్తి అభివృద్ధి పోటీల ద్వారా తమ సృజనాత్మకతను, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు. తద్వారా ఆహార శాస్త్రం, వ్యవస్థాపకతలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, అవకాశాలపై ఆచరణాత్మక అవగాహన పొందారు. ఈ కార్యక్రమాన్ని కన్వీనర్ డాక్టర్ జి. నిహారిక, కో-కన్వీనర్ డాక్టర్ ఎం. సురేంద్ర బాబు పర్యవేక్షణలో ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అధ్యాపకులు సమన్వయం చేశారు.



# మహిళా సంఘాలకు జలశ్రీ పనులు, పించన్లపై అవగాహన



**దుగ్గొండి, నేటిధాత్రి:** ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రశాంతి మండల సమాఖ్య మహాసభకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి డాక్టర్ లక్కల అరుంధతి హాజరయ్యారు. ఈ సందర్భంగా జలశ్రీ పనుల అమలు, ప్రాధాన్యతపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. అలాగే పించన్ల ధ్రువీకరణ ప్రక్రియపై వివరించారు. అర్హులైన లబ్ధిదారుల పించన్ల పరిశీలనను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. మండల సమాఖ్య ప్రతినిధులు, ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి వేడుకలు



**శాయంపేట, నేటిధాత్రి:** శాయంపేట మండల కేంద్రం లో తెలంగాణ ప్రాంత పద్మ శాలి సంఘం ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనం గా నివాళులర్పించారు మండల అధ్యక్షుడు వంగర సాంబయ్య మాట్లాడుతూ ఉద్యమ నేత స్వాతంత్ర సమరయోధుడు ఉద్య మాలే ఊపిరిగా పోరాటాల పరమపాదిగా బ్రతికిన దీశాలి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు తెలంగాణ రాష్ట్రం కోసం తన మంత్రి పదవిని త్యాగం చేసినారని తొలి తరం మలితరం తెలంగాణ కోసం నాయ కత్వం వహించినారని అన్నారు 96 సంవత్సరాల వయసులో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చలిలో దీక్ష చేసిన గొప్ప మహానుభావుడని కొని యాడారు ప్రత్యేక తెలం గాణ సాధన కోసం అహ ర్నిశలు శ్రమించినారని భారతదేశం లో సహకార సంఘాల స్థాపనకు ఎంతో కృషిచేసి ప్రజలను సంఘటి తంగా నడిపించిన ఆశ యాలను ముందుకు తీసు కుపోవాలని కోరారు భవిష్యత్తులో చట్టసభలలో పద్మశాలీల ప్రాతినిధ్యం ఉండాలని అందుకోసం మనమంతా ఐక్యతతో ముందుకు పోవాలని కోరారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు వంగర సాంబయ్య పిఎసిఎస్ చైర్మన్ కుసుమ శరత్ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు బాసని ప్రకాష్ మత్స్యగిరి స్వామి దేవా లయ చైర్మన్ సామల బిక్షపతి,జిల్లా కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాస్ దిడ్డి ప్రభాకర్ కొండ ముకుంద బూర లక్ష్మీనారాయణ దాసరి రమేష్ తుమ్మ ప్రభాకర్ బాసని నవీన్ కోమటి రాజశేఖర్ గొట్టిముక్కుల రమేష్ మంత్రి రాజు , రంగు మహేందర్ పసునూటి తిరుపతి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్...**





**మంచిర్యాల, నేటిధాత్రి:** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం నందులపల్లి గ్రామానికి చెందిన ఇందూరి నాగయ్య తన కుమారుడు తన భూమిలోకి రాకుండా అడ్డుకొని భయపెడుతున్నాడని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 5వ వార్డుకు చెందిన గుర్రం అంకమ్మ తాను చుట్టూ రేకులతో తాత్కాలిక ఇల్లు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్నానని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కల్లు సునీత తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరై బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని, బిల్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నెన్నెల మండలం గన్ పూర్ గ్రామానికి చెందిన కొట్టే అశోక్ తన తండ్రి పేరిట గల భూమి నిషేధిత జాబితాలో ఉందని, ఇట్టి భూమిని రికార్డుల ప్రకారం సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం కవ్వాల్ గ్రామ సర్పంచ్ తమ గ్రామపంచాయతీలో స్థానికంగా లేని కొంతమంది వ్యక్తులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంపై తగు విచారణ జరిపి ఓటరు జాబితా ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండల కేంద్రానికి చెందిన జి. శైలజ తాను కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఫిజిక్స్ గెస్ట్ టీచర్ గా విధులు నిర్వహించానని, తనకు రావలసిన వేతనం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు జిల్లాలోని మందమర్రి మున్సిపల్ పరిధిలోని శ్రీపతి నగర్ లో అక్షర యూత్ గణేష్ మండలి వారు ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడిని మున్సిపల్ కమిషనర్ రాజలింగు తో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక మండలి వారు మట్టి వినాయకుడిని పూజించడం సంతోషంగా ఉందని, ఇదే స్ఫూర్తితో అన్ని గణేష్ మండళ్ల నిర్వాహకులు మట్టి వినాయకుని పూజించాలని తెలిపారు. వినాయక విగ్రహాల తయారీకి వినియోగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ రంగుల ద్వారా వాయు, జల, నేల కాలుష్యం జరుగుతుందని, ఈ కాలుష్యాన్ని నియంత్రించే మట్టి వినాయకులను పూజించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# ప్రజావాణి కార్యక్రమంలో పిర్యాదుల వెల్లువ..



**దుగ్గొండి, నేటిధాత్రి:** దుగ్గొండి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పలువురు బాధితులు పిర్యాదు చేశారు.ప్రజావాణి పిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఎంపిడిఓ డాక్టర్ లెక్కల అరుంధతి సంబంధిత అధికారులను ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సమ్మక్క,డిప్యూటీ తాసిల్దార్ రఘు,ఎంపీఓ చంద్రమోహన్ స్వామి,వివిధ శాఖల అధికారులు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**కొనసాగుతున్న సర్ కార్యక్రమం..** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమం దుగ్గొండి మండల పరిధిలో కొనసాగుతున్నది.ఎంపిడిఓ డాక్టర్ లెక్కల అరుంధతి నాచినపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొనగా ఎమ్మార్వో సమ్మక్క మండలంలోని పలు గ్రామాల్లో పాల్గొన్నారు.

# లక్ష్మీ గణపతి సహకార పరపతి సంఘం



**ఆధ్వర్యంలో ఘనంగా అభిషేక పూజ**

**కాశిబుగ్గ, నేటిధాత్రి:** కాశిబుగ్గ వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లక్ష్మీ గణపతి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పంచలోహ గణపతి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, మహాహారతి, పల్లకి సేవ చేపట్టారు. అనంతరం భక్తులకు లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేశారు.బండారి భాస్కర్, వంగ రవి, క్యాతం రవీందర్ దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లక్ష్మీ గణపతి సహకార పరపతి సంఘం అధ్యక్షుడు వంగరి రాంప్రసాద్, ప్రధాన కార్యదర్శి మండల సురేష్, కోశాధికారి దుస్స కృష్ణతో పాటు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.కాశిబుగ్గ వర్తక సంఘం ఉపాధ్యక్షుడు బయ్య స్వామి, మండల శ్రీరాములు, గుల్లపెల్లి రాజకుమార్, గోనె జగదీశ్వర్, గుండేటి నరేంద్రకుమార్, ఓరుగంటి కొమురయ్య, గోరంటల మనోహర్, మాటేటి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. లక్ష్మీ గణపతి సహకార పరపతి సంఘం, కాశిబుగ్గ వర్తక సంఘం కార్యవర్గ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహణ



**వీణవంక, నేటిధాత్రి:** వీణవంక మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ సల్మాన్ రాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 45 రోజుల కార్యక్రమాల పురోగతిపై అధికారులు వివరాలు చదివి వినిపించారు. గ్రామల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులు, అందుతున్న ప్రభుత్వ సేవలు, శాఖల వారిగా చేపడుతున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. మిషన్ భగీరథ అధికారుల పనితీరు పై కొండపాక గ్రామ సర్పంచ్ దాట్ల వీరస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి సంబంధించిన నీటి పైప్ లైన్ మ్యాపును అందజేయాలని కోరగా, సంబంధిత అధికారులు 14 రోజుల లోపు వాటర్ పైప్ లైన్ మ్యాపు అందజేస్తామని హామీ ఇచ్చారు. అధికారుల పాలన పారదర్శకంగా ఉండాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ సల్మాన్ రాజ్ సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశిత గడువులో పూర్తిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో తాసిల్దార్ ముద్దసాని రమేష్, ఎంపీడీవో ప్రభాకర్, ఎంఈఓ శోభారాణి, వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# నేటిధాత్రి 9 NETI DHATHRI

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా
"నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు

## ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం




పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్‌ని
"పాఠక దేవుళ్ళ కోసం " " శక్తి బ్రాడ్ కాస్టింగ్స్ " ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటక సంతోషిస్తున్నాము.

"నేటిధాత్రి" పత్రికను ఆదరించిన
విధంగానే "నేటిధాత్రి 9"
" యూట్యూబ్ ఛానల్ " కూడా
ఆదరిస్తారని కోరుకుంటూ....



మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444



మీ
**కట్టా రాఘవేందర్ రావ్**
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

సంప్రదించవలసిన చిరునామా..

Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034

# కివి పండును తప్పనిసరిగా తినాల్సిందే..!

వర్షాకాలం అనేక రకాల రోగాలకు కారణమవుతుంది. ఈ సీజన్‌లో జాగ్రత్తగా లేకపోతే అనేక వ్యాధులను ఎదుర్కోవాల్సి వస్తుంది. దగ్గు, జలుబు, జ్వరం ఈ సీజన్‌లో కామన్‌గా వస్తూనే ఉంటాయి. ఇక దోమలు కుట్టడం వల్ల చికెన్ గున్యా, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వస్తాయి. అలాగే కలుషిత ఆహారం తిన్నా, నీళ్లు తాగినా టైఫాయిడ్ వస్తుంది. సాధారణంగా చిన్నారులు లేదా పెద్దలు ఎవరికైనా సరే వర్షాకాలంలోనే ఎక్కువగా రోగాలు వస్తుంటాయి. అయితే ఈ సీజన్‌లో రోగాల నుంచి రక్షణ పొందేందుకు గాను అన్ని రకాల జాగ్రత్తలను పాటించాలి. ముఖ్యంగా ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. శుభ్రమైన ఆహారాన్నే తినాలి. తినే ముందు కచ్చితంగా చేతులను శుభ్రం చేసుకోవాలి. అలాగే దోమలు వ్యాపించకుండా నివారణ చర్యలు చేపట్టాలి. ఇక ఆహారంలో పోషకాలు ఉండేలా చూసుకోవాలి. ఈ క్రమంలోనే రోగ నిరోధక శక్తిని పెంచే కివీ వంటి పండ్లను తినాలి. దీని వల్ల అనేక లాభాలు కలుగుతాయి.



**సీజనల్ వ్యాధులకు చెక్..**

వర్షాకాలంలో మనకు దగ్గు, జలుబు, జ్వరం వంటి సమస్యలు వస్తుంటాయి. ఇవి రాకుండా ఉండాలన్నా, వచ్చిన రోగాలు త్వరగా తగ్గాలన్నా మనకు రోగ నిరోధఖ శక్తి ఎక్కువగా ఉండాలి. కివీ పండ్లను తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వీటిల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. నారింజ పండ్ల కన్నా కివి పండ్లలోనే విటమిన్ సి మనకు అధికంగా లభిస్తుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. తెల్ల రక్త కణాలు ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో శరీరం రోగాలు, ఇన్‌ఫెక్షన్లపై పోరాటం చేస్తుంది. రోజూ కివీ పండ్లను తినడం వల్ల శ్వాసకోశ సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు. జ్వరం నుంచి కూడా త్వరగా కోలుకుంటారు. ఇక వర్షాకాలంలో మన జీర్ణ వ్యవస్థ పనితీరు మందగిస్తుంది. అజీర్తి, కడుపు ఉబ్బరం, ఫుడ్ పాయిజనింగ్ ఇబ్బందులకు గురి చేస్తాయి. ఇలాంటి సమస్యలు ఉన్నవారు కివి పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది. కివి పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది పేగుల్లో ఆహారం లేదా మలం కదలికలను సులభతరం చేస్తుంది. దీంతో మలబద్దకం తగ్గుతుంది. అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది.

**డెంగీ నుంచి త్వరగా రికవరీ..**

డెంగీ జ్వరం వచ్చిన వారు కివి పండ్లను తింటుంటే త్వరగా కోలుకుంటారు. డెంగీ వల్ల రక్తంలో ప్లేట్‌లెట్ల సంఖ్య పడిపోతుందన్న విషయం తెలిసిందే. అయితే కివి పండ్లను తింటుంటే తెల్ల రక్త కణాలు ఉత్పత్తి అవుతాయి. ఇవి ప్లేట్‌లెట్స్ తయారు అయ్యేలా చేస్తాయి. ఈ పండ్లలో ఉండే విటమిన్ సి వల్ల మనం తిన్న ఆహారంలో ఉండే ఐరన్‌ను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. ఐరన్ వల్ల రక్తం తయారవడం మాత్రమే కాదు, ప్లేట్‌లెట్ల ఉత్పత్తి సైతం పెరుగుతుంది. కివి పండ్లలో ఉండే ఫోలేట్ ఎర్ర రక్త కణాల తయారీకి దోహదం చేస్తుంది. దీంతో ప్లేట్‌లెట్లు వృద్ధి చెందుతాయి. డెంగీ నుంచి త్వరగా కోలుకుంటారు. కివి పండ్లను యాంటీ ఆక్సిడెంట్లకు నిలయంగా చెప్పవచ్చు. ఈ పండ్లలో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కణాలను రక్షిస్తాయి. ముఖ్యంగా ఈ పండ్లలో ఉండే పాలిఫినాల్స్ ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలించి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో వాపులు తగ్గుతాయి. అలాగే వర్షాకాలం సీజనల్‌గా వచ్చే వ్యాధులు తగ్గిపోతాయి.

**చర్మ సంరక్షణకు..**

వర్షాకాలంలో వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. దీని వల్ల అనేక రకాల చర్మ సమస్యలు వస్తుంటాయి. ముఖ్యంగా ఫంగస్, వైరస్ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. కానీ కివి పండ్లను తింటే విటమిన్ సి లభిస్తుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. దీంతో చర్మం సురక్షితంగా ఉంటుంది. చర్మం కాంతివంతంగా మారి యవ్వనంగా కనిపిస్తారు. ముఖంపై ఉండే మొటిమలు, మచ్చలు సైతం తొలగిపోతాయి. కివి పండ్ల గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ కూడా చాలా తక్కువగా ఉంటుంది. కనుక ఈ పండ్లను తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరగవు. పైగా ఈ పండ్లలో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. శరీరం ఇన్సులిన్ ను మరింత సమర్థవంతంగా వాడుకునేలా చేస్తాయి. దీంతో షుగర్ తగ్గి డయాబెటిస్ అదుపులో ఉంటుంది. ఇలా కివి పండ్లను వర్షాకాలంలో తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# కుంకుమ పువ్వు కేవలం గర్భిణీలకే కాదు..
# అందరికీ ఎంతో మేలు చేస్తుంది..!



గర్భంతో ఉన్న మహిళలు కుంకుమ పువ్వును పాలలో కలిపి తాగాలని మన పెద్దలు చెబుతుంటారు. వైద్యులు కూడా ఇదే విషయాన్ని సూచిస్తుంటారు. కుంకుమ పువ్వు కలిపిన పాలను తాగడం వల్ల గర్భిణీలు ఆరోగ్యంగా ఉంటారని, పిల్లలు ఆరోగ్యంగా పుడతారని వైద్యులు చెబుతుంటారు. అయితే కుంకుమ పువ్వు అనగానే కేవలం గర్భిణీలు మాత్రమే దీన్ని తీసుకోవాలని చాలా మంది అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. వాస్తవానికి కుంకుమ పువ్వును అందరూ తీసుకోవచ్చు. ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. కుంకుమ పువ్వు రెక్కలు 2 తీసుకుని నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను రోజుకు 2 సార్లు తాగవచ్చు. ఇలా కుంకుమ పువ్వుతో తయారు చేసే టీని తాగుతుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

**మానసిక సమస్యలకు..**

కుంకుమ పువ్వు టీని సేవించడం వల్ల మన మెదడులో న్యూరో ట్రాన్స్‌మిటర్ల ఉత్పత్తి పెరుగుతుంది. డోపమైన్, సెరొటోనిన్‌లు అధికంగా ఉత్పత్తి అవుతాయి. వీటిని మూడ్‌ను నియంత్రించే సమ్మేళనాలుగా చెబుతుంటారు. అందువల్ల కుంకుమ పువ్వుతో తయారు చేసే టీ ని తాగుతుంటే ఒత్తిడి, ఆందోళన తగ్గి మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. కుంకుమ పువ్వులో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ముఖ్యంగా క్రోసిన్, క్రోసెటిన్, సఫ్రనాల్, కాంప్‌ఫెరాల్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని, శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులను తగ్గిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో గుండె జబ్బులు, క్యాన్సర్, నాడీ సంబంధ వ్యాధుల వంటి ప్రాణాంతక రోగాలు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**గుండె ఆరోగ్యానికి..**

కుంకుమ పువ్వులో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల కారణంగా ఈ టీని సేవిస్తుంటే పలు రకాల క్యాన్సర్లు రాకుండా అడ్డుకోవచ్చు. శరీరంలో క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకోవచ్చు. ముఖ్యంగా పెద్దపేగు, బ్రెస్ట్, లంగ్, ప్రోస్టేట్, బోన్ క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు. ఈ విషయాన్ని సైంటిస్టులు తమ అధ్యయనాల ద్వారా నిరూపించారు. కుంకుమ పువ్వు టీని రోజూ తాగడం వల్ల శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. కుంకుమ పువ్వుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మెదడు కణాలను రక్షిస్తాయి. దీంతో మెదడు యాక్టివ్‌గా పనిచేస్తుంది. చురుగ్గా ఉంటారు. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. మతిమరుపు తగ్గుతుంది. వయస్సు మీద పడడం వల్ల వచ్చే అల్జీమర్స్ రాకుండా అడ్డుకోవచ్చు.

**మహిళల సమస్యలకు..**

మహిళలకు నెలసరి సమయంలో అనేక రకాల సమస్యలు వస్తుంటాయి. అలాంటి వారు కుంకుమ పువ్వు టీని సేవిస్తుంటే ఫలితం ఉంటుంతి. దీంతో వారికి ఉండే చిరాకు, తలనొప్పి, ఆహారంపై యావ, నొప్పులు వంటి సమస్యలు తగ్గిపోతాయి. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం కుంకుమ పువ్వు టీని తాగడం వల్ల శరీర మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనుకునే వారు కుంకుమ పువ్వు టీని తప్పకుండా తీసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. కుంకుమ పువ్వులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కంటి ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. కంటి చూపును పెంచుతాయి. కళ్ల సమస్యలు ఉన్నవారు కుంకుమ పువ్వు టీని తాగుతుంటే ఎంతగానో ఉపయోగం ఉంటుంది. ఇలా కుంకుమ పువ్వుతో మనం అనేక లాభాలను పొందవచ్చు.

# దానిమ్మ పండ్లను తినడం మరిచిపోకండి..



## ఎన్నో లాభాలను పొందవచ్చు..!

దానిమ్మ పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. చూసేందుకు ఎరుపు రంగులో ఎంతో ఆకర్షణీయంగా ఈ పండ్లు కనిపిస్తుంటాయి. దానిమ్మ పండ్లను తినేందుకు చాలా మంది ఇష్టం చూపిస్తుంటారు. ఈ పండ్లతో జ్యూస్ తయారు చేసి కూడా తాగుతుంటారు. దానిమ్మ పండ్లను ఈ సీజన్‌లో రోజూ తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఒక కప్పు దానిమ్మ గింజలను తింటే సుమారుగా 144 క్యాలరీల శక్తి లభిస్తుంది. 32 గ్రాముల పిండి పదార్థాలు, 7 గ్రాముల ఫైబర్, 3 గ్రాముల ప్రోటీన్లు, 2 గ్రాముల కొవ్వు, అధిక మోతాదులో విటమిన్ సి, కె, బి9, పొటాషియం, మాంగనీస్, కాపర్, ఫాస్ఫరస్, మెగ్నీషియం వంటి పోషకాలు లభిస్తాయి. దానిమ్మ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి.

**యాంటీ ఆక్సిడెంట్లు అధికం..**

యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్లలో దానిమ్మ పండ్లు ఒకటని చెప్పవచ్చు. ఈ పండ్లలో ప్యూనికాలాజిన్స్, ఆంథోసయనిన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. అందువల్లే ఈ పండ్లు ఎరుపు రంగులో ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గిపోతాయి. కణాలు ఆక్సీకరణ ఒత్తిడికి గురి కాకుండా రక్షిస్తాయి. దీని వల్ల వయస్సు వెనక్కి మళ్లుతుంది. చర్మం కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తారు. గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే నాడీ సంబంధ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. దానిమ్మ జ్యూస్‌ను తాగితే ఇంకా ఎక్కువ యాంటీ ఆక్సిడెంట్లను పొందవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

**గుండె ఆరోగ్యానికి..**

దానిమ్మ పండ్లలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఎంతటి వాపులను అయినా సరే ఈ పండ్లు తగ్గిస్తాయి. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు యాంటీ ఇన్ ఫ్లామేటరీ కారకాలుగా కూడా పనిచేస్తాయి. దీని వల్ల శరీరంలో ఉండే వాపులు, నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా ఆర్థరైటిస్, ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలు ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. అలాగే ఇన్‌ఫ్లామేటరీ బౌల్ డిసీజ్ (ఐబీడీ) సమస్యకు పరిష్కారం లభిస్తుంది. మెటబాలిక్ వ్యాధుల నుంచి సైతం బయట పడవచ్చు. దానిమ్మ పండ్లను తినడం వల్ల మన శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. దీంతో రక్త నాళాల్లో ఉండే కొవ్వు కరిగిపోతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా జాగ్రత్తగా ఉండవచ్చు. గుండె పనితీరు మెరుగు పడుతుంది.

**క్యాన్సర్ రాదు..**

దానిమ్మ పండ్లలో యాంటీ క్యాన్సర్ గుణాలు ఉంటాయి. సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాల ప్రకారం దానిమ్మ పండ్లను రోజూ తింటే పలు రకాల క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఈ పండ్లను తినడం వల్ల జీర్ణ వ్యవస్థకు సైతం మేలు జరుగుతుంది. మలబద్దకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దానిమ్మ పండ్లను తింటే మెదడు చురుగ్గా పనిచేస్తుంది. యాక్టివ్‌గా ఉంటారు. ముఖ్యంగా చిన్నారులకు ఈ పండ్లను తినిపిస్తే వారి తెలివితేటలు పెరుగుతాయి. చదువుల్లో రాణిస్తారు. ఈ పండ్లను తినడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఈ సీజన్‌లో ఈ పండ్లను తింటుంటే సీజనల్ వ్యాధులైన దగ్గు, జలుబు, జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. అలాగే ప్లేట్‌లెట్లను పెంచడంలోనూ దానిమ్మ ఎంతగానో సహాయం చేస్తుంది. కనుక ఈ పండ్లను ఈ సీజన్‌లో తినడం మరిచిపోకండి. లేదంటే అనేక లాభాలను కోల్పోతారు.

# డార్క్ చాకొలెట్లను తరచూ తింటే
# ఇన్ని లాభాలు కలుగుతాయా..



చాకొలెట్లలో అనేక రకాలు ఉంటాయన్న సంగతి తెలిసిందే. వీటిని చిన్నారుల నుంచి పెద్దల వరకు చాలా మంది ఇష్టంగానే తింటుంటారు. అయితే అన్ని చాకొలెట్లూ ఆరోగ్యకరం కాదు. కానీ డార్క్ చాకొలెట్లు మాత్రం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. డార్క్ చాకొలెట్లలో కొకొవా అధికంగా ఉంటుంది. కనుక అలాంటి చాకొలెట్లను తింటే ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయని అంటున్నారు. డార్క్ చాకొలెట్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వీటి వల్లే ఈ చాకొలెట్లు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఈ చాకొలెట్లలో ఫ్లేవనాల్స్ ఉంటాయి. ఇది ఒక రకమైన ఫ్లేవనాయిడ్స్ జాబితాకు చెందుతుంది. అలాగే వీటిలో పాలిఫినాల్స్ కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి.

**గుండె ఆరోగ్యానికి..**

డార్క్ చాకొలెట్లలో అనేక ఆర్గానిక్ సమ్మేళనాలు ఉంటాయి. సాధారణంగా మనకు. ఇవన్నీ బెర్రీ జాతులకు చెందిన పండ్లలో అధికంగా లభిస్తాయి. కానీ డార్క్ చాకొలెట్లను తినడం వల్ల కూడా యాంటీ ఆక్సిడెంట్లను అధికంగా పొందవచ్చు. అందువల్ల ఈ చాకొలెట్లను తింటే శరీరంలో ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీని వల్ల శరీరంలో అంతర్గతంగా ఏర్పడే వాపులు తగ్గిపోతాయి. గుండె జబ్బులు, పలు రకాల క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. డార్క్ చాకొలెట్లలో అధికంగా ఉండే ఫ్లేవనాల్స్ మన శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఇది రక్త నాళాలను ప్రశాంత పరుస్తుంది. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. ఫలితంగా బీపీ తగ్గుతుంది. బ్లడ్ క్లాట్స్ ఏర్పడకుండా ఉంటాయి. కనుక హైబీపీ ఉన్నవారు డార్క్ చాకొలెట్లను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

**డయాబెటిస్ నియంత్రణకు..**

డార్క్ చాకొలెట్లలో ఉండే పాలిఫినాల్స్ మన శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను పెంచుతాయి. దీంతో రక్త నాళాల్లో ఉండే కొవ్వు కరిగిపోతుంది. దీని వల్ల హార్ట్ ఎటాక్ రాకుండా జాగ్రత్త పడవచ్చు. డార్క్ చాకొలెట్లు తియ్యగా ఉంటాయి. కానీ తక్కువ గ్లైసీమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉంటాయి. అందువల్ల ఈ చాకొలెట్లను తింటే షుగర్ లెవల్స్ అంతగా పెరగవు. పైగా ఈ చాకొలెట్లలో ఉండే ఫ్లేవనాల్స్ ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తాయి. దీంతో శరీరం ఇన్సులిన్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. ఫలితంగా షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. కనుక డయాబెటిస్ ఉన్నవారు కూడా నిరభ్యంతరంగా డార్క్ చాకొలెట్లను తినవచ్చు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదు.

**మెదడు యాక్టివ్‌నెస్ కోసం..**

డార్క్ చాకొలెట్లలో ఉండే ఫ్లేవనాల్స్ మెదడుకు రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. దీని వల్ల మెదడు పనితీరు మెరుగు పడుతుంది. యాక్టివ్‌గా మారుతుంది. అప్రమత్తత పెరుగుతుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని పెంచుకోవచ్చు. చిన్నారులకు డార్క్ చాకొలెట్లను తరచూ ఇస్తుంటే వారి మెదడు చురుగ్గా పనిచేస్తుంది. చదువుల్లోనూ రాణిస్తారు. అయితే డార్క్ చాకొలెట్లను మాత్రమే ఇవ్వాలి. చక్కెర అధికంగా ఉండే సాధారణ చాకొలెట్లను ఇవ్వకూడదు. ఇక డార్క్ చాకొలెట్లను తినడం వల్ల మన శరీరంలో ఎండార్ఫిన్లు రిలీజ్ అవుతాయి. ఇవి ఫీల్ గుడ్ హార్మోన్ల జాబితాకు చెందుతాయి. కనుక మన మూడ్ మారుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది. రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. నిద్ర లేమి నుంచి బయట పడవచ్చు. ఇలా డార్క్ చాకొలెట్లను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# ఇద్దరిలో ఒకరు ఎందుకలా



హలో జిందగీ. కవల పిల్లలు పుట్టినప్పుడు ఒకరు బలహీనంగా మరొకరు బలంగా, ఒకరు ఆరోగ్యంగా మరొకరు సమస్యలతో పుట్టడానికి కారణం ఏమిటి? కవల పిల్లలు కడుపులో ఉన్నప్పుడు వాళ్లు చక్కటి ఆరోగ్యంతో పుట్టాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? తెలుపగలరు.

ఓ పాఠకురాలు

కవల పిల్లల్లో ఒకరు బలంగా, ఇంకొకరు బలహీనంగా ఉండటానికి రకరకాల కారణాలు ఉంటాయి. ముఖ్యంగా వాళ్లు ఒకే అండం నుంచి ఏర్పడ్డారా లేదా రెండు అండాల నుంచి ఏర్పడ్డారా అన్నది ముఖ్యం. వంశపారంపర్యం ఉన్నవాళ్లకు రెండు వేర్వేరు అండాల నుంచి పిండాలు ఏర్పడతాయి. దానివల్ల ఇద్దరు పిల్లలూ కొంత ఆరోగ్యంగా ఉండటానికి అవకాశం ఉంది. కానీ ఒకే అండం నుంచి ఏర్పడి ఒకే మాయ, ఉమ్మనీరు పంచుకుంటే మాత్రం ఎక్కువ శాతం ఒకరు బలహీనంగా ఉంటారు. ఐవీఎఫ్‌లాంటి విధానాల్లో పిండం ఏర్పడితే ఇలాంటి పరిస్థితే ఎదురవుతుంది. ముఖ్యంగా ఒకే మాయలో ఉన్నప్పుడు ఇద్దరికీ రక్త ప్రసరణ సమానంగా ఉండదు. ఒకరికి ఎక్కువ, మరొకరికి తక్కువ అందుతుంది. అలాగే ఒక బిడ్డ నుంచి మరో బిడ్డకు రక్తం వెళ్లే పరిస్థితులూ ఉంటాయి.

అలాంటప్పుడు మొదటి బిడ్డ గుండె బలహీనంగా ఉంటుంది. ఇవి మాత్రమే కాదు, బిడ్డ ఏర్పడటంలోనూ రకరకాల ఇబ్బందులు తలెత్తుతాయి. తల్లికి కూడా హైబీపీ వచ్చే అవకాశాలు ఉంటాయి. ప్రీ మెచ్యూర్ డెలివరీ అయ్యే అవకాశాలూ ఎక్కువే. అలాగే డెలివరీ సమయంలో రక్తం ఎక్కువగా పోతుంది. ఇద్దరు బిడ్డలకు సరిపడా పెద్దగా సాగిన గర్భాశయం తిరిగి సాధారణ స్థితికి రావడానికి సమయం పడుతుంది. అందుకే, కడుపులో కవలలు ఉన్నప్పుడు డాక్టర్ చెప్పిన సూచనలను జాగ్రత్తగా పాటించాలి. ముఖ్యంగా చిన్నపిల్లలకు అత్యవసరమైన ఎన్ఐసీయూ సదుపాయం ఉండే ఆసుపత్రులకు అందుబాటులో ఉండాలి. మొత్తంగా చెప్పాలంటే సాధారణ గర్భం కంటే మరింత జాగ్రత్తగా ఉండటం ద్వారా కొంతవరకూ కాంప్లికేషన్లను అధిగమించవచ్చు.

**డాక్టర్ పి. బాలాంబ సీనియర్ గైనకాలజిస్ట్**

# గోధుమ పిండికి ఇవి కలిపితే
# టేస్టీ, హెల్దీ రోటీలు రెడీ..!



బరువు తగ్గాలనుకునే వారు రైస్ పక్కనపెట్టి రోటీలు తినడం సర్వసాధారణం. గోధుమ పిండితో చేసే రోటీలు, చపాతీలకు బదులు ఈ పిండిలో పోషకాలతో కూడిన పలు రకాల పొడులు, పిండి కలపడం ద్వారా మెరుగైన ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. గోధుమ పిండితో చేసే రెగ్యులర్ రోటీలను కొద్దిపాటి మార్పులతో రుచిగా, హెల్దీగా తయారుచేసుకోవచ్చు

గోధుమ పిండిలో పోషకాల గనిగా పేరొందిన మునగాకు పొడిని మిక్స్ చేస్తే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కప్పు గోధుమ పిండిలో కేవలం ఒక స్పూన్ మునగాకు పొడి కలిపితే రోటీలు ఆకుపచ్చ వర్ణంలో పోషకాలతో నిండిఉంటాయి. మునగాకులో ఉండే విటమిన్ ఏ, పాలకూరలో కంటే మూడు రెట్లు అధికం. ఇందులో ఉండే అధిక ఫైబర్, యాంటీఆక్సిడెంట్ క్లోరోజెనిక్ యాసిడ్ కారణంగా బరువు నియంత్రిస్తుంది.మునగాకు పొడితో పాటు యాంటీఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ పదార్థాలు పుష్కలంగా ఉండే పసుపును వాడటం కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆటాలో ఒక కప్పు పిండికి స్పూన్ పసుపు కలిపితే రోటీలు బంగారు వర్ణంలో మెరుస్తూ అద్భుత రుచినీ అందిస్తాయి. ఆర్థరైటిస్, జీర్ణ సమస్యలు, కుంగుబాటు, అలర్జీలకూ పసుపు దివ్యౌషధంగా పనిచేస్తుంది. పప్పు, కర్రీస్‌కు కూడా పసుపు మంచి రుచిని అందిస్తుంది. ఇక రోటీలు టేస్ట్‌గా, ఆరోగ్య ప్రయోజనాలను అందించేలా ఉండాలంటే వీటిని మిక్స్ చేస్తే బెటర్..

మునగాకు పొడి ,పసుపుజి,మెంతి పొడి

# పేగులు బాగుండాలంటే..

ఆయాసం, వాంతులు, మలబద్ధకం, గ్యాస్, అవాంఛితంగా బరువు పెరగడం, బరువు తగ్గడం, నిద్రలేమి, అలసట ఇవన్నీ పేగుల అనారోగ్యాన్ని సూచిస్తాయి. ఇక పేగులను ఆరోగ్యంగా ఉంచడంలో ప్రొబయోటిక్ ఆహార పదార్థాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. వాటికోసం ఎక్కడో వెతకాల్సిన పన్లేదు. మన వంటల్లోనే ఉన్నాయి.

రసం: పప్పు, చింతపండు, మూలికలు, సుగంధ ద్రవ్యాలు రసం తయారీకి ముడిసరుకులు. వీటిలో ఎ, సి విటమిన్లు, మెగ్నీషియం, ఇనుము, కాల్షియం సమృద్ధిగా ఉంటాయి. రసంలో పీచు పదార్థాలూ ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థకు గొప్పగా ఉపయోగపడతాయి.

కఢీ: దీన్ని శనగపిండితో చేస్తారు. ఇందులో పుష్కలంగా ఉండే మెగ్నీషియం, ఫైబర్ పేగుల ఆరోగ్యానికి అత్యవసరం. కడుపునొప్పి, మలబద్ధకం, బరువు తగ్గడానికి వంటింటి చిట్కా కఢీ.

మెంతికూర: బరువు తగ్గడం, మలబద్ధకం లాంటి పేగులకు సంబంధించిన సమస్యలలో మెంతులు ఎంతో సహాయకారి. ఈ ఆహార పదార్థాలకు అదనంగా వ్యాయామం, యోగా, తగినన్ని నీళ్లు పేగులను ఆరోగ్యంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి.

# గాలిలో చెక్కర్లు బాలుడి కృష్ణ లీలలు? ఎపిసోడ్-1

# డిసి బాలకృష్ణే డిక్టేటర్!?




## ఆ బాలకృష్ణ 500 కోట్లు..ఈ బాలకృష్ణ 1000 కోట్లు?



## ఆ బాలకృష్ణకు ఈ బాలకృష్ణ తాత?






చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888

- ఎన్ని ఫ్లోర్లు కట్టుకుంటావో కట్టుకోపో.. నీ ఇష్టం అంటాడు?
- చావు కబురు చల్లగా ఒక ఫ్లోర్ నాదని మెలిక పెడతాడు?
- సర్కిల్‌లో ప్రైవేట్ సైన్యం పెట్టుకున్నాడు?
- వారానికి 20 లక్షలు తేవాలంటాడు?
- కట్టిన బిల్డింగులకు "హైడ్రా" పేరు చెబుతాడు?
- నోటీసులు ఇస్తామని బెదిరిస్తాడు?
- పెద్దల పేర్లన్నీ చెబుతాడు?
- కీలక నాయకుల పేర్లు చెప్పి భయపెట్టిస్తాడు?
- వాళ్లందరికీ వాటాలు పంచాలని కట్టు కథలు చెబుతాడు?
- ఆ నాయకులకు తెలియకుండానే కథ మొత్తం నడిపిస్తున్నాడు?

## ఆ ప్రముఖులను అబాసుపాలు చేస్తున్నాడు?

- అందరికీ పంచంగా నాకేం మిగులుతుందని అంటాడు?

హైదరాబాద్, నేటిధాత్రి:

కష్టపడి చదివి ఉద్యోగం తెచ్చుకున్నది ప్రజలకు సేవ చేసేందుకు కాదు? ఉద్యోగం మాకు ఎవరి భిక్ష కాదు. పాలకులు ఇచ్చిందికాదు. ప్రజలు ఇచ్చిందికాదు. రాత్రి పగలుకష్టపడి ఉద్యోగం తెచ్చుకున్నది జనానికి ఫ్రీగా సర్వీస్‌చేసేందుకు కాదు? అన్నట్లే వుంది. కొంత మంది అధికారుల తీరు. వ్యవస్థలో చాలా మంది మంచి వాళ్లు వుంటారు. కాని పడికెడు మంది లంచావతారులు మూలంగా మొత్తం ఆ సమాజమే భ్రష్టు పట్టిపోతోంది. లంచాలకు అలవాటు పడి, పెన్ను కదలాంటే లక్షలు చెల్లించాల్సిందే అన్నట్లు వ్యవహరిస్తున్న వాళ్లు చాల మందే కనిపిస్తున్నారు. అలా వందల కోట్లు సంపాదించుకుంటున్న అదికారులు కొందరున్నారు. దొరికిన వాళు బైట పడ్డ సందర్భాలున్నాయి. దొరికితే కదా దొంగలం అనుకొని రకరకాల మార్గాలో ఏసిబికి చిక్కకుండా లంచాలు తీసుకుంటున్న వాళ్లు వున్నారు. వాళ్లు గురించి ప్రజలు బైట పెట్టలేరు. ఎవరి అవసరం వాళ్లది. ఒకప్పుడు రాజకీయ నాయకులు కోట్లు సంపాదించేవారు అనే మాటలు వినేవాళ్లం. జనానికి భయపడకపోయినా , ఉద్యోగులు నాయకులకు భయపడి ఉద్యోగం చేసుకునే వారని విన్నాం. కాని ఇప్పుడు రాజకీయ నాయకులనే శాసించేలా ఉద్యోగులు తీసుకుంటున్న లంచాలు సమాజాన్ని ప్రశ్నిస్తున్నాయి. ప్రజలను బానిసలను చేస్తున్నాయి. లంచాలు ఇవ్వనిదే పని కాదనే స్థితిలోకి నెట్టేస్తున్నాయి. అలా జిహెచ్‌ఎంసి లో సర్కిళ్ల వారిగా డిసిలు, టౌన్ ప్లానింగ్ అదికారులు కొంత మంది వున్నారు. వాళ్లందరిలో లంచాలలోనే చరిత్ర సృష్టించిన ఓ డిప్యూటీ కమీషనర్ పేరు ఇప్పుడు ప్రముఖంగా వినిపిస్తోంది. ఒకప్పుడు హెచ్‌ఎండిఏ పరిధిలో పనిచేసిన బాలకృష్ణ అనే అదికారి ఆస్థుల 500 కోట్లు అని ఏసిబి అదికారులు తేల్చిన సందర్భం చూశారు. సంపాదనలో ఆ బాలకృష్ణకు తాతను నేను అనేలా మరో బాలకృష్ణ తయారయ్యాడని జనం చెప్పుకుంటున్నారు. ఆ సర్కిల్ కార్యాలయంలో అడుగు పెడుతూనే గుండెను అదిమి పట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఎదురౌతోందని చెబుతున్న వాళ్లున్నారు. ఆ డిక్టేకర్‌లాంటి డిసి ఇప్పటికే వెయ్యి కోట్లు సంపాదించి వుంటారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఒక అదికారి వెయ్యి కోట్లు సంపాదించడం సాధ్యమేనా అనే ప్రశ్నకు కూడా సమాధానాలు కనిపిస్తున్నాయి. గతంలో ఆ డిసి పనిచేసిన సర్కిల్‌లో సుమారు పదిహేను వేల వరకు అప్పార్టు మెంట్ల నిర్మాణం జరిగిందని ఒక లెక్క. అప్పార్టు మెంటుకు ఒక లక్ష చొప్పున లంచం తీసుకున్నా, అవే వెయ్యికోట్లు అవుతున్నాయని తెలుస్తోంది. నగరం గత పదేళ్ల కాలంలో విస్తృతంగా విస్తరించింది. రియల్ వ్యాపారం విపరీతంగా పెరిగింది. నగర శివారు మొత్తం అప్పార్టుమెంట్లతో నిండిపోయింది. ఒకప్పుడు జన సంచారం కనిపించని ప్రాంతాలన్నీ ఇప్పుడు కాంక్రీట్ జంగల్ అయిపోయాయి. అలా నగర శివారు గతంకన్నా అనేక రెట్లు పెరగడంతో వ్యాపారులకు జరిగిన మేలు కంటే అదికారులు పొందిందే ఎక్కువ. పోగేసుకున్న సొమ్మే ఎక్కువ అని జనమే చెప్పుకుంటున్నారు. బాలకృష్ణ అనే ఈ డిసి ఇంటి పర్మిషన్లు ఇచ్చే సమయంలో చెప్పే మాటలు, ఇచ్చే భరోసాలు విన్నప్పుడు ఎంతో కూల్‌గా చెబుతారని టాక్. సహజంగా జిహెచ్‌ఎంసి పరిధిలో ఇంటి నిర్మాణం అంటే కేవలం జీ ప్లస్ మాత్రమే వుంటుంది. ఈ డిసి కూడా పర్మిషన్లు అంతే ఇస్తారు. కాని నీ ఇష్టం ఎన్ని అంతస్థులు కట్టుకుంటావో కట్టుకోపో? ఎవరొస్తారో నేను చూసుకుంటాను పో...అని భరోసా ఇస్తారు. డిసి చెప్పాడనే ధైర్యంతో ఆయన మాటలు నమ్మి నిర్మాణాలు మొదలై స్లాబ్‌లు పడగానే డిసి అక్కడికి చేరుకుంటారు. బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్‌పరిశీలిస్తారు. ఇందులో ఓ ఫ్లోర్ నాదని చావు కబురు చల్లగా చెబుతారు. దాంతో అప్పటికే నిర్మాణం చేసుకునేవారి గుండె జారి పోతుంది. ఫ్లోర్ మొత్తం ఇస్తే నాకేం మిగులుతుందని అంటే ఇక అంతే!! ఆ బిల్డింగ్ పని అంతే!! నమ్మించి అదికారి మోసం చేశాడని ఆ వ్యక్తి చెప్పుకోలేడు. నిర్మాణంలో వున్న బిల్డింగ్‌ను కూల్చితే కోలుకోలేడు. బ్యాంకుల్లో కోట్లు రుణాలు తెచ్చి కట్టుకుంటున్న బిల్డింగ్‌ను కూల్చుకోలేడు. దాంతో సరే అని చెప్పకుండా తప్పించుకోలేడు. ఓ ఫ్లోర్ రాసిస్తారు. అది అమ్మితే వచ్చే మొత్తం డిసి చేతుల్లో పెట్టెస్తారు. ఇదీ ఈ డిసి సృష్టించిన కొత్త ట్రెండ్. చేతికి మట్టి అంటకుండా, లంచాలు తీసుకుంటున్నట్లు కనిపించకుండా భలే స్కెచ్ వేస్తాడు. అదే సయమంలో ఇందులో నాకేం మిగుతుంది. అంతా పెద్దలకే పోతుంది. నాకు పది పైసలు మిగిలితే ఎక్కువ అని బిల్డర్లతో డిసి చెబుతుంటారు. వాళ్లు కూడా నిజమే అని నమ్ముతుంటారు. అంతే కాదు ఆ డిసి చిన్న చిన్న నాయకుల పేర్లు చెప్పడు. అతి కీలకమైన నాయకుల పేర్లు దర్జాగా వాడుకుంటారు. స్దానికి ఎమ్మెల్యే ఊరుకోడని కూడా బెదిరిస్తుంటాడు. మీరిచ్చే దానిని పై వాళ్లందరికీ పంచాలి. అని చెబుతుంటాడు. నిజానికి ఈ వ్యవహారం అంతా ఆ నాయకులకు తెలియకుండానే చేస్తున్నాడు. నాయకుల పేర్లు చెప్పి కట్టు కథలు, పిట్ట కథలు చెప్పి వసూలు చేస్తుంటాడు. లంచాల కథ మొత్తం నడిపిస్తుంటాడు. ఇలా ఒక డిసి నాయకుల పేర్లు చెప్పడం వల్ల ఆ నాయకులు అబాసుపాలౌతున్నారు. జనంలో అనవసరంగా వాళ్ల పేర్లు బైటకు వస్తున్నాయి. కనీసం వాళ్లకు సమచారం లేకుండానే ఇదంతా ఆ డిసి చేస్తున్నారు. ఈ దందా ఇలా వుంటే సర్కిల్ పరిధిలో ఓ పదిమంది ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఆ పది మంది నిత్యం సర్కిల్ పరిధిలో వున్న ఇండ్ల వివరాలు సేకరిస్తుంటారు. వాళ్ల వద్దకు వెళ్లి డిసి పేరు చెప్పి వసూలు చేస్తుంటారు. వారంలో కనీసం ఆ ప్రైవేటు సైన్యం రూ.20 లక్షలకు వరకు వసూలు చేయాల్సిందే అని హుకూం జారీ చేస్తారు. ఇక ఇటీవల హైడ్రా మార్కు చేసిన ఇండ్లకు సంబంధించి కాపాడుతామని చెప్పిస్తాడు. ప్రైవేటు సైన్యంతో బేర సారాలు చెయిస్తాడు. అవసరమైతే ఆయనే రంగంలోకి దిగుతాడు. ఇలా కూడా హైడ్రా కమీషనర్ రంగనాథ్ పేరు కూడా వాడుకుంటున్నాడు. రంగనాథ్‌ను కూడా బద్నాం చేస్తున్నాడు. వాళ్ల నుంచి డబ్బులు తీసుకొని హైడ్రా మీ మీదకు రాదని చెబుతుంటారు. నిజానికి ఒక్కసారి హైడ్రా మార్కు పెట్టిందంటే దానిని కాపాడడం సాధ్యమే కాదు. ఇందులో మరో కోణం వుంది. హైడ్రా మార్కు చేసిన సమీపంలో ని ఇండ్ల యజమానులను కూడా బెదిరించి డబ్బులు వసూలు చేయిస్తారని కూడా ఓ సమాచారం. హైడ్రా వస్తుంది? మీకు కూడా నోటీసులు ఇస్తుంది? అని కూడా వాళ్లను భయ బ్రాంతులకు గురి చేసి కూడా డబ్బులు వసూలు చేయడంలో ఈ డిసి దిట్ట అని కూడా చెప్పుకుంటున్నారు. తాజాగా ఓ జాతీయ పార్టీకి చెందిన ఓ కార్యాలయం వుంది. అందులో ఆ రాజకీయ పార్టీకి చెందని అనుబంధ సంస్థ కార్యకాలాపాలు సాగుతుంటాయి. కార్యకర్తలు అందులో వుంటుంటారు. ఆ కార్యాలయానికి కూడా నోటీసులు ఇస్తామని ఈ డిసి బెదిరించి, లంచం డిమాండ్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ కార్యకర్తలు మేమెక్కడి నుంచి తెచ్చివ్వాలాంటూ హైడ్రాను ఆశ్రియించినట్లు కూడా తెలుస్తోంది. దాంతో ఈ డిసి హైడ్రా పేరును ఎలా వాడుకుంటున్నారో వెలుగులోకి వచ్చినట్లు చెప్పుకుంటున్నారు. ఇలాంటి అధికారి ఆక్రమాస్థుల మీద ఏసిబి అధికారులు దృష్టిపెడితే గాని ఆ డిసి దందా ఆగదు. జనాన్ని పీడించు తినడం ఆపడు. పైగా పెద్ద పెద్ద వాళ్ల పేర్లు చెప్పి వసూళ్లు చేయడం తప్పని తెలుసుకోలేడు. లంచాలు ఇచ్చిన వాళ్లు కూడా తేలు కుట్టిన దొంగల్లానే వుంటారు. ఎందుకంటే అనుమతికి మించి నిర్మాణాలు చేసుకునే వాళ్లు కూడా అక్రమ నిర్మాణాలే చేస్తుండడంతో డిసిపై పిర్యాధు చేయడానికి ఎవరూ సాహసించరు. వాళ్లు చేసేదే అక్రమం కావడంతో జీ ప్లస్‌కన్నా ఎక్కువ నిర్మాణాలు చేపట్టలేరు. అందుకే డిసి చెప్పినట్లు వింటారు. నేను చూసుకుంటానని చెప్పే డిసి మాటలు వింటారు. డిసి అడిగింది చేతుల్లో పెడతారు. ఇదీ భ్రష్టు పట్టి పోతున్న వ్యవస్థ తీరు. ఏసిబి రంగంలోకి దిగితే అసలు సంగతులన్నీ బైట పడతాయని జనం అంటున్నారు.

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

Printed, Published & owned by Katta Raghavender Rao, Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail : netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999